పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్
గతితార్కిక భౌతికవాదం
1(బి)

# భారతీయ తత్వశాస్త్రం

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్

**1 (బి)**

# భారతీయ తత్వశాస్త్రం

ప్రచురణ

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**

ఆంధ్రప్రదేశ్ కమిటీ

**ప్రథమ ముద్రణ** : జులై, 2025

**ప్రతులు** : 1000

వెల : ₹ .50

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విశాఖపట్నం, ఏలూరు, విజయవాడ

గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు

***website : www.psbh.in***

prajasaktipublishinghouse@gmail.com

**ముద్రణ**

ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై.లి. విజయవాడ

166996

# భారతీయ తత్వశాస్త్రం

## 1. సైద్ధాంతిక పోరాట ప్రాధాన్యత

భారతదేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో సైద్ధాంతిక పోరాటాన్ని చేపట్టవలసిన అవసరం గతంలో కన్నా ఇప్పుడు ఎక్కువగా ఉంది. తాత్విక రంగంలో మనం ఇప్పుడు ఎదుర్కొంటున్న సవాళ్ళను అధిగమించేముందు, మనం "గతకాలపు తాత్విక చైతన్యంతో లెక్కలు తేల్చుకోవాలి" - (లెనిన్)

## 2. భారతదేశ పరిస్థితి

సాంప్రదాయ భారతీయ తత్వ శాస్త్రానికి సంబంధించి సారస్వతం చాలా ఎక్కువ మొత్తంలో పోగుబడింది. ఇందులో చాలా భాగం ఇప్పుడు భారతీయ ప్రజానీకం నడుమ ప్రచారంలో ఉంది. వారి ప్రవర్తన తీరును అది ప్రభావితం చేస్తోంది. అందుచేత మనం ఈ ప్రత్యేకతలను పరిగణనలోకి తీసుకుని మన సైద్ధాంతిక పోరాటానికి అనువైన వ్యూహాన్ని రూపొందించుకోవాలి.

ఉపనిషత్తులలో అత్యంత ప్రాచీనమైనవి క్రీ.పూ 7 -6 శతాబ్దాలనాటివి. అక్కడితో మొదలుపెట్టి ప్రాచీన తాత్విక చింతనపై క్రీ.శ. 16 -17 శతాబ్దాల కాలానికి చెందిన నవ్యన్యాయ అనే గ్రంథం (దీనిని గదాధరుడు రచించాడు) వరకూ దాదాపు 2500 సంవత్సరాల కాలానికి చెందిన తాత్విక గ్రంథాలు మన దేశంలో ఉన్నాయి. అంటే మన దేశంలో దాదాపు 2500 సంవత్సరాల పాటు తాత్విక కృషి సాగిందన్నమాట. తాత్విక చర్చల్లో వాద ప్రతివాదాల ద్వారా అవగాహన కల్పించడం అనేది మన దేశంలో ఆచరించారు. వాదనను ప్రతిపాదించినవారు 'పక్షం' అయితే దానికి ప్రతివాదన చేసినవారు 'విపక్షం' గా వ్యవహరించేవారు. ఆ వాదనల్లో చాలా

భాగం కోడిగుడ్డుమీద ఈకలు పీకడం వంటివే ఉన్నాయి. అందువలన మన తాత్విక సారస్వతం చాలా ఎక్కువమొత్తంలో తయారైంది.

ఈ తాత్విక సారస్వతం అంతా పండితులను ఉద్దేశించి రూపొందించినదే అయినా దానిలోని సారాంశం కేవలం పండితులకోసం మాత్రమే ఉద్దేశించినది కాదు. అందులో గణనీయమైన భాగం భారతీయుల నడుమ యధేచ్ఛగా సాంప్రదాయ ప్రచార పద్ధతుల ద్వారా ప్రచారం పొందుతూనేవుంది. తద్వారా అత్యంత ప్రాధాన్యత కలిగిన సైద్ధాంతిక భావనలను, వైఖరులను నిరక్షరాస్యులైన ప్రజల మధ్యసైతం ప్రచారం చేయడం సాధ్యమైంది. పురాణాలలో, మరీ ముఖ్యంగా రామాయణ, భారతాల్లో చాలా ఎక్కువ మోతాదులో తాత్విక భావనలను జొప్పించారు. నేటికీ, ఈ పురాణాలను సాధారణ ప్రజల మధ్య పఠిస్తూనేవున్నారు, తద్వారా, పాలకవర్గాలకు అనుకూలంగా ఉండే భావజాలాన్ని ప్రజానీకంలో ప్రచారం చేసి వారిని తమ అదుపులో ఉంచుకుంటున్నారు.

వీటితోబాటు, మరణానంతర జీవితానికి సంబంధించిన భావనలను, మూఢ నమ్మకాలను ప్రజలమధ్య ప్రచారంలో పెడుతూ వారు భయంతో లొంగివుండేట్టు చూసుకుంటున్నారు. ఈ పాత దుస్సాంప్రదాయాలు నేటికీ కొనసాగుతూనేవున్నాయి. కొత్తగా ప్రసారమాధ్యమాలుగా వచ్చిన టివి, సినిమా, ఇంటర్నెట్ కూడా ఈ ప్రచారాన్ని చేపట్టే సాధనాలుగా ఉన్నాయి.

ఈ ప్రసార మాధ్యమాల ద్వారా ఆత్మ, పరబ్రహ్మ, మాయ, మరణానంతర జీవితం, పునర్జన్మ, విధి (ఏం రాసిపెట్టివుందో అదే జరుగుతుంది, దానిని తప్పించలేము) కర్మ వంటి భావవాద తాత్విక భావనలను ప్రజల మెదళ్ళలో ఇంకిపోయేలా యధేచ్ఛగా ప్రచారం చేస్తున్నారు. మూఢ నమ్మకాల వలన, మూఢాచారాల వలన కలిగే భయాలు దీనికి అదనంగా తోడవుతున్నాయి.

ఒకవైపు కార్పొరేట్ల దోపిడీ, మరొకవైపు హిందూ రాజ్య స్థాపన అనే జంట లక్ష్యాలను కలిగివున్న హిందూత్వ–కార్పొరేట్ కూటమి ప్రజలనుండి ఆ లక్ష్యాలకు ప్రతిఘటన పెద్దగా రాకుండా చేయడానికి ఈ భావజాలాన్ని చురుకుగా ప్రచారం చేయడానికి దోహదం చేస్తున్నాయి.

ఈ హిందూత్వాకార్పొరేట్ కూటమి దోపిడీకి వ్యతిరేకంగా ప్రజానీకం పెద్దఎత్తున ప్రతిఘటనకు పూనుకోవాలంటే, ఈ భావజాలం మీద పెద్ద స్థాయిలో సైద్ధాంతిక పోరాటాన్ని నిర్వహించాలి.

**"భౌతిక శక్తులను భౌతిక శక్తులతోటే ఓడించగలం. ఐతే, ఒకానొక సిద్ధాంతం ప్రజలను ఆకట్టుకోగానే అది కూడా ఒక భౌతిక శక్తి అవుతుంది" – మార్క్స్**

ప్రజానీకాన్ని కులతత్వం, మత తత్వం, ఆధ్యాత్మికత, ధర్మశాస్త్రాలపట్ల వ్యామోహం, హేతు విరుద్ధమైన భావాలు, ఛాందసత్వం తదితర భావాల ప్రభావంలో ముంచి, ఆ ప్రజలు ఈ భౌతిక ప్రపంచంలో వాస్తవంగా జరుగుతున్న పరిణామాలను గుర్తించలేని అశక్తత కు లోనయేట్టు చేస్తున్న సైద్ధాంతిక శక్తులమీద మనం పోరాటం నిర్వహించాలి.

**మొదట :** మనం మన గతకాలపు తాత్విక భావజాలాన్ని అంతటినీ వెతికి, అందులో మనకి వర్తమానం లో పనికొచ్చే అంశాలేమున్నాయో గుర్తించాలి. తద్వారా మన తాత్విక సాంప్రదాయాలనుండే రూపొందించిన వాదనలతో వర్గ శత్రువులను ఎదుర్కొనడం సాధ్యపడుతుంది. విదేశీ, పాశ్చాత్య సిద్ధాంతాలనే చిలకపలుకుల్లా వల్లిస్తున్నారంటూ మనపై ముద్ర వేసే ఎత్తుగడలను తిప్పికొట్టడం వీలౌతుంది.

**రెండవది :** మనంమన సాంప్రదాయ భావజాలంలో అభ్యుదయకరమైన, ప్రజానుకూలమైన వాటిని పెంపొందించి వాటికి వర్తమానకాలపు పరిజ్ఞానాన్ని జోడించి బలోపేతం చేయడానికి ప్రయత్నించాలి.

**మూడవది :** తిరోగమన స్వభావం కలిగిం, ప్రజా వ్యతిరేకంగా ఉన్న భావజాలాన్ని ప్రజాబాహుళ్యం చైతన్యం నుండి తుచిచివేయడానికి కృషి చేయాలి.

మార్క్సిస్టు తాత్విక సిద్ధాంతపు మౌలిక సూత్రాలను ప్రచారం చేస్తూనే, మనం గతకాలపు సాంప్రదాయానికి చెందిన భౌతికవాద, నిరీశ్వరవాద భావజాలాన్ని కూడా ప్రచారం చేయాలి. అదే సమయంలో ఆ భావాలకు చారిత్రికంగా పరిమితులు, బలహీనతలు ఉంటాయని మరిచిపోకూడదు.

మన గతకాలపు భౌతికవాద, నిరీశ్వరవాద తాత్విక భావజాలానికి నిజమైన వారసులు నేటి శ్రామికవర్గమే అన్న అభిప్రాయాన్ని మనం కలిగించాలి.

## 3. సాంప్రదాయ భారతీయ తత్వ శాస్త్రం – వర్గీకరణ

తరచూ భారతదేశాన్ని కర్మభూమి అని అభివర్ణిస్తూంటారు. ఇక్కడి ప్రజలు కర్మసిద్ధాంతాన్ని విశ్వసిస్తారని దానర్థం. గత జన్మలో మనం చేసిన మంచి చెడు కర్మలను బట్టి ప్రస్తుత జన్మ లో మన జీవితం ఉంటుంది అని కర్మసిద్ధాంతం చెప్తుంది. భారతదేశాన్ని వేదాంతుల దేశంగా కూడా వర్ణిస్తూంటారు. వేదాంతం అంటే భావవాద

తాత్విక సిద్ధాంతం. తత్వ వేత్తగా కూడా ప్రఖ్యాతి పొందిన డా. రాధాకృష్ణన్ "భారతీయ తత్వ శాస్త్రం ప్రధానంగా ఆధ్యాత్మికవాదమే" అని ప్రకటించారు. భారతీయ తత్వ శాస్త్రం ప్రధానంగా ఆధ్యాత్మివాదమేనని, (అంటే చైతన్యమే ప్రాథమికం అని అంగీకరిస్తుందని) అదే పాశ్చాత్య దేశాల తాత్విక దృక్పథం ప్రధానంగా భౌతికవాదదృక్పథం అని ప్రచారం అవుతోంది. ఇది మౌలికంగానే అవాస్తవికమైన ప్రచారం. అంతే కాదు, ఇటువంటి ప్రచారం ద్వారా మన యావత్తు ప్రాచీన తాత్విక జ్ఞానాన్నంతటినీ ఆధ్యాత్మికవాదంగా ముద్ర వేసి, ఈ భరతభూమి మీద భౌతికవాదానికి తావే లేదన్నట్టు చిత్రించే కుట్ర కూడా ఉంది. ఐతే, వాస్తవం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది.

మన సాంప్రదాయ సాహిత్యంలో తాత్విక దృక్పధాన్ని 'దర్శనం' అని అంటారు. మాధవుడు రచించిన 'సర్వ దర్శన సంగ్రహం' అనే గ్రంథంలో (ఇది క్రీ.శ. 16వ శతాబద్ధం నాటిది) 16 దర్శనాల పేర్లను ప్రస్తాఇంచారు. కాని సాధారణంగా అందరూ అంగీకరిస్తున్నది భారతదేశంలో తొమ్మిది తాత్విక సిద్ధాంతాలు రూపొందాయని. ఆ తొమ్మిదీ ఇవి: 1.లోకాయత (దీనినే చార్వాకం అని, బ్రాహస్పత్యం అని కూడా అంటారు) 2. బౌద్ధం, 3.జైనం, 4. పూర్వ మీమాంస, 5.వేదాంతం (దీనినే ఉత్తర మీమాంస అని కూడా అంటారు) 6. సాంఖ్యం, 7.యోగం, 8. న్యాయం 9. వైశేషికం. వీటిలో మొదటి మూడూ నాస్తిక దర్శనాలు అని తక్కిన ఆరింటినీ ఆస్తిక దర్శనాలు అని కూడా అంటారు.ఐతే, మనకి ఇక్కడ 'ఆస్తిక ', 'నాస్తిక' అన్న పదాల అర్థం స్పష్టంగా తెలియాలి. మామూలుగానైతే దైవం ఉనికిని విశ్వసించేవారు ఆస్తికులు అని, విశ్వసించనివారు నాస్తికులు అని అంటాం. కాని, మన సాంప్రదాయ తత్వ శాస్త్రంలో వేదాల సాధికారతను ఆమోదించేవారు, ఆ వేదాలకు ఉపాంగాలుగా వచ్చిన ధర్మ శాస్త్రాలు, వైదిక కర్మకాండ లైన యజ్ఞాలు వంటి ఆచారాలను కూడా ఆమోదించేవారు ఆస్తికులుగా పరిగణించబడతారు. వేదాల సాధికారతను ఆమోదించనివారు నాస్తికులుగా పరిగణించబడ్డారు.

పాశ్యాత్య దేశాలలో తాత్విక రంగంలో పోరాటం ప్రధానంగా భావ వాదానికి, భౌతికవాదానికి మధ్య జరిగింది. అక్కడ తేడా స్పష్టంగా తెలుస్తోంది. కాని భారతీయ సాంప్రదాయంలో ఈ పోరాటం ఆస్తికులకు నాస్తికులకు మధ్య జరిగింది. ఇక్కడ దైవం మీద విశ్వాసం కన్నా వేదాలకు, ధర్మశాస్త్రాలకు తలవొగ్గడం అనేది ప్రధాన కొలమానం అయింది. ఇక్కడ వేద ప్రమాణాన్ని అంగీకరించడం అంటే బ్రాహ్మణుల

ఆధిపత్యాన్ని అంగీకరించడం. బ్రాహ్మణులు ఇక్కడ పాలకవర్గ ప్రతినిధులు అని గమనించాలి. ఒకవేళ ఎవరైనా దైవం పట్ల విశ్వాసం కలిగివుండి వేదాలను ప్రమాణంగా అంగీకరించకపోతే అట్టివారు కూడా నాస్తికులుగానే పరిగణించబడ్డారు.

ఆ విధంగా మనకి నాస్తిక దర్శనాలుగా ఉన్నవి మూడు. లోకాయతం, బౌద్ధం, జైనం. ఆస్తిక దర్శనాలు ఆరు. అవి పూర్వ మీమాంస, వేదాంతం, సాంఖ్యం, యోగం, న్యాయం, వైశేషికం.

ఇక్కడ ఆసక్తి కలిగించే విషయం ఏమంటే, ఈ ఆరు ఆస్తిక దర్శనాల్లోనూ వేదాంత దర్శనం ఒక్కటే స్పష్టంగా భావవాదాన్ని ప్రబోధిస్తుంది. దానినే ఆధ్యాత్మికవాదం అని కూడా అంటాం. తక్కిన అయిదు ఆస్తిక దర్శనాల్లోనూ చాలా బలమైన భౌతికవాద భావనలు ఉన్నాయి. వివరాల్లోకి పోయే ముందు వేదప్రమాణం అనేదాని గురించి ముందు చర్చించాలి.

## 4. వేదాలు

వేదాలు ప్రాచీన కాలపు మానవుల ఆలోచనల తీరుతెన్నులను తెలియజేసే ఆధారాల్లోకెల్లా అత్యంత ప్రాచీనమైన గ్రంధాలు. వేదకాలపు మానవుల కన్నా చాలా ముందుకాలం నుంచీ మానవ సమాజాలు ఉనికిలో ఉన్నాయి. కాని ఆకాలపు మానవుల ఆలోచనలను తెలియజెప్పే ఆధారాలు ఏవీ మనకు అభించలేదు. రాతపూర్వకపు లిపి అంటూ ఇంకా మానవులు రూపొందించని పురాతన కాలం నుంచీ ఒకరి భావాలను వారినుండి మరొకరు విని గుర్తు పెట్టుకుని మళ్ళీ మరొకరికి ఆ విషయాలను చెప్పడం ద్వారా తరతరాలుగా ఆనాటి భావాలు నేటి తరాలవారు తెలుసుకోవడం సాధ్యపడింది. అందుకే వేదాలను శృతాలు అని అంటారు. అంతే కాని, కొందరు ప్రచారం చేస్తున్నట్టు వేదాలలో ఏదో ఒక నిగూఢమైన శక్తి అంటూ ఏమీ లేదు. కొంతకాలం తర్వాత వేదాలను లిఖిత రూపంలో ఒక దగ్గర చేర్చి సంహితలుగా రూపొందించారు. సంహితలు అంటే ఒక విధంగా సంకలిత రచనలు అనవచ్చు.

మన ప్రాచీన వారసత్వం గురించి గర్వంగా భావించేవారు కొందరు వేదాల్లో సమస్త జ్ఞానమూ ఉందని విశ్వసిస్తారు. పాశ్చాత్యులు వాటినే కాపీ కొట్టి తమ స్వంత తెలివితేటలుగా చెప్పుకుంటూవుంటారని వారంటారు. మరికొందరైతే వేదాలు నేరుగా పరమాత్మ నోటివెంట వచ్చాయని అంటారు. ఐతే, ప్రస్తుతం వేదాల్లోఉన్న భావజాలం అంతా వివిధ భాషల్లోకి తర్జుమా అయి అందుబాటులో ఉంది. ఎవరైనా వాటిని కాస్త ఓపికగా పరిశీలిస్తే అటువంటి గొప్పలు వట్టి కబుర్లేనని స్పష్టం ఔతుంది.

వేదాలు నాలుగు. ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అథర్వణవేదం. వీటిలో అథర్వణవేదం తరువాతి కాలానికి చెందినది. తక్కిన మూడింట్లో ఉండే భావం, వాడిన భాష అంతా ఒకే తరహాగా ఉంటుంది.

వాటిలో ఋగ్వేదం అన్నింటికన్నా ప్రధానమైనది. ఇందులో 10,552 మంత్రాలు ఇప్పుడు అభిస్తున్నాయి. వాటిని ఋక్కులు అంటారు. ఈ ఋక్కులను 1028 సూక్తాలుగా విభజించారు. ఈ సూక్తాలు మళ్ళీ పది మండలాలుగా విభజించారు. వీటిలో మొదటి మండలంలో సుమారు 2000 మంత్రాలు ఉన్నాయి. వీటిని సుమారు 15 మంది ఋషులు రచించివుంటారని పరిశీలనలో నిర్ధారించారు. ఆ లెక్కన మొత్తం ఋగ్వేదం 100 మందికి పైగానే ఋషులద్వారా రచించబడిందని అనుకోవాలి. వీరంతా వేరు వేరు కాలాలకు చెందినవారు. ఈ పది మండలాలలో పదవ మండలం ఆదినుండీ ఋగ్వేదంలో భాగంగా లేదని, దానిని తర్వాత కాలంలో చేర్చివుండాలని నిపుణులు భావిస్తున్నారు.

సామవేదంలో 1791 ఋక్కులు ఉన్నాయి. వీటిలో 1715 వరకూ ఋగ్వేదం నుండే తీసుకున్నారు. వాటిని మధురమైన సంగీతపు బాణీలలో తిరగరాశారు. ఒకవిధంగా చెప్పాలంటే సామవేదం సంగీతానికి, పాటలకు సంబంధించిన మొట్టమొదటి గ్రంథం.

యజ్ అనే పదం నుండి వచ్చినది యజుర్వేదం. యజ్ అంటే సమర్పించేది అని అర్థం. దేవతలకు సమర్పించేదానిని బలి అంటారు. దేవతలను సంతృప్తిపరచడానికి వారికి బలులు సమర్పించే విధానాన్ని యజ్ఞం లేదా యాగం అని అంటారు. ఈ బలి సమర్పించడం అనే భావన వేదాలనాటి కన్నా ముందునుంచే ప్రపంచంలో చాలా ప్రాంతాలలో ఆచరణలో ఉంది. గ్రామ దేవత పండుగల, జాతరల సందర్భంగా గ్రామ ప్రజలు ఆ దేవతకు బలులు సమర్పిస్తారు. ఇది అనాదిగా ఉన్న విధానం. యజ్ఞాలలో బలులు సమర్పించేటప్పుడు ఏ దశలో ఏ మంత్రాలను ఏ విధంగా ఉచ్చరించాలో నిబంధనలుగా రూపొందించినది యజుర్వేదం. బలులను సమర్పించే వ్యక్తుల కోర్కెల నివేదనలే మంత్రాలుగా రూపొందాయి. ఆ మంత్రాలలో ఆ యా దేవతలను ఘనంగా ప్రశంసించేవి చాలా ఉన్నాయి. యజ్ఞాన్ని నిర్వహించేటప్పుడు పాటించవలసిన విధివిధానాలను యజుర్వేదం పేర్కొంది. ఆధునిక పరిభాషలో చెప్పాలంటే యజ్ఞాల నిర్వహణకు సంబంధించిన మాన్యుయల్ గా

యజుర్వేదాన్ని చెప్పవచ్చు. బ్రాహ్మణాధిపత్యం బలపడుతున్నకొద్దీ, సమాజంలో వర్గ విభజన మరింత స్పష్టంగా ఏర్పడుతున్నకొద్దీ యజుర్వేద మంత్రాలు మరింత కఠినమైన నియమ నిష్టలతో రూపొందుతూవచ్చాయి. వాటిని ఎవరూ అతిక్రమించడానికి వీలులేకుండా యధాతథంగా పాటించాల్సిందే.

అథర్వ వేదంలో 5000 కు పైగా ఋక్కులు ఉన్నాయి. వీటిని 731 సూక్తాలుగా విభజించారు. అవి 20 అధ్యాయాలుగా ఉన్నాయి. అధర్వవేదంలో ఉన్న విషయాలను పరిశీలిస్తే అవి ఎక్కువగా ఈ భౌతిక ప్రపంచపు జీవితానికి సంబంధించి ఉన్నాయి. పరలోకానికి సంబంధించి అందులో ఉన్నది తక్కువే. ఆ కాలంనాటి ప్రజలు అప్పటి భౌతిక ప్రపంచంలో కొనసాగించిన జీవితంలో వారికి ఎదురైన సవాళ్ళు, సమస్యల యెడల ఏ విధమైన అవగాహన కలిగివుండేవారో అథర్వవేదం బట్టి తెలుసుకోవచ్చు. బహుశా ఈ కారణం వల్లే చాలా కాలం పాటు అథర్వ వేదాన్ని నాలుగవ వేదంగా అంగీకరించలేదు. కొంత కాలం తర్వాత మాత్రమే అథర్వ వేదం నాలుగవ వేదంగా అంగీకారం పొందింది.

**కాలం :** వేదాలకు తొలి రూపకర్తలు ఈ ఉపఖండానికి వలసలు వచ్చిన ఇండో-ఆర్యన్ తెగల ప్రజలు. వేదాలలోకెల్లా ప్రాచీనమైన ఋగ్వేదం క్రీ.పూ,2500-1500 సంవత్సరాల మధ్య కాలంలోరూపొందినట్టు చరిత్ర పరిశోధకులు నిర్ధారించారు. పశుపాలకులుగా సంచారజీవనాన్ని గడిపే ఇండో-ఇరానియన్ తెగల ప్రజలు ఏడాది పొడవునా తమ పశువులకు సమృద్ధిగా గడ్డిని అందించగల పచ్చికబయళ్ళు ఎక్కువగా ఉండే భూభాగాలను వెతుక్కుంటూ వలసలు పోయారు. ఆ అన్వేషణ లో వారు ఋగ్వేదపు చివరి కాలంలో భారత ఉపఖండంలోకి ప్రవేశించారు. అథర్వ వేదం ఋగ్వేదం కన్నా 500 సంవత్సరాల తర్వాత రూపొందింది. అంటే క్రీ.పూ.1000 నాటికి రూపొందింది. అంటే క్రీ.పూ 1500 నుండి క్రీ.పూ 1000 సంవత్సరాల మధ్య 500 ఏళ్ళ సుదీర్ఘకాలంలో ఆర్యులు భారతదేశంలోకి తడవ తడవలుగా వచ్చి ఇక్కడి స్థానికులతో కలిసి స్థిరపడడం జరిగిందని గ్రహించాలి. ఈ కాలంలోనే సమాజంలో వర్గ విభేదాలు కూడా తలెత్తాయని చెప్పవచ్చు.

**వేదాలలో సారాంశం :** ముందే తెలిపినట్టు మొదటి మూడు వేదాలలోనూ వివరించిన విషయం ఒకటే. వైదిక సంస్కృత భాష కు, ఆ తర్వాత ఆధునిక, లేదా వ్యాకరణం తో మెరుగుపడిన సంస్కృత భాషగా పరిగణించబడే సాహిత్యంలోని భాషకు చాలా తేడా ఉంది. వాల్మీకి, కాళిదాసుడు, బాణుడు వంటి కవుల రచనలలోని సంస్కృతభాష మాదిరిగా వైదిక సంస్కృతం ఉండదు. కొన్ని వేద మంత్రాలలోని పదాలను యధాతథంగా లిఖించడం సాధ్యం కాదు. దీని వలన వేదాలకు వ్యాఖ్యానాలు రకరకాలుగా వెలువడ్డాయి. ఈ అంశాన్ని వివరిస్తూ డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇలా రాశారు: " వేదాలకు భిన్న వ్యాఖ్యానాలు ఉన్నాయంటేనే వేదాలలోని విషయం ఒకే మూసలో పోసినట్టు ఉండేది కాదని, దానిలో రకరకాల భావాలు చేరాయని స్పష్టం ఔతోంది. అనేక తరాల్లోని ఆలోచనాపరులు తమ తమ భావాలను వేదాల్లో వ్యక్తం చేశారు. అందుచేత దానిలో భిన్నమైన భావాలు అనేకం చేరివున్నాయి. ఇక్కడ ముఖ్యంగా మనం చేయగలిగిన నిర్ధారణ ఏమంటే అత్యంత సరళంగా మతాన్ని గురించి, సమాజాన్ని గురించి మానవులు ఆలోచించిన కాలం అది. ఆ కాలపు భావనలే వేదాల్లో మనకు కనిపిస్తాయి. అత్యధిక సంఖ్యలో ఉన్న ఆ వేద మంత్రాలుచాలా సరళంగా, చాలా అమాయకంగా ఉండే ఆనాటి మానవుల మత చైతన్యాన్ని తెలియజేస్తాయి. ఆ తర్వాత కాలంలోనే ఆ భావాలు నానా రకాల తర్కాలతో సంక్లిష్టం అయిపోయాయి. వీటిలో, ముఖ్యంగా ఆఖరి గ్రంథంలో ఈ ప్రపంచానికి సంబంధించి, అందులో మానవుల స్థానం గురించి కొంత పరిపక్వతతో కూడిన భావనలు మనకి కనిపిస్తాయి."

వేదమంత్రాలలో మనకి కొట్టవచ్చినట్టు కనిపించేది ఏమంటే అనేక దైవాలను ఆరాధించడం. చాలామంది దైవాలను ప్రస్తావించి వారిని ఆరాధించారు. డా. రాధాకృష్ణన్ ఇలా రాశారు: "మానవుడి మెదడు అనే ఫాక్టరీలో దేవుడిని తయారు చేయడం అనే క్రమం మనకి ఋగ్వేదంలో కనిపించినంత స్పష్టంగా మరెక్కడా కనిపించదు. మొదటి దశలో వైదిక దేవతలంటే కొన్ని ప్రకృతి శక్తులే. ఆ తర్వాత క్రమంగా నైతికంగా ఉన్నత స్థానం కలిగిన మానవాతీత శక్తులుగా దేవతలు పరిణామం చెందడం మనకి ఋగ్వేదంలో కనిపిస్తుంది. వేదాలను రూపొందించిన మొట్టమొదటి దశలోని ఋషులకు ప్రకృతిని ప్రేమించడం అంటే ఏమిటో బాగా తెలుసు. ఉదయ. సాయం సంధ్యల అద్భుతాలను దర్శిస్తూ వారు తన్మయత్వంలో ఓలలాడేవారు. వారి

దృష్టిలో ప్రకృతి అనేది ఒక సజీవమైన అస్తిత్వం. దానితో వారు భావ సంపర్కం చేయగలిగేవారు. **వైదిక మతపు మొట్టమొదటి రూపం ప్రకృతి ఆరాధనే. "**

ఆకాశానికి దేవత వరుణుడు. భూమికి దేవత భూమాత. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, కొండలు, నదులు, అగ్ని అన్నింటినీ దేవతలుగా పరిగణించి ఆరాధించేవారు. వీరు గాక మరో తరహా దేవతలు కూడా ఉన్నారు. అన్నదేవత పితు. శక్తిని, దానితోబాటు మత్తును కలిగించే దేవత సోమం, గర్భస్రావం నుండి కాపాడే దేవత సంతాన దేవత –ఇలా. ఇంద్రుడు తర్వాత కాలంలో ఈ దేవతల సరసన చేరాడు. వ్యవసాయం అంటే తెలియని దశలోప్రతీ రోజూ తిండి సంపాదించుకోవడమే పెద్ద సవాలుగా ఉండిన కాలంలో అన్నాన్ని పితు అనే దేవత రూపంలో ఆరాధించడం పెద్ద ఆశ్చర్యం కలిగించదు. అప్పటి మానవుల ఆయుప్రమాణం 25 ఏళ్ళే. అందుచేత సంతాన దేవతను ఆరాధించడం కూడా ఆశ్చర్యం కలిగించదు.

దైవాలకు బలి లేదా నైవేద్యం సమర్పించడం అనే ఆచారం మొదట్లో కనిపించదు. దైవాన్ని ధ్యానం ద్వారా తెలుసుకోవడమే ప్రధానంగా ఉండేది. విగ్రహారాధన లేదు. అందుచేత దేవాలయాలు గాని, పూజలు నిర్వహించడానికి పురోహితులుగాని అవసరమే లేని కాలం అది. ఆ పేరుతో పురోహితులు తక్కిన ప్రజలమీద పెత్తనాన్ని చెలాయించేందుకు అవకాశమే లేదు.

ఋగ్వేదంలో ఋతం అనే భావన మనకి కనిపిస్తుంది. ఇది ప్రాధాన్యత కలది. ఋగ్వేద ఋషులు ఈ విశ్వం యావత్తూ, ప్రకృతి శక్తులతో సహా, ఋతాన్ని అనుసరించి నడుచుకోవలసిందేనని, అదే విధంగా దేవతలు గాని, మానవులు గాని ఋతాన్ని ఆచరించవలసిందేనని ప్రకటించారు. ఋతం అంటే విశ్వం మొత్తానికి వర్తించే కొన్ని సర్వ సాధారణ నియమాలు. ఈ ఋతాన్ని అతిక్రమించడం అనృతం ఔతుంది. ఋతాన్ని ఆచరించడం వ్రతం ఔతుంది. అనృతాన్ని ఆచరిస్తే, అంటే సార్వత్రిక నియమాలను అతిక్రమిస్తే ప్రకృతిలోని సమతుల్యత దెబ్బ తింటుంది. అది వినాశనానికి దారి తీస్తుంది. ఋతానికి కట్టుబడివుంటే, అంటే, వ్రతాన్ని అనుసరిస్తే సమత్యుతను పరిరక్షించడం సాధ్యపడుతుంది.

**కులం :** కుల వ్యవస్థకు వేదాలు అనుమతించాయని కొందరు వాదిస్తారు. ఋగ్వేదంలోని పదో అధ్యాయంలోని పురుష సూక్తం లో కులాలెలా ఆవిర్భవించాయో వివరించే మంత్రాలు ఉన్నాయి. కాని ఇవి తొలినాటి ఋగ్వేదంలో భాగం కావు.

చాలా శతాబ్దాల తర్వాత ఋగ్వేదంలో వాటిని చేర్చారు. నిజానికి పురుష అనే భావనే ఋగ్వేదంలో తక్కిన భాగాలలో ఎక్కడా వ్యక్తం కాలేదు. అటువంటప్పుడు పురుష సూక్తం ఆకాలం నాటిదే అని చెప్పడానికి ఆస్కారం లేదు.

ఐతే భారత ఉపఖండంలోకి వచ్చిన తర్వాత ఇక్కడి స్థానిక తెగల ప్రజలతో వైదిక ఆర్యులకు ఘర్షణలు తప్పలేదు. తమతో ఘర్షించిన స్థానిక ప్రజలను వారు దస్యులు అన్నారు. ఆ దస్యులది పైచేయి కాకుండా ఉండాలంటే తమ వైదిక సమాజాన్ని, వేద సాహిత్యాన్ని అత్యంత పవిత్రంగా కాపాడుకోవడమే మార్గం అని వారు భావించారు. దస్యులకు భిన్నంగా తమ అస్తిత్వాన్ని కాపాడుకోడానికి వారు మరింత కఠినంగా వైదిక కర్మకాండలకు కట్టుబడడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే ఆ కర్మకాండలను నిర్వహించడానికి అంకితమైన కొందరు వ్యక్తులు పురోహితులుగా ముందుకొచ్చారు. వారే తర్వాత కాలంలో బ్రాహ్మణులుగా ఆధిపత్య స్థానాన్ని పొందారు. ఆ తర్వాత కుల వ్యవస్థ క్రమంగా విస్తరించింది. యుద్ధాల్లో ఓటమిపాలైనవారిని కుల వ్యవస్థ లో అట్టడుగుకు నెట్టి వారిని శూద్రులు అని అన్నారు.

**ముగింపు :** వెయ్యి సంవత్సరాలకు పైగా కొనసాగిన వైదిక కాలంలో వర్గ-రహిత ఆదిమ సమాజం వర్గ సమాజంగా పరిణామం చెందుతూవచ్చింది. స్థిర నివాసాలు లేకుండా పశుపాలకులుగా సంచరిస్తూ వుండే తెగలు వ్యవసాయిక సమాజంగా, స్థిర నివాసాలతో గ్రామాలలో జీవించే దిశగా మార్పు జరుగుతూవచ్చింది. ఈ మార్పులన్నీ జరుగుతున్న కాలంలో సహజంగానే పరస్పరం భిన్నంగా ఉండే పలు తాత్విక భావనలు వ్యక్తం అవుతూవచ్చాయి. ఐతే ఈ తాత్విక భావనల్లో అధిక భాగం భౌతిక జీవితం చుట్టూ, జీవితంలో ఎదురౌతున్న సవాళ్ళచుట్టూ తిరిగాయి. అందుచేత వేదాలలో భౌతికవాద భావనలే ఎక్కువగా ఉండడం ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. వాటిలో అస్పష్టమైన భావవాద భావనలు కొద్దిగానే ఉన్నాయి. వర్గ సమాజంగా పరిణామం చెందుతున్నకొద్దీ, అణచివేత బలపడుతున్నకొద్దీ భావవాద భావనలు ఎక్కువగా వ్యక్తం అవడం కనిపిస్తుంది.

## 5. నాస్తిక దర్శనాలు

తిరిగి మనం దర్శనాల వర్గీకరణ వద్దకు పోదాం. ఆస్తిక, నాస్తిక దర్శనాలు అని విభజించడానికి ప్రాతిపదిక ఏమిటో చూద్దాం. వేదాల ప్రామాణికతను అంగీకరించినవి ఆస్తిక దర్శనాలుగాను, వేదాల ప్రామాణికతను తిరస్కరించినవి నాస్తిక

దర్శనాలు గాను పరిగణించారు. వేదాలలో ఉన్న విషయాలను చూస్తే వాటిలో భౌతికవాదపు ఛాయలే ఎక్కువగా కనిపిస్తాయి. భావవాదపు ధోరణులు తక్కువగానే ఉంటాయి. వేదాలను భౌతికవాదం గానో, భావవాదంగానో ముద్ర వేసి చూడడం సాధ్యం కాదు. అటువంటప్పుడు వేద ప్రమాణాన్ని అంగీకరించాలని ఎందుకు పట్టుబట్టారు?

తన వర్గ ఆధిపత్యాన్ని ఒక కుల వ్యవస్థ ద్వారా సాధించి, దానిని సుస్థిరపరచుకోడానికి ఆర్యులలో ఒక భాగం ప్రయత్నించారు. అట్టి ఆధిపత్యానికి ఒక నైతిక, మతపరమైన ఆమోదముద్ర పొందడం కోసం వారు చాలా తాపత్రయపడ్డారు. వేదాలు, వాటితో ముడిపడిన యజ్ఞాలు, ఇతర క్రతువులు ఆర్యుల పరిధిలోనే ఉన్నాయి. స్థానిక మూలవాసులకు వీటితో ఏ సంబంధమూ లేదు. అటువంటి స్థానికులను తమకు లంగివుండేలా చేయడానికి, తమతో పోరాడి ఓడిపోయినవారిని శాశ్వతంగా తమ పెత్తనం కింద పడివుండేలా చేయడానికి వీలు కల్పించే ఒక ఆధిపత్య భావజాలం వారికి అవసరమైంది. అందుకోసమే వేదాలను ప్రమాణంగా నిర్ధారించి దానికి అంగీకరించడం అనేది ముందస్తు షరతుగా చేశారు. వేద ప్రమాణాన్ని తిరస్కరించడం అంటే ఆధిపత్య వర్గాల పెత్తనాన్ని సవాలు చేయడం గా పరిగణించారు. అటువంటి తిరస్కారం దైవ ద్రోహంగాను, కుల సమాజానికి హానికరంగాను పరిగణించారు. అందుకే లోకాయతం, బౌద్ధం, జైనం – ఈ మూడూ వైదిక క్రతువులను వ్యతిరేకించడం, ఎంతో కొంతమేరకైనా కుల వ్యవస్థను వ్యతిరేకించడం వలన వాటికి నాస్తిక దర్శనాలన్న ముద్ర పడింది.

## అ. లోకాయత దర్శనం

ప్రాచీన కాలంలో సామాన్య ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందిన తాత్విక దర్శనం లోకాయతం. బౌద్ధం కన్నా ముందే ఉనికిలో ఉన్న సాంఖ్య, యోగ తదితర దర్శనాలలో లోకాయతం గురించి ప్రస్తావనలు ఉన్నాయి. ఉపనిషత్తులలో, అర్థశాస్త్రం (క్రీ.పూ. 4వ శతాబ్దం) లో, మహాభారతంలో కూడా లోకాయతం గురించి ప్రస్తావించారు. తొలినాటి జైన గ్రంథాలలో సైతం లోకాయత గురించి పేర్కొన్నారు. "లోకాయతం చాలా పురాతన దర్శనం–బహుశా భారతీయ తత్వ శాస్త్రం ఎంత పురాతనమో లోకాయతం అంత పురాతనం" అన్న సత్యాన్ని ఈ ఆధారాలు ధృవపరుస్తున్నాయి.

–(దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ)

లోకాయతం భౌతికవాద దర్శనం. ఆత్మ అనేది మానవ శరీరం లేకుండా, స్వతంత్రంగా ఉనికిలో ఉంటుంది అన్న భావనను బలంగా వ్యతిరేకించింది. ఆచరణే జ్ఞానానికి ప్రమాణం అని కూడా లోకాయతులు వాదించారు. ఈ భౌతిక ప్రపంచం వాస్తవమైనదని, మన జ్ఞానేంద్రియాల ద్వారా ఈ జగత్తుకు సంబంధించిన జ్ఞానాన్ని గ్రహించవచ్చునని వారు వాదించారు. ఒకానొక జ్ఞానం 'సత్యం' అని అంగీకరించాలంటే దానికి సరైన రుజువు ఉండాలని వారు వాదించారు. దానినే వారు ప్రమాణం అన్నారు. నిప్పు కు వెలుగు, వేడి ఏ విధంగా లక్షణాలుగా ఉన్నాయో, అదే విధంగా మానవ దేహానికి చైతన్యం అనేది ఒక లక్షణం. నిప్పు లేకుండా వెలుగు, వేడి ఏ విధంగా ఉండజాలవో, అదే విధంగా మానవదేహం లేకుండా ఆత్మ అనేది దానికదే స్వతంత్రంగా ఉండజాలదు. ఆ విధంగా లోకాయతులు ఎటువంటి సందేహానికీ తావు లేని రీతిలో ఆత్మ యొక్క స్వతంత్ర ఉనికిని, స్వర్గం–నరకం, పునర్జన్మ వంటి భావనలని పూర్తిగా తిరస్కరించారు. జీవ, నిర్జీవ పదార్థాలతో కూడిన ఈ భౌతిక ప్రపంచం భూమి, నీరు, నిప్పు, గాలి అనే నాలుగు మూల పదార్థాలనుండి ఏర్పడిందని ప్రతిపాదించారు. ఈ మూల పదార్థాలు ఒకానొక ప్రత్యేకమైన తీరులో కలిసినప్పుడు వాటినుండి జీవ పదార్థాలు ఏర్పడతాయని, జీవాన్ని కోల్పోయాక తిరిగి ఆ మూల పదార్థాల్లోనే కలిసిపోతాయని చెప్పారు. చైతన్యం, లేదా జీవం నాలుగు మూల పదార్థాలనుండి ఏ విధంగా ఏర్పడుతుందో వారిలా వివరించారు: "మూల పదార్థాలు వాటికవిగా ఏ చైతన్యాన్నీ కలిగివుండవు. ఐతే వాటినుండే చైతన్యం రూపొందుతుంది. ఇదెలా సాధ్యం? ఏవిధంగా బియ్యం గాని సారా తయారీలో ఉపయోగించే ఏ ఇతర ముడి పదార్థాలకు గాని నిషా కలిగించే గుణం లేకపోయినప్పటికీ, వాటిని ఒకానొక ప్రత్యేక పద్ధతిలో కలిపితే వాటినుండి మత్తు కలిగించే లక్షణం ఉన్న సారా తయారౌతుందో, అదే విధంగా మానవ శరీరంలో భాగాలుగా ఉన్న వివిధ మూల పదార్థాలు వేటికీ విడివిడిగా చైతన్యం అనే లక్షణం ఉండదు. కాని అవన్నీ ఒకానొక పద్ధతిలో కలిసి మానవ శరీరంగా ఏర్పడినప్పుడు ఆ కలయిక నుంచి చైతన్యం అనే లక్షణం కల మానవుడు ఉద్భవిస్తాడు. "మన పూర్వీకులు చైతన్యం కాకుండా పదార్థమే ప్రాథమికం అని నిర్ధారించడానికి చెప్పిన గొప్ప ప్రాధాన్యత కల అంశం ఇది" – (దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ)

భావవాదులు చెప్పే కర్మ సిద్ధాంతాన్ని లోకాయతులు బలంగా తిరస్కరించారు. బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని, వారు నిర్వహించే యజ్ఞాలు, శ్రాద్ధ కర్మలు వంటి తంతులను వ్యతిరేకించి సవాలు చేయడానికి ఇదే ప్రాతిపదిక. ఈ వైఖరి వల్లనే వారు వివక్షతతో, అణచివేతతో కూడిన కుల వ్యవస్థను బలంగా వ్యతిరేకించడానికి పూనుకున్నారు. ఈ కారణంగా పురోహిత వర్గాలు లోకాయతులను భూమ్మీద లేకుండా నిర్మూలించడానికి, లోకాయతుల సాహిత్యాన్ని ఎవరికీ అందకుండా తగులబెట్టడానికి, అన్ని రకాల ప్రయత్నాలనూ చేశారు. తమ సాధనసంపత్తినంతటినీ ఉపయోగించారు. అందుచేతనే మనకు ఇప్పుడు లోకాయత దర్శనానికి సంబంధించి సాధికారికమైన రాతపూర్వ పత్రాలేవీ లభించకుండా పోయాయి. ఐతే, లోకాయతులపై మోపిన నిందలనుండి, వారికి వ్యతిరేకంగా నిర్దాక్షిణ్యంగా జరిపిన ప్రచారం నుండి, లోకాయత దర్శనాన్ని పనిగట్టుకుని వక్రీకరిస్తూ చేసిన రచనల నుండి ఆధునిక కాలపు భౌతికవాద తత్వ వేత్తలు లోకాయత దర్శనాన్ని ఒకమేరకు పునఃప్రతిష్ట చేశారు.

"కర్మ సిద్ధాంతపు సారాంశం చాలా సరళమైనది. మానవులు చేసే ప్రతీ పనికీ అనివార్యంగా ఏదో ఫలితం ఉంటుంది. ఒక మంచి పని చేస్తే మంచి ఫలితం ఎలా వస్తుందో, అలాగే ఒక దుర్మార్గపు పని చేస్తే చెడు ఫలితమే వస్తుంది. అందుచేత మనిషి ఇప్పుడు అనుభవిస్తున్న సుఖ, దు:ఖాలకు కారణం గతంలో ఆ మనిషి చేసుకున్న కర్మలే. ఇప్పుడు ఆ మనిషి ఏ విధంగా ప్రవర్తిస్తాడో దానిని బట్టి అతడి భవిష్యత్తు నిర్ణయించబడుతుంది. ఇటువంటి సిద్ధాంతం సహజంగానే ఆత్మ ఒక శరీరాన్ని విడిచిపెట్టి మరణానంతరం మరో శరీరంలోకి ప్రవేశిస్తుంది అన్న భావన మీద ఆధారపడవలసివస్తుంది.

ఈ సిద్ధాంతం నుండి స్పష్టంగా మనకి కనిపించేదేమంటే, మన గతం ఎప్పటికీ, మనని విడిచిపెట్టని ఒక చీకటిలా, మార్చడానికి వీలు లేని ఒక శక్తిలా ఉంటూ మనల్ని వెన్నాడుతూవుంటుంది.

ఉపనిషత్తుల కాలం నుండీ ఈ కర్మ సిద్ధాంతాన్ని పెంచి పోషిస్తూ తద్వారా కుల వ్యవస్థను సమర్థిస్తూ వచ్చారు." (దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ)

శ్రాద్ధ కర్మల బుజుత్వాన్ని తేల్చమని లోకాయతులు బ్రాహ్మణులను సవాలు చేశారు. "ఒకవేళ శ్రాద్ధ కర్మ ద్వారా మరణించినవారికి సంతృప్తి కలిగించడం సాధ్యమే

అయితే, దూరప్రయాణాలు చేసేవారికి కూడా ఇక్కడనుంచి శ్రాద్ధకర్మ ద్వారా కడుపులు నిపంవచ్చు కదా? వారికి దారిపొడవునా తినుబండారాలు మోసుకుపోయే కష్టం లేకుండా చేయవచ్చు కదా? ఎక్కడో స్వర్గంలో ఉన్న వారికి ఇక్కడ పిండం పెట్టి వారి ఆకలి తీర్చగలిగినప్పుడు మేడపైన ఉన్నవారికి దిగువ అంతస్తులో పిండం పెట్టి కడుపు నింపవచ్చు కదా?"

జాబాలి అనే లోకాయతుడు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముకోవద్దని రాముడికి నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. ఆ గాథ రామాయణంలో ఉంది. "ఒక వ్యక్తి ఆహారం తీసుకుంటే దాని వలన వేరొకరి కడుపు నిండుతుందా? ఇక్కడ బ్రాహ్మణుడికి శ్రాద్ధకర్మ నాడు పెట్టే భోజనం వలన అక్కడ స్వర్గంలో ఉండే మన పితరుల ఆకలి తీరుతుందా? ఈ సిద్ధాంతాలన్నీ కపటులైన పురోహితులు కల్పించినవే. వారి స్వార్ధ ప్రయోజనాలను నెరవేర్చుకోడానికే వీటిని రూపొందించారు. అందుకే నిన్ను తమకు కానుకలు సమర్పించుకోమని, తద్వారా నీ పాపాలకు పరిహారం పొందవచ్చునని బోధిస్తారు. ఈ భౌతిక సంపదను విడిచిపెట్టి ప్రార్ధనలు చేయమంటారు."

ఇలా బ్రాహ్మణ్యం మీద లోకాయతులు సూటిగా సాగించిన దాడులను భరించలేకపోయిన పురోహితవర్గం లోకాయతులను భౌతికంగా నిర్మూలించడానికి అన్ని రకాల తప్పుడు మార్గాలనూ అనుసరించారు. పాలకవర్గ ఉన్నత కులస్తులకు లోకాయతులంటే ఎంత ద్వేషమో తెలియజేసే గాథ ఒకటి మహాభారతంలోని శాంతిపర్వంలో ఉంది.

"కురుక్షేత్ర మహా సంగ్రామం ముగిసిన అనంతరం, విజయులై పాండవపుత్రులు తిరిగివస్తూంటే వేలాదిగా బ్రాహ్మణులు వారికి ఎదురేగి నగర ముఖ ద్వారం వద్ద స్వాగతం తెలుపుతారు. ధర్మరాజుకు ఆశీస్సులను అందిస్తారు. ఐతే వారిమధ్యలోనుండి ఒక చార్వాకుడు (లోకాయతులకు మరో పేరు) ముందుకొచ్చి ధర్మరాజును ఉద్ధేశించి ఇలా అంటాడు: "యావత్ బ్రాహ్మణ లోకమంతా నిన్ను శపిస్తోంది. నీవు నీ రక్త బంధువులనే చంపావు. నీ స్వంతరక్త సంబంధీకులని, నీ కుటుంబ పెద్దల్ని అందరినీ నాశనం చేసి నువ్వు బావుకునేదేమిటి?" ఇలా ఆ చార్వాకుడు ఒక్కసారి విరుచుకుపడేసరికి అక్కడున్న బ్రాహ్మణులంతా కొద్దిసేపు నిశ్చేష్టులైపోయారు. ధర్మరాజుకి ఆ దెబ్బకి జీవితేచ్ఛ నశించింది. వెంటనే తాను మరణించాలనుకుంటాడు. కాని అంతలోనే తేరుకున్న తక్కిన బ్రాహ్మణ సమూహం

ఆ చార్వాకుడు అక్కడికి మారువేషంలో వచ్చిన రాక్షసుడని ధర్మరాజుకి చెప్పి ఓదారుస్తారు. ఆ తర్వాత వాళ్ళు ఆ చార్వాకుడిని సజీవంగా దహనం చేసి బూడిద చేస్తారు" (దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ)

లోకాయత దర్శనం సామాన్య ప్రజల్లో మాత్రం చాలా ప్రచారాన్ని, ఆదరణను పొందగలిగింది. "లోకేషు ఆయత : ఇతి లోకాయతా" అంటే ప్రజల్లో విశేష ప్రచారాన్ని పొందగలిగినది లోకాయతం అని అర్థం. మన సైద్ధాంతిక పోరాటంలో లోకాయత దర్శనం యొక్క పద్ధతి చాలా ఉపయోగపడే సాధనంగా ఉంటుంది. భౌతికవాదానికి మన దేశంలో మూలాలే లేవనే వాదనను లోకాయతం ద్వారా తిప్పికొట్టవచ్చు. ఐతే లోకాయతులు ఆ ప్రాచీన కాలపు పరిజ్ఞానంతో మాత్రమే తమ దర్శనాన్ని ప్రతిపాదించారన్న సంగతిని మనం దృష్టిలో ఉంచుకోవాలి. అప్పటికి శాస్త్ర విజ్ఞానం కాని, శాస్త్రీయ దృష్టి కాని చాలా స్వల్పంగానే పెంపొందాయి. ఆధునిక భౌతికవాద దృష్టి నుండి చూసినప్పుడు లోకాయతం చాలా మొరటు గా అనిపిస్తుంది. కాని వారు తమ కాలపు పరిమితుల పరిధిలోపలే తమ దర్శనాన్ని రూపొందించారని గుర్తుంచుకోవాలి. ఆనాటి చారిత్రిక పరిస్థితుల నేపథ్యంలో లోకాయతులు పురోహితవర్గాల ఆధిపత్య భావజాలానికి ఒక శక్తివంతమైన సవాలును విసిరారు. లోకాయతం యొక్క వారసత్వం కలిగివుండే హక్కు నేటి కార్మికవర్గానికి మాత్రమే ఉందన్న విషయాన్ని ఆ కార్మికవర్గానికి తెలియజెప్పాలి.

## ఆ. బౌద్ధం

బుద్ధుడు (క్రీ.పూ.563–483) శాక్య గణానికి చెందిన రాకుమారుడు. మానవ జీవితంలోని అన్ని దశల్లోనూ, సర్వత్రా కనిపిస్తున్న బాధను, దుఃఖాన్ని చూసిన సిద్ధార్థుడు (బుద్ధుడి అసలు పేరు) తన యవ్వన దశలోనే కుటుంబ బంధాలన్నింటినీ త్యజించి ఆ బాధకు, దు:ఖానికి పరిష్కారం అన్వేషించాలని బయలుదేరాడు. అప్పటి సమాజంలో వ్యవసాయ భూమి పరిమితంగానే ఉండేది. దానిపై ఆధిపత్యం కోసం ఆ యా తెగల నడుమ తరచూ అంతర్యుద్ధాలు జరుగుతూండేవి. అణచివేత తో కూడిన కుల వ్యవస్థ మీద పెత్తనం చెలాయిస్తూ వైదిక పురోహిత వర్గం ఉండేది. పేదలకు, సంపన్నులకు మధ్య వ్యత్యాసం పెరుగుతోంది. బానిసలు, శూద్రులు భరించలేని శారీరక శ్రమ చేయవలసిరావడమే గాక వారి యెడల యజమానులు చాలా క్రూరంగా ప్రవర్తించేవారు.

వీటన్నింటినీ గమనించిన సిద్ధార్థుడికి పుట్టుక నుండి చావు దాకా మానవజీవితంలోని అన్ని దశల్లోనూ బాధ, వేదన మాత్రమే కనిపించాయి. బుద్ధుడు 'ఆర్యసత్యాలు' అనే పేర తన నిర్ధారణలను ప్రకటించాడు. అవి :

(1) పుట్టుక నుండి చావు దాకా, రోగం నుండి మరణం దాకా మానవ జీవితం యావత్తూ దుఃఖమయం. ప్రేమించనివారితో కలిసివుండడం, ప్రేమించినవారినుండి విడిపోవడం, రెండూ దుఃఖమే. కోరుకున్నది పొందలేకపోయినా దుఃఖమే. అంటే ఈ భూమి పైన మన జీవితంలోని బంధాలన్నీ దుఃఖభరితమే.

(2) ఈ దుఃఖాలన్నింటికీ మూలం మన కోరికలు. జీవితాశ, ఆనందం పొందాలన్న కోరిక, అధికారం పొందాలన్న కోరిక వంటివి.

(3) ఈ కోరికను పూర్తిగా నిర్మూలించగలిగితే ఎవరైనా దుఃఖాన్ని అధిగమించవచ్చు.

(4) అష్టాంగమార్గాన్ని అనుసరించడం ద్వారా కోరికలను అధిగమించవచ్చు. సరియైన విశ్వాసం, సరియైన నిశ్చయం, సరియైన వాక్కు, సరియైన కార్యాచరణ, సరియైన జీవనం, సరియైన ప్రయత్నం, సరియైన ఆలోచన, సరియైన ధ్యానం – ఈ ఎనిమిదీ ఆచరించడం అష్టాంగమార్గాన్ని అనుసరించడం అవుతుంది.

అష్టాంగమార్గం ద్వారా దుఃఖం నుండి విముక్తిని పొందడమే 'నిర్వాణం' అని బుద్ధుడు తెలిపాడు.

బుద్ధుడిబోధనలన్నీ పాళీ భాషలో మూడు సంపుటాలలో సంగ్రహపరచ బడ్డాయి. వాటిని 'పిటక' లు అంటారు. పిటక అంటే బుట్ట అని అర్థం. వాటిలో వినయ పిటక అనేది క్రమశిక్షణ గురించి బోధిస్తుంది. సంఘాన్ని (బౌద్ధ సన్యాసులు లేదా శ్రమణకులు ఉమ్మడిగా జీవించే విధానమే సంఘం) నిర్వహించేందుకు అవసరమైన నియమాలను అది తెలియజేస్తుంది. ఇక సుత్త పిటక బౌద్ధ ధర్మం లేదా మతం గురించి తెలియజేస్తుంది. తొలినాటి బౌద్ధం లోని భావనలను తెలుసుకోడానికి ఇదే అత్యంత ముఖ్యమైన ఆధారం. ఇందులో అయిదు చిన్న భాగాలు ఉన్నాయి. వాటిని 'నికాయ' లు అంటారు. మూడవది అభిదమ్మ పిటక. సుత్త పిటక లోని విషయాన్నే పాండిత్య ప్రకర్ష తో వివరిస్తుంది ఇది.

సమాజంలోని బాధలను చూపి చలించిపోయినప్పటికీ వాటినుండి ముక్తి పొందడం కోసం గాని, పరిష్కారం కోసం కాని  బుద్ధుడు దైవం వైపు చూడలేదు. దైవం గురించి, ఈ జగత్తు మూలం గురించి, దానికి ఎవరు కారణం అన్న దాని గురించి తెలుసుకునే ప్రయత్నం చేయడం అంటే కాలాన్ని వృధా చేయడమేనని బుద్ధుడు పరిగణించాడు. బాధలు పడుతున్న ప్రజానీకానికి  ఆ బాధలనుండి విముక్తి కలిగించే ఆచరణాత్మక పరిష్కారాలను అన్వేషించడం పై కేంద్రీకరించమని తన శిష్యులకు సూచించాడు. "తన డొక్కలో బాణం దిగబడ్డప్పుడు ఆ బాణం ఎక్కడినుంచి వచ్చిందో, దేనితో అది తయారైందో ఊహిస్తూ కాలాన్ని వృధా చేయడం మూర్ఖత్వం. దానికి బదులు ఆ బాణాన్ని వెంటనే బైటకు పెకిలించడం సరైనది" అన్నాడు బుద్ధుడు.

బాధలు పడుతున్న ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారం అందరికీ తగినంత సంపద అందేంతగా ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయడంలో ఉంటుంది. ఇది సోషలిజంలో మాత్రమే సాధ్యం. కాని బుద్ధుడు జీవించిన కాలంలో అటువంటి సమాజాన్ని గురించి ఆలోచించడమే సాధ్యం కాదు. అందుచేత బుద్ధుడు సంపదల కోసం, అధికారం కోసం పెరిగే కాంక్షలకు, దురాశకు పరిష్కారం తెగల ఉమ్మడి సామాజిక జీవన విధానానికి తిరిగి మళ్ళడమేనని భావించాడు. అట్టి తెగల ఉమ్మడి సామాజిక జీవితానికి ప్రతీకగా బౌద్ధ సంఘాలను స్థాపించాడు. సంఘంలోని సభ్యులకు వ్యక్తిగత ఆస్థి  ఏమీ ఉండదు. సంఘంలోని సోదరులందరూ సమానులే. అక్కడ నిర్ణయాలన్నీ ప్రజాస్వామ్య పద్ధతిలోనే తీసుకోవడం జరుగుతుంది. బుద్ధుడు 'అహింస' ను సాటి మానవుల పట్ల క్రూరంగా ప్రవర్తించరాదనే అర్థంలోనే బోధించాడు. పరస్పరం ఘర్షణల్లో మునిగిపోయిన వివిధ గణాల నడుమ సోదరభావాన్ని పెంపొందించుకుని ద్వేషాన్ని విడనాడాలని బుద్ధుడు బోధించాడు. పశువులను విచక్షణారహితంగా బలి ఇస్తూ వ్యవసాయానికి ఆ పశువుల శక్తిని ఉపయోగించడాన్ని నిరోధిస్తున్న యజ్ఞాలను, కర్మకాండలను కూడా బుద్ధుడు తన అహింసా ప్రబోధంలో భాగంగా వ్యతిరేకించాడు. అంతవరకూ ప్రధానంగా తమ శరీర కష్టంతోటే పొలాలను దున్నుతున్న అసంఖ్యాకమైన శూద్రులకు బుద్ధుడి పిలుపు చాలా ఊరట కలిగించింది. అంతేకాక, వ్యవసాయంలోకి పశువులను నియోగించడం పెరిగింది. అది వ్యవసాయోత్పత్తి విస్తరించడానికి దోహదపడింది. మానవ శ్రమకు పశువుల శ్రమ కూడా తోడు కావడం ద్వారా ఇది జరిగింది.

బాధలకు కారణం ఏమిటన్నదానిని వివరించడానికి బుద్ధుడు ప్రతిపాదించిన సాధారణ సిద్ధాంతమే 'ప్రతీత్య-సముత్పాద'. ఇందులో గొలుసుకట్టులా ఉండే పన్నెండు రకాల కారణాలను ఆయన వివరించాడు. వాటినే 'ద్వాదశ నిదాన' అంటారు.

'అజ్ఞానం (అవిద్య) నుండి భావాలు, అభిప్రాయాలు (సంస్కార) పుడతాయి. అభిప్రాయాలనుండి చైతన్యం (విజ్ఞాన) పుడుతుంది. విజ్ఞానం నుండి మానసిక-శారీరక నిర్మాణం (నామ-రూప) రూపొందుతుంది. ఈ నామరూప నుండి ఆరు ఆయతనాలు ఏర్పడతాయి. అవే పంచేంద్రియాలు, మనస్సు. ఈ ఆరు ఆయతనాలనుండి (జగత్తుతో) స్పర్శ కలుగుతుంది. స్పర్శ నుండి ఇంద్రియ జ్ఞానం (వేదన) కలుగుతుంది. వేదన నుండి తృష్ణ లేదా కోరిక పుడుతుంది. కోరిక నుండి బంధాలు ఏర్పడతాయి. (ఉపాదాన) బంధాలనుండి భావం (జన్మించాలనే) పుడుతుంది. భావం నుండి పుట్టుక (జతి) వస్తుంది. జతి నుండి వార్ధక్యం, చావు, దుఃఖం, రోదన, ఏవగింపు, నిరాశ వంటివి పుడతాయి. యావత్తు బాధలూ కలిగే క్రమం ఇదే".

ప్రతీదానిలోనూ నిరంతర చలనం లేదా మార్పు ఉందని బుద్ధుడు గమనించాడు. "భారతీయ తత్వ శాస్త్రంలో ఇక్కడ బహుశా గతితార్కిక ఆలోచనకు సంబంధించిన మొదటి సందర్భం మనకు కనిపిస్తుంది. ఐతే ఒక శాస్త్రీయ దృష్టికోణం నుండి కాకుండా, బుద్ధుడు ఉపనిషత్తుల భావజాలానికి మతపరమైన ప్రతిస్పందనగా గతితర్కాన్ని ప్రతిపాదించాడని మనం గమనించాలి." (దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ)

దురాశతో నిండి, ప్రశాంతత కొరవడి, అనిశ్చిత స్థితి, ఉద్వేగాలు నిండిపోయిన ఆ నాటి సంచలనభరిత సమాజానికి బుద్ధుడి బోధనలు ఒక సాంత్వన గా పరిణమించాయి. ఆనాడు కొనసాగుతున్న వైదిక కర్మకాండల సంస్కృతికి, దానితోపాటు కొనసాగుతున్న అణచివేతకు ఇవి పూర్తి విరుద్ధం. అందువల్లనే తొలినాటి బౌద్ధం ఒక ఉపశమనం కలిగించే సాధనంగా పని చేసింది. అసంఖ్యాకంగా ఉన్న సామాన్య ప్రజానీకంతోబాటు రాజులు, వ్యాపారులు సైతం బౌద్ధాన్ని ఆదరించారు. ఈ కొత్త మతాన్ని, నైతికతను ప్రబోధించే శ్రమణకులకు, సంఘాలకు వారు ఉదారంగా ధనాన్ని అందించారు. క్రీ.పూ. 3వ శతాబ్దం నాటికి అతి గొప్ప భారతీయ సామ్రాజ్యంగా చరిత్రలో నిలిచిన మౌర్య సామ్రాజ్యానికి బౌద్ధం అధికార మతంగా ఉండేది.

సాంప్రదాయ బ్రాహ్మణ వ్యవస్థ మినహా తక్కిన పాలకవర్గాలన్నింటినుండీ ఆదరణ లభించడంతో క్రమంగా బౌద్ధం తన తొలినాటి మూలాలనుండి క్రమంగా వైదొలగడం ప్రారంభమైంది.

"యావత్తు బౌద్ధ ఉద్యమం చివరికి అత్యంత ఆడంబరమైన పదజాలంతో నిండిపోయి ప్రపంచ అస్తిత్వాన్నే తృణీకరించే భావవాద దృక్పథంగా పరిణమించింది. శాస్త్ర విజ్ఞానాభివృద్ధికి ఆటంకంగాను, పలు మూఢవిశ్వాసాలను సమర్థించేదిగాను తయారైంది. అవాస్తవికమైన ఊహాగానాలకు బుద్ధుడు పూర్తి వ్యతిరేకి. నిరీశ్వరవాది. అటువంటి దగ్గర బయలుదేరిన బౌద్ధ దర్శనం ఈ విధంగా తర్వాత కాలంలో పరిణమించడం కొంత వితంగానే కనిపిస్తుంది. ఐతే ఈ మార్పుకు మూలం బౌద్ధశ్రమణకులు ఉత్పత్తితో ముడిపడిన శ్రమనుండి విడిపోయి కేవలం వ్యాపారులు, ప్రభువులు ఇచ్చే కానుకలమీదనే ఆధారపడడం లో ఉంది. ఐతే ఈ క్రమంలో పూర్తిగా అధ్యయనానికి, తాత్విక సమాలోచనలకు కూడా తగినంత తీరుబాటు లభించింది. ఆమేరకు బౌద్ధం భారతీయ తత్వశాస్త్రాన్ని ఒక మెట్టు పైస్థాయికి చేర్చింది." (దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ)

ఎప్పుడైతే శ్రమజీవుల ప్రపంచం నుండి వేరుపడ్డారో అప్పుడే బౌద్ధ శ్రమణకులు క్రమంగా భావవాదం వైపు జారిపోయారు. సంఘ నిర్వహణకు సంబంధించి వినయ పిటక లో నిర్దేశించిన నిబంధనలనుండి మినహాయింపులు ఇవ్వాలని కూడా వారు కోరడం మొదలుపెట్టారు. బుద్ధుడిని 'లోకోత్తర బుద్ధుడు' గా, అంటే ఈ జగత్తుకు అతీతమైనవాడిగా, ప్రచారం చేయసాగారు. బుద్ధుడు మళ్ళీ పునర్జన్మ ఎత్తి బోధిసత్త్వుడుగా పలు అవతారాలు ధరించాడని ప్రచారం చేసే జాతక కథలు బహుళ ప్రచారంలోకి వచ్చాయి. బౌద్ధం మహాయాన, హీనయాన శాఖలుగా చీలిపోయింది. హీనయానం బుద్ధుడి బోధనలకు కట్టుబడి వ్యవహరించే శాఖ. అది ఇప్పుడు బాగా బలహీనపడింది. క్రీ.శ,2వ శతాబ్దం లో నాగార్జునుడు ప్రతిపాదించిన శూన్యవాదం పూర్తిగా భావవాదమే.

స్వతహాగా బౌద్ధం నిరీశ్వరవాదం. ఐతే అది తత్వ శాస్త్రపు మౌలిక ప్రశ్నకు సూటిగా సమాధానం ఇవ్వడానికి పూనుకోలేదు. పదార్థం- చైతన్యం ఈ రెండింటిలో ఏది ప్రాథమికం అన్నదే ఆ మౌలిక ప్రశ్న. బౌద్ధం కేవలం దైవం అనేది అప్రస్తుత

విషయం అని మాత్రమే చెప్పింది. వైదిక క్రతువులను సవాలు చేసి పురోహిత వర్గాల పెత్తనాన్ని ఎదిరించింది, ఐతే కుల వ్యవస్థకు ఎటువంటి తీవ్రమైన ముప్పునూ అది కలిగించలేకపోయింది. దాదాపు 1000 సంవత్సరాలపాటు తాత్వికరంగంలో పైచేయిని కలిగివున్నప్పటికీ, బౌద్ధం కుల వ్యవస్థమీద గట్టి ప్రభావాన్ని చూపలేకపోయింది.

## ఇ. జైనం

వర్ధమాన మహావీరుడు (క్రీ.పూ. 599–527) జైన మతాన్ని స్థాపించాడని కొందరు భావిస్తారు కాని అది వాస్తవం కాదు. జైనం మూలాలు అంతకన్నా చాలా ముందు కాలం నుండే ఉన్నాయి. మహావీరుడే స్వయంగా తాను 24వ జైన తీర్థంకరుడినని (జైన గురువును తీర్థంకరులు అంటారు) తనకు ముందు 23 మంది తీర్థంకరులు ఉన్నారని ప్రకటించాడు. యజుర్వేదంలో రిషభుడు, అజితనాథుడు, అరిష్టనేమి అనే ముగ్గురు తీర్థంకరుల పేర్లు ఉన్నాయి. భాగవత పురాణం జైనమతాన్ని ప్రారంభించినది రిషభుడు అని పేర్కొంది. క్రీ.పూ. 776లో మరణించిన పార్శ్వనాథుడికి అనుయాయిగా మహావీరుడు ఉన్నాడు. మహావీరుడు జైన మతాన్ని సంస్కరించి బహుళ ప్రచారంలోకి తెచ్చాడు కనుక చాలామంది మహావీరుడే జైనమత ప్రారంభకుడు అని పొరబడుతూంటారు.

భారత ఉపఖండంలో దాదాపు ఏక కాలంలో బౌద్ధం, జైనం పక్కపక్కనే ప్రచారం పొందడం ప్రాధాన్యత కల అంశం. మహావీరుడు, బుద్ధుడు సమకాలీకులు. అశోకుడి శిలాశాసనాలలో అన్ని మతాలనూ గౌరవించాలని, వివిధ మతాలను అనుసరించే ప్రజలందరూ సుహృద్భావంతో కలిసి మెలిసి జీవించాలని ప్రకటిస్తాయి. ఆ శాసనాలలో బ్రాహ్మణ మతం, శ్రమణక మతాల గురించి ప్రస్తావన ఉంది. ఎక్కడా హిందూ మతం అన్న పదం లేదు. సన్యాసుల ద్వారా ప్రచారం జరిపే మతాలను– అంటే బౌద్ధం, జైనం– శ్రమణక మతాలుగా పేర్కొన్నారు.

'జిన' అన్న మూల పదం నుండి జైనం వచ్చింది. జినుడు అంటే గెలిచినవాడు అని అర్థం. జినుడు అవడం ఎలా? ఈ ప్రాపంచిక కాంక్షలను, బలహీనతలను జయించడం ద్వారా జినుడు కావాలి. ఈ క్రమంలో ఆ వ్యక్తి అత్యున్నత స్థాయి జ్ఞానాన్ని పొందగలుగుతాడు.

బుద్ధుడి లాగే మహావీరుడు కూడా ఒక రాకుమారుడు. కశ్యప గణానికి చెందినవాడు. 12 సంవత్సరాలపాటు స్వీయ ధ్యానంలో కొనసాగిన అనంతరం, పెద్దల అనుమతితో అతడు తీర్థంకరుడు అయాడు.

బౌద్ధం లాగే జైనం కూడా దైవం ఉనికిని గుర్తించడానికి నిరాకరిస్తుంది. వేదాల ప్రమాణాన్ని, అధికారాన్ని సైతం జైనం తిరస్కరిస్తుంది. కనుక కుల వ్యవస్థను కూడా వ్యతిరేకిస్తుంది. క్రీ.శ. 8వ శతాబ్దానికి చెందిన హరిభద్రుడు అనేవ్యక్తి రచించిన 'సద్దర్శన సముచ్చయ,' 15వ శతాబ్దానికి చెందిన గుణరత్నుడు రచించిన 'తర్క రహస్య దీపిక' అన్న రెండు గ్రంథాలూ జైన దర్శనం యొక్క మౌలిక సిద్ధాంతాలను వివరిస్తాయి.

ఈశ్వరవాదాన్ని సవాలు చేయగల తర్కం కలిగివుండడం జైన దర్శనానికి బలమైన అంశం.

"కుండ మట్టితో తయారౌతుంది. కాని ఆ మట్టి తనంతట తానే కుండగా మారలేదు. అందుకు ఒక కుమ్మరి కావాలి. అదే విధంగా ఈ భౌతిక ప్రపంచం తనంతట తానే ఉనికిలోకి రాలేదు. దానిని సృష్టించినవాడే భగవంతుడు" – ఇది ఈశ్వరవాదుల వాదన. ఈ వాదనను పలు విధాలుగా జైనం సవాలు చేసింది.

(1) కుండను కుమ్మరి తయారు చేశాడు అంటే దానర్థం అతడు తయారు చేయకమునుపు ఆ కుండ ఉనికి లో లేదన్నమాట. అదే మాదిరిగా ఈ జగత్తును భగవంతుడు సృష్టించాడనుకుంటే అంతకు ముందు ఈ జగత్తు అనేది లేని కాలం అంటూ ఒకటి ఉండివుండాలి. కాని ఈ జగత్తు అనంతంగా ఉనికిలో ఉందనేది సత్యం. ప్రకృతి లేని స్థితి అనేది ఎప్పుడూ లేదు. కనుక కుండాకుమ్మరి సామ్యం ఈ ప్రకృతికి వర్తించదు.

(2) కాస్సేపు కుండాకుమ్మరి సామ్యాన్ని అంగీకరిద్దాం. అప్పుడు అన్ని కుండలనూ ఒకే కుమ్మరి చేశాడని భావించగలమా? కనుక ఈ జగత్తును సృష్టించిన భగవంతులు అసంఖ్యాకంగా ఉండివుండాలి. అనేక చీమలు ఒక పుట్టను నిర్మించిన మాదిరిగా ఈ అనంతమైన జగత్తును వారంతా నిర్మించివుండాలి. అటువంటప్పుడు ఈశ్వరవాదులు సృష్టికర్త ఒకరేనని ఎలా చెప్పగలరు?

(3) ఒక కుమ్మరికి కుండను తయారుచేయగల నైపుణ్యం, తెలివితేటలు ఉన్నట్టే, సృష్టికర్త కూడా సర్వశక్తి సంపన్నుడైవుండాలి. కాని ఎటువంటి సృజనాత్మక జోక్యమూ లేకుండానే అనేక చెట్లూ, చేమలూ తమంతట తామే పెరుగుతున్నాయి కదా ? వాటి వెనుక సృష్టికర్త మేథస్సు ఉందా?

ఈ విశ్వంలో చాలా శూన్య ప్రదేశం ఉంది. ఈ శూన్యాన్ని ఎవరు సృష్టించారు? అసలు శూన్యాన్ని ఎవరైనా సృష్టించడం అనేదానికి అర్థం ఏమైనా ఉందా? కాకుంటే, ఈ శూన్యం ఎలా ఉనికిలో ఉంది?

(4) మనకి కుమ్మరి కనిపిస్తాడు కనుక అతడే కుండను తయారు చేశాడని అంగీకరిస్తాం. మరి సృష్టికర్తను చూడకుండానే అతడే ఈ జగత్తును సృష్టించాడని ఎలా అంగీకరిస్తాం?

(5) కుమ్మరి కుండను తయారు చేయడానికి తన రెండు చేతులతోబాటు కుమ్మరి సారె (చక్రం) ను కూడా ఉపయోగిస్తాడు. సృష్టికర్త ఈ ప్రపంచాన్ని ఏ శరీరమూ లేకుండానే ఎలా సృష్టించాడు? కుమ్మరి కేవలం తన తెలివితేటలతోనే కుండను తయారు చేయలేదు కదా? అదేవిధంగా సృష్టికర్త కేవలం తన తెలివితేటలతోనే ఈ జగత్తును ఎలా సృస్టించగలడు? అందుకు శరీరం కూడా ఉండాలి కదా? సృష్టికర్తకు శరీరం ఉంటే అది కనిపించాలి కదా? కనపడకపోతే సృష్టికర్త ఉన్నాడని ఎలా అంగీకరిస్తాం?

(6) దైవానికి అదృశ్యం అవగల శక్తి ఉందని వాదిస్తే అందుకు ముందు దైవానికి ఒక శరీరం ఉందని ఒప్పుకోవాలి. శరీరం అనేది ఉంటేనే అది అదృశ్యం అవడం అనే అంశం చర్చకు వస్తుంది.

(7) సృష్టికర్త అనేవాడు ఉంటే ఈ జగత్తును ఎందుకు సృష్టించాడు? సృష్టించాలనే కోరిక కలిగినందువల్లా? అటువంటి కోరిక ఉండాలంటే శరీరం ఉండాలి కదా? శరీరం లేకుండా కోరిక ఎలా కలుగుతుంది?

(8) కర్మ సిద్ధాంతాన్ని అంగీకరించాలంటే అంతకు ముందు దైవం శక్తిహీనుడు అని ఒప్పుకోవాలి. ఆ యా జీవుల పూర్వ కర్మను బట్టి సృష్టి జరుగుతుందంటే దానర్థం సృష్టి భగవంతుని ఇచ్ఛను బట్టి జరగదనే కదా? శక్తిహీనుడు దైవం ఎలా అవుతాడు?

(9) భగవంతుడు జగత్తును దయతో సృష్టించాడా? అదే వాస్తవమైతే ఈ ప్రపంచంలో బాధ, వేదన, కష్టాలు ఉండకూడదు కదా? మరి నిజానికి చాలా బాధలు, వేదన, కష్టాలు ఉన్నాయెందుకు? దానర్థం భగవంతుడికి దయ లేదనా? అదే సత్యం అయితే దయాహీనుడిని ప్రార్థించడం దేనికి?

(10) భగవంతుడు సర్వశక్తి సంపన్నుడు అయితే తన సృష్టిని నాశనం చేసే శక్తులను ఎందుకు సృష్టించాడు? తన ఉనికినే గుర్తించడానికి నిరాకరించే నిరీశ్వరవాదులను ఎందుకు సృష్టించాడు?

ఈ విధంగా జైన దర్శనం దైవం ఉనికిని సవాలు చేసింది. జైనం బోధించే జ్ఞాన సిద్ధాంతం ప్రకారం ఐదు దశల్లో జ్ఞానం సిద్ధిస్తుంది.

మొదటి దశను **'మతి'** అంటారు. ఇది మన జ్ఞానేంద్రియాల గ్రహణ శక్తిని బట్టి ఉంటుంది.

రెండవ దశ **'శృతి'**. ఇతరులనుండి విని నేర్చుకోవడం ద్వారా ఈ దశకు చేరుకుంటాం. గుర్తులు, సంకేతాల ద్వారా కూడా నేర్చుకుంటాం. (ఈ గుర్తులు, సంకేతాలే తర్వాత కాలంలో లిపిగా, రాతపూర్వక భాషగా పరిణామం చెందాయి.)

మూడవ దశ: **అవధి** : ఎక్కడో దూరాన ఉన్నవాటి గురించి కూడా ఇక్కడినుంచే మనం తెలుసుకోవడం (బహుశా ఇది టెలిపతి వంటిది అయివుండాలి)

నాలుగవది : **మనఃపర్యాయ.** అంటే మనస్సును చదవడం.

ఐదవది : **కేవల :** మొత్తం వాస్తవికతకు సంబంధించిన జ్ఞానాన్ని తెలుసుకోవడం.

ఈ ఆఖరి స్థాయిని చేరుకున్నవారు తీర్థంకరులయే అర్హత పొందుతారు.

సత్యాన్ని ఋజువు చేయడానికి ఆచరణే కొలబద్ద అని జైనులు పరిగణిస్తారు. మానవ సమాజానికి ఏది మంచి చేస్తుందో, ఏది హాని కలిగిస్తుందో తెలుసుకోగలగడమే నిజమైన జ్ఞానంఅని జైనం చెప్తుంది.

జైనం ప్రతిపాదించిన అనేకాంతవాదం ఒక విధమైన ద్వంద్వ తత్వం లాంటిది. (అంటే పదార్థం, చైతన్యం రెండూ ప్రాథమికమేనని భావించడం) ఆత్మ శరీరాన్ని అంటిపెట్టుకునేవుంటుందని జైనం భావిస్తుంది. ఐతే ఆత్మ మానవ శరీరంతో నిమిత్తం లేకుండా స్వతంత్రంగా కూడా ఉనికిలో ఉండగలదు అని కూడా చెప్తుంది.

పదార్థానికి అజీవ, సజీవ లక్షణాలు ఉంటాయని కూడా జైనం చెప్తుంది. పదార్థానికి ఒక శాశ్వత స్వభావం, ఒక నిరంతరం మారిపోయే స్వభావం –రెండూ ఉంటాయని అంటుంది. పదార్థంలోని ద్రవ్యం (మూల పదార్థం) శాశ్వతం. ఆ పదార్థపు లక్షణాలు, ప్రభావాలు మాత్రం నిరంతరం మారిపోతూవుంటాయి.

మొక్కలు, పురుగులు, పక్షులు, వగైరా జీవులతో సహా అన్నింటిలోనూ ప్రాణం ఉంది కనుక వాటన్నింటికీ ఆత్మ ఉంటుంది. మనం చేసే మంచి, చెడ్డ పనులన్నీ మన ఆత్మను అంటిపెట్టుకుని ఉంటాయి. (పాత్రకు మసి అంటుకున్నట్టు) ఆత్మ ఈ మసిని పూర్తిగా వదిలించుకున్నప్పుడే దానికి పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది. అప్పుడది ఈ విశ్వపుటంచులను చేరుకుంటుంది.

జైనంలోని ఈ అనేకాంతవాదం ఆ దర్శనంలోని పరస్పర విరుద్ధ అంశాలను వ్యక్తం చేస్తుంది. ఒకవైపు చాలా బలంగా దైవం ఉనికినే సవాలు చేస్తుంది. మరొకవైపు ఆత్మ స్వతంత్రంగా ఉనికిలో ఉంటుందని కూడా చెప్తుంది.

నైతిక విలువలకు జైనం చాలా ప్రాధాన్యతనిస్తుంది. ప్రతీ జీవిలోనూ ఆత్మను చూస్తారు గనుక జైనులు పూర్తి శాకాహారులుగా ఉంటారు.

జైనంలో శ్వేతాంబరులు, దిగంబరులు అని రెండు శాఖలు ఉన్నాయి.

చారిత్రిక ప్రాధాన్యత: శ్రమణక మతాలు రెండూ, అంటే బౌద్ధం, జైనం, బ్రాహ్మణవాద వైదిక క్రతువుల వ్యవస్థ ఆధిపత్యం నుండి ఉత్పత్తి శక్తులను విడుదలచేసిన అభ్యుదయకర పాత్రను పోషించాయి. జంతుబలిని నిషేధించాలని ఈ రెండు మతాలూ చెప్పాయి. అది వ్యవసాయాన్ని, రవాణాను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడానికి దోహదం చేసింది. అభివృద్ధి చెందిన ఉత్పత్తి విధానం వలన ఎక్కువగా ప్రయోజనం పొందిన రాజులు, వ్యాపారులు ఈ మతాలను అందుకే ఆహ్వానించారు, ఆదరించారు. ఐతే, సమానత్వం గురించి ఈ మతాలు చేసిన ప్రబోధాలు ఆ శ్రమణకులవరకే పరిమితం అయాయి. దోపిడీ వ్యవస్థనుండి సామాన్య ప్రజలకు విముక్తి కలిగించలేకపోయాయి.

## ఆస్తిక దర్శనాలు

సాంఖ్యం, మీమాంస, యోగం, న్యాయం, వైశేషికం, వేదాంతం అనే ఆరు దర్శనాలూ భారతీయ తత్వ శాస్త్రంలో ప్రధానమైన ఆస్తిక దర్శనాలు. (అ) సాంఖ్య దర్శనం : సాంఖ్యం గురించిన ప్రస్తావనలు తొలి బౌద్ధ సాహిత్యంలో, ఉపనిషత్తులలో (ఛాందోగ్యోపనిషత్, కథోపనిషత్, శ్వేతారోపనిషత్ వగైరా), శంకరుని రచనలలో మనకు కనిపిస్తాయి. భగవద్గీతలో ఏకంగా ఒక అధ్యాయమే సాంఖ్య యోగం పేర ఉంది. దీనిని బట్టి సాంఖ్య దర్శనం ఎంత ప్రాముఖ్యత కలిగినట్టిదో, సమాజం మీద

ఎంత బలమైన ప్రభావాన్ని కలిగించిందో మనం ఊహించవచ్చు. క్రీ.పూ. 8వ శతాబ్దంలో సాంఖ్య దర్శనం రూపొందిందని చెప్పవచ్చు. దీనికి ఆద్యుడు కపిలుడు.

సాంఖ్య దర్శనాన్ని మనకు అందించడానికి ఆధారాలుగా ఉన్నవి క్రీ.శ. 11వ శతాబ్దంలో ఈశ్వరకృష్ణ రచించిన సాంఖ్య కారికలు, క్రీ.శ. 14 వ శతాబ్దంలో రాసిన సాంఖ్య సూత్రాలు మాత్రమే. ఈ ఈశ్వరకృష్ణ భావవాది అయినందున సాంఖ్య దర్శనాన్ని తన తాత్విక వైఖరికి అనుగుణంగా వ్యాఖ్యానించివుండొచ్చు. లేదా అసలైన సాంఖ్య దర్శనంలోనే తన స్వంత భావనలను జొప్పించివుండవచ్చు. నిజానికి ప్రాచీన కాలపు తాత్విక దర్శనాలన్నింటిలోనూ ఇదే విధంగా జరిగింది. కపిలుడికి, ఈశ్వరకృష్ణకు నడుమ 18 లేదా 19 శతాబ్దాల కాలం గడిచింది. కపిలుడి తొలి తాత్విక భావజాలాన్ని వక్రీకరించడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. ఐతే సాంఖ్య దర్శనానికి సంబంధించి ఒక ముఖ్యమైన అంశం ఏమంటే, దాదాపు ప్రతీ ప్రాచీన తత్వవేత్తా సాంఖ్యం లోని భావాల గురించి ఏదో ఒక విధంగా చర్చించక తప్పలేదు. సాంఖ్యం లోని మౌలిక ప్రస్తావనలు ఈ విశ్వానికి సంబంధించి బలమైన భౌతికవాద దృక్పధాన్ని అనుసరించివున్నాయి.

ఆస్తికత్వం లేదా ఈశ్వరవాదం ఈ విశ్వాన్ని దైవం లేదా పరబ్రహ్మ సృష్టించినట్టు చెప్తుంది. ఆ పరబ్రహ్మే సృష్టినంతటినీ నియంత్రిస్తాడని చెప్తుంది. సాంఖ్యవాదం ఈ అభిప్రాయాన్ని బలంగా తిరస్కరిస్తుంది. ఈశ్వరవాదాన్ని తిరస్కరిస్తూ సాంఖ్యం ముందుకు తెచ్చినదే స్వభావవాదం. స్వభావవాదం లోని ప్రధానాంశాలు ఈ విధంగా ఉంటాయి:

ప్రకృతి అనంతం. ప్రకృతికి సహజసిద్ధంగా, అంటే స్వభావరీత్యా, ఉన్న లక్షణం వల్లనే అందులో నిరంతరం మార్పులు జరుగుతూవుంటాయి. దాని స్వభావం వల్లే విశ్వం మనకు ప్రస్తుతం ఈ రూపంలో కనిపిస్తోంది. ఆవు స్వభావరీత్యా గడ్డి మేసి నీరు తాగుతుంది. అదే సమయంలో, ఆ ఆవు స్వభావరీత్యా దాని పొదుగులో పాలు ఏర్పడతాయి. లేగదూడ దాని స్వభావరీత్యా ఆ పాలను తాగుతుంది. ఎగువ నుండి పల్లానికి నీరు ప్రవహించడానికి కారణం దాని స్వభావమే. ఆ నీటికి తనకంటూ వేరే చైతన్యం అనేది ఏమీ ఉండదు. కాని జీవులు బతికివుండాలంటే వాటన్నింటికీ నీరు అవసరం. నీటిలో స్వభావరీత్యా ఉన్న లక్షణం కారణంగానే ఈ విధంగా ఉంది.

ఉనికిలోనే లేని దైవమే దీనికంతటికీ కారణం అంటూ మనం ఆపాదంచలేము. వేడి, కాంతి అనేవి నిప్పు యొక్క స్వభావం. వస్తువు నుండి దాని స్వభావాన్ని వేరు చేయలేము. నిప్పు నుండి వేడిని గాని కాంతిని గాని వేరు చేయలేము. దర్భగడ్డి అంచులు వాడిగా ఉంటాయి. ఆ గడ్డి నుండి దాని స్వభావమైన వాడితనాన్ని వేరు చేయలేం. స్వభావం పదార్థంలోనే నిబిడీకృతమైఉంటుంది.

**ఈశ్వరవాదాన్ని బలంగా తిరస్కరిస్తూ సాంఖ్యం దిగువ విధంగా వాదనలు చేసింది.:**

(క) ఈశ్వరవాదులు దైవం నిర్గుణం అని అంటారు. అంటే ఏ గుణాలూ లేనివాడని అర్థం. ఈ ప్రపంచం యావత్తూ అనేక గుణాలు ఉన్న పదార్థంతో నిండివుంది. గుణమయమైన ఈ ప్రపంచం నిర్గుణుడైన దైవం నుండి ఆవిర్భవించడం ఎలా సాధ్యమౌతుంది? తెల్ల దారంతో ఒక వస్త్రాన్ని గనుక నేస్తే మనకు తెల్లని వస్త్రమే లభిస్తుంది. అదే నల్లని దారంతో నేస్తే నల్ల వస్త్రం లభిస్తుంది. వస్త్రానికి కలిగే గుణం దానిని నేసిన దారాన్ని బట్టే ఉంటుంది. అదే విధంగా ఈ విశ్వంలో ఉన్న సకల పదార్థాలూ వాటి గుణాలను ఆ యా పదార్థాల మూలకాలనుండే పొందుతాయి. ఈ విశ్వం దైవం నుండే ఆవిర్భవించడం అన్నది వాస్తవమే అయితే ఈ ప్రపంచంలోని పదార్థాల గుణాలన్నీ ఆ దైవం నుండే సంక్రమించివుండాలి. అటువంటప్పుడు దైవం నిర్గుణుడెలా ఔతాడు?

(ఖ) దైవం నిర్గుణుడని అన్నప్పుడు పదార్థమయం అయిన ఈ విశ్వంలో ఆ పదార్థం అంతా గుణాలను కలిగేవుండడం ఎలా జరిగింది? నిర్గుణుడైన దైవమే ఈ విశ్వానికి మూలం అయినప్పుడు ఆ మూలంలోంచి గుణాలు కలిగిన పదార్థం ఎలా వచ్చింది? పదార్థం కూడా నిర్గుణమే అయివుండాలి కదా? పదార్థరహితం అయిన దానినుండి పదార్థం ఎలా వచ్చింది? కార్యానికి, కారణానికి మధ్య మౌలికంగా ఉమ్మడి స్వభావం ఉండాలి కదా? దైవం కారణం అయి, విశ్వం దాని కార్యం అయినప్పుడు రెండింటికీ మధ్య ఉమ్మడి స్వభావం ఏది? అందుచేత దైవం అనే భావన మౌలికంగానే తనకు తానే విరోధిస్తుంది.

(గ) దైవం సృష్టికర్త అయితే ఎందుకు ఈ విశ్వాన్ని సృష్టించినట్లు? అతని ఆనందం కోసమా? పర్యవసానాలెలా ఉండబోతున్నాయన్నదానితో నిమిత్తం లేకుండా ఎవరైనా తన ఆనందం కోసం ఏ పనినైనా చేసే అతడు స్వార్థపరుడౌతాడు. దైవం స్వార్థపరుడని ఈశ్వరవాదులు అంగీకరిస్తారా? దైవం నిర్గుణుడని వారంటారు గనుక స్వార్థం అనే గుణం అతడికి ఉందని వారు ఒప్పుకోలేరు.

ఒకవేళ దయతో, ప్రేమతో ఈ విశ్వాన్ని గనుక దైవం సృష్టించాడని అనుకుందాం. నిర్జీవ పదార్థాలపై ఎవరూ దయను, ప్రేమను చూపలేరు. జీవ పదార్థాలపైనే చూపగలరు. జీవ పదార్థాలు అస్తిత్వం లోకి వచ్చాకనే వాటిపై దైవం దయ, ప్రేమ చూపగలడు. ఆ జీవ పదార్థాలను సృష్టించకముందే వాటిపై దయను, ప్రేమను కలిగివుండడం ఏ విధంగా సాధ్యం? ఈ రెండింటిలో ఏది ముందు? దైవానికి ముందు దయ కలిగిందా? లేక జీవులు ముందు వచ్చాయా?

(ఘ) పోనీ, దైవం దయతోనే ఈ విశ్వాన్ని సృష్టించాడనుకుందాం. అప్పుడు ఈ దయ ఎందుకు కలిగింది? అన్న ప్రశ్న తలెత్తుతుంది. జీవుల బాధలనుండి వారిని విముక్తి చేయడం కోసం ఈ దయ కలిగిందా? అసలు జీవులు ఎందుకు బాధలు పడాలి? వాటికి శరీరాలు ఉండబట్టే బాధలు కలుగుతాయి. నొప్పి, బాధ వంటివి శరీరం అనేది ఉన్నప్పుడే కలుగుతాయి. ఈ బాధలు, నొప్పులు లేకుండా పోవాలని దైవం అనుకుని వున్నట్లైతే జీవులకు ఈ శరీరాలను ఎందుకు సృష్టించాడు? బాధలకు, నొప్పికి కారణభూతం అయిన శరీరాలను సృష్టించినది దైవమే కనుక అతడే ఈ బాధలకు మూలకారణం అయినట్టు పరిగణించాలి. ఇందుకు ఈశ్వరవాదులు అంగీకరిస్తారా?

(ఙ) దైవం ఈ విశ్వాన్ని సృష్టించినప్పుడు, ఆ తర్వాత బాధలు, కష్టాలు తలెత్తుతాయి. ఆ తర్వాత దైవం జాలి ప్రదర్శించాడు. ఇదే వాస్తవం అయితే, ముందు సృష్టి జరిగినట్టు, ఆ తర్వాతే దయ. జాలి దైవానికి కలిగినట్టు ఒప్పుకోవాలి. అటువంటప్పుడు దైవం ఈ విశ్వాన్ని దయతో సృష్టించాడు అని చెప్పడం తప్పు.

ఈశ్వరవాదాన్ని శక్తివంతంగా తిప్పికొట్టడానికి సాంఖ్యం పై విధంగా కార్య–కారణ సంబంధం అనే తర్కాన్ని ఉపయోగించి సవాలు చేసింది.

**పరిమితులు :** ఈశ్వవాదాన్ని సవాలు చేయడం మీదనే సాంఖ్యం ప్రధానంగా కేంద్రీకరించింది. ఆ క్రమంలో ఈ వర్గ సమాజంలో నిబిడీకృతమైవున్న వాస్తవ వైరుధ్యాల గురించి అది పట్టించుకోలేదు. అందుచేతనే అది వైదిక పురోహిత వర్గపు అధికారాన్ని అది బలంగా ఎదుర్కోలేకపోయింది. ఈ విషయంలో సాంఖ్యం లోకాయతం కన్నా వెనకబడింది. సాంఖ్యాన్ని పూర్తిగా అంతం చేయడం బదులు పాలకవర్గాలు దాన్ని ఒక దర్శనంగా ఆమోదించి, అందులో తమ భావజాలాన్ని జొప్పించి కలగాపులగం చేసివేశారు. తమ వ్యాఖ్యానాలతో దాని మూలాలను గందరగోళం చేశారు. ఇంకో అడుగు ముందుకేసి కపిలుడు విష్ణువు అవతారం అంటూ ప్రకటించారు. ఆ విధంగా సాంఖ్య దర్శనం యొక్క భౌతికవాద సారాంశాన్ని అణచిపెట్టారు.

## (ఆ) మీమాంస

మీమాంస దర్శనానికి ఆధారం జైమిని రచించిన సుభాషితాలు. దాదాపు 2500 సుభాషితాలు మీమాంస సూత్రాలు అన్న మూల గ్రంథంలో ఉన్నాయి. వీటి కాలం క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 200 మధ్య ఎప్పుడైనా అయివుండాలి. ఐతే ఈ దర్శనం లోని భావాలు అంతకన్నా ముందునుండే ఉనికిలో ఉండివుండాలి. జైమిని అనేది ఒక ఋషి పేరు కాదని, అది ఒక గోత్రం పేరు అని కూడా వాదిస్తారు. క్రీ.శ. 4వ శతాబ్దంలో శబరుడు రచించిన శబర భాష్యం మీమాంస సూత్రాలను వివరించింది. క్రీ.శ. 7వ శతాబ్దానికి చెందిన కుమారిలుడు, ప్రభాకరుడు మీమాంస దర్శనాన్ని బలంగా ముందుకు తెచ్చారు. భావవాదం ప్రచారం చేసే ప్రళయం, సృష్టి, కర్మ, అదృష్టం వంటి భావనలను మీమాంసకులు తీవ్రంగా వ్యతిరేకించారు.

ఈ భూమి మీద పాపాలు పెరిగిపోయి ఆ భారాన్ని భూమి ఇంక భరించలేని స్థితి ఏర్పడినప్పుడు దైవం ప్రత్యక్షం అవుతాడని, ప్రళయం ద్వారా మొత్తం సృష్టినంతటినీ నాశనం చేసి మళ్ళీ కొత్తగా సృష్టిని ప్రారంభిస్తాడని భావవాదులు ప్రచారం చేస్తారు. ఇదే ప్రళయం, సృష్టి అనే భావనల అర్థం. దీనిని మీమాంసకులు ఈ విధంగా సవాలు చేశారు:

(క) ప్రళయం భూమిపైన పాపాలను మొత్తంగా తుడిచిపెట్టడమే అయితే అటువంటి ప్రళయం కేవలం పాపులను మాత్రమే నిర్మూలిస్తుందా? ఏ పాపాలూ చేయనివారిని సైతం నిర్మూలిస్తుంది కదా? వారు ఏం తప్పు చేశారని వారిని కూడా నిర్మూలిస్తుంది?

(ఖ) పుణ్యాత్ములందరూ స్వర్గానికి చేరి తమ పుణ్యాల ప్రతిఫలాన్ని పొందుతారని, పాపాత్ములందరూ నరకానికి పోయి తమ పాపాలకు తగిన శిక్షలను అనుభవిస్తారని సాధారణంగా భావిస్తూంటారు. ఒకసారి ప్రళయం సంభవిస్తే అప్పుడు ఈ భూమ్మీద ఉండే మొత్తం పుణ్మాత్ములందరూ ఒకేసారి స్వర్గానికి, పాపాత్ములందరూ ఒకేసారి నరకానికి పోతారు. అప్పుడు మళ్ళీ కొత్తగా సృష్టి ప్రారంభించాక ఈ భూమి మీదకు ఎవరు మళ్ళీ వస్తారు. వారి వారి కర్మల ఫలితాన్ని స్వర్గంలోనో, నరకం లోనో అనుభవిస్తూండాలి కదా?

(గ) ప్రస్తుత జన్మలో మనిషి జీవితాన్ని నిర్దేశించేది అతని అదృష్టం లని, అదృష్టం అంటే గత జన్మలో చేసిన మంచి, చెడు పనులన్నింటి అంతిమ పలితం అని , అదృష్టాన్ని ఎవరూ తప్పించుకోలేరని భావిస్తారు. కాని ప్రళయం ఒకేసారి అందరినీ నాశనం చేసివేస్తుంది. మరి గత జన్మలో ఆ యా జీవులు చేసిన పుణ్యాల, పాపాల కర్మ ఫలితాన్ని, లేదా అదృష్టాన్ని, పూర్తిగా అనుభవించనివ్వకుండా ప్రళయం అడ్డు పడినట్టే కదా? ప్రళయం గురించి చెప్పే సిద్ధాంతం సరైనదా? లేక కర్మ సిద్ధాంతమా? రెండూ సరైనవి కాలేవు కదా? ఏదో ఒక్కటే సరైనది కావాలి. అది ఏది?

ఈ విశ్వాన్ని దైవం సృష్టించాడన్న భావవాదులను మీమాంసకులు ఈ విధంగా సవాలు చేశారు:

(క) ఈ విశ్వాన్ని దైవం సృష్టించాడన్నది వాస్తవమే అయితే, అంతకు పూర్వం ఈ విశ్వమే ఉనికిలో లేని స్థితి అనేది ఒకటి ఉండివుండాలి కదా? అప్పుడు దైవం ఉనికిలో ఉన్నట్టా లేనట్టా? ఒకవేళ ఉనికిలో ఉండినట్టైతే అప్పుడు ఆ దైవం ఉనికిని నిర్ధారించినది ఎవరు? అలా నిర్ధారించినవారు ఎవరూ లేనప్పుడు దైవం ఉన్నాడని ఇప్పుడు చెప్పేదానిని మాత్రం ఏ విధంగా ఆమోదించగలం?

(చ) ఈశ్వరవాదులు దైవం ఈ విశ్వాన్ని సృష్టించాడని అంటారు. ఆ విధంగా ఈ విశ్వాన్ని సష్టించడానికి, దానిని పర్యవేక్షించడానికి దైవానికి శరీరం

ఉందా? కళ్ళు, చెవులు, వగైరా అవయవాలు కలిగిన శరీరం లేకుండా పర్యవేక్షించడం గాని సృష్టించడం గాని ఎలా సాధ్యపడుతుంది? కేవలం భావాలనుండే సృష్టి ఎలా సాధ్యపడుతుంది?

(ట) తన ఇచ్ఛ కారణంగా దైవం ఈ విశ్వాన్ని సృష్టించినది వాస్తవమే అయితే, అసలు దైవానికి ఆ ఇచ్ఛ ఏ శరీరమూ లేకుండానే కలిగిందా? శరీరం లేకుండా కోరిక ఎలా కలుగుతుంది?

(త) దైవానికి శరీరం ఉంది అని అంగీకరిస్తే అప్పుడు ఆ శరీరాన్ని ఎవరు సృష్టించారో చెప్పాలి. అది మరొక దైవమా? అదే అయితే, ఆ మరో దైవాన్ని ఎవరు సృష్టించారు?

(ప) దైవానికి వేరే సృష్టికర్త అవసరం లేదని, దైవం స్వయంభువు అని ఆస్తికులు వాదించడం సరైనదే అయితే భౌతికవాదులు ఈ విశ్వం అనంతం అని, దానిని ఎవరో ఒకరు సృష్టించవలసిన పని లేదని వాదించడం తప్పు ఎలా ఔతుంది?

ఈ ప్రపంచం మిధ్య, లేదా మాయ అన్న వాదనను మీమాంసకులు ప్రశ్నించారు. ఈ ప్రపంచం వాస్తవం కాదని, మనం అనుభవిస్తున్నది ఒక కల మాత్రమేనని భావవాదులు అంటారు. ఒక సారి ఆ కల నుండి మేలుకున్నాక (అంటే ఈ భౌతిక శరీరాన్ని ఆత్మ విడిచిపెట్టాక) ఇదంతా కల అన్న సంగతి తెలుస్తుందని వారంటారు. ఈ భావనను మీమాంసకులు బలంగా వ్యతిరేకించారు. కలలో ఉండడం, మేలుకుని ఉండడం అనేవి రెండు వేరు వేరు దశలు. ఈ రెండు దశలలోనూ మనకు ఒక భౌతిక శరీరం ఉన్నందువల్లనే ఈ రెండింటికీ ఉన్న తేడాను మనం గుర్తించగలం. అసలు శరీరం అనేదే లేనప్పుడు నిద్రలోకి పోవడం గాని, మేలుకునివుండడం కాని ఎలా సాధ్యం? మనం కలలను మేలుకున్నాక గుర్తుకు తెచ్చుకుంటాం. ఆ కలలు ఈ వాస్తవ ప్రపంచం గురించి మన ఆలోచనల్లో కలిగిన ప్రతిబింబాలే. (అవి అసహజమైన ప్రతిబింబాలు కూడా కావచ్చు) భావవాదులు రజ్జుసర్ప భ్రాంతి ని ఉదహరిస్తూ ఈ ప్రపంచం వాస్తవం కాదని తమ వాదనను సమర్ధించుకుంటారు. (తాడును చూపి పాము అనుకుని పొరబడడం లేదా పామును చూసి తాడు అనుకుని పొరబడడం) ఈ వాదనను మీమాంసకులు పటాపంచలు చేశారు. తాడుకు బదులు పాము అని గాని, పాముకు బదులు తాడు అని గాని

పొరపాటు పడడానికి అవకాశం ఉంది. ఎందుకంటే రెండింటికీ సాదృశ్యం ఉంది. కాని ఒక తాడును చూపి ఏనుగు అనో, ఒక పామును చూసి బల్ల అనో పొరపాటు పడం కదా. ఇక్కడ అటువంటి సాదృశ్యం లేదు కనుకనే ఆ విధంగా పొరపాటు పడడం జరగదు. ఏదేమైనా, మనకు ముందస్తుగా తాడు గురించి, పాము గురించి పరిజ్ఞానం ఉన్నప్పుడే ఒకదానిని మరొకటిగా భావించి పొరపాటు పడడానికి అవకాశం ఉంటుంది. ఆ విధంగా పొరపాటు పడినంతమాత్రాన తాడు గాని పాము గాని అవాస్తవిక విషయాలు అయిపోవు. అదే విధంగా పొరపాటు పడినంత మాత్రాన ఈ ప్రపంచం మిధ్య అయిపోదు. ఇంత బలంగా భావవాదపు ప్రచారాన్ని ఎదుర్కొన్న మీమాంసకులు వైదిక కర్మకాండల్ని మాత్రం చాలా గట్టిగా సమర్ధించడం, వేద ప్రమాణాన్ని అంగీకరించడం, ఆ కారణంగా కుల వ్యవస్థను బలపరచడం కొంత అసంబద్ధంగా కనిపిస్తుంది. దానికి బహుశా ఈ కారణం ఉండివుండొచ్చు: మీమాంసకులు యజ్ఞాన్ని ఒక మంత్రవిద్య గా పరిగణించారు. మంత్ర విద్య, లేదా ఇంద్రజాలం, లేదా తంత్రం అనేవి ఆదిమకాలపు మానవులు ప్రకృతిశక్తులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనే లక్ష్యంతో ఆచరించిన తంతులు. ఈ ప్రపంచం వాస్తవం అన్న ప్రాతిపదికపైనే వారు ఆ ప్రయత్నాలు చేశారు. అందుకే ఒకవైపుదైవం ఉనికిని బలంగా తిరస్కరిస్తూనే మరోవైపు వైదిక కర్మకాండలను బలంగా సమర్ధించారను కోవాలి. ఇక్కడ మనం చర్చించినదానిని పూర్వ మీమాంస అని అంటారు. ఉత్తర మీమాంస అని మరొక దర్శనం ఉంది. దానినే ప్రచారంలో వేదాంత దర్శనం అని కూడా అంటారు. అది పూర్తిగా భావవాద దర్శనం. పూర్వమీమాంసకు పూర్తి వ్యతిరేకం.

## (ఇ) యోగాచారం

యోగ సూత్రాలను పతంజలి రూపొందించినట్టు చెప్తారు. గట్టిగా చెప్పాలంటే యోగం అనేది ఒక తాత్విక దృక్పథమే కాదు. యోగాచారాలు చాలా పురాతనమైనవి. క్రీ.పూ మూడవ సహస్రాబ్ది నాటికే మన దేశంలో ఇటువంటి పద్ధతులు ఉనికిలో ఉన్నట్టు సింధునాగరికత కాలానికి చెందిన రాతి శిల్పాలమీద, చిత్రాలమీద, మట్టి సీళ్ళ మీద చిత్రించిన రూపాలు ధృవపరుస్తున్నాయి. సాంఖ్యంతో ఒక వైపు, దైవ భావనతో మరోవైపు కలగలిసిపోవడం అనేది తర్వాత కాలాల్లో జరిగింది.

"యోగ పద్ధతులు భిన్న దిశలలో, భిన్న గురువుల ద్వారా పలు మార్పులకు లోనయ్యాయి. శైవులు, శాక్తేయులు వారి వారి సిద్ధాంతాలకు అనుగుణంగా యోగాన్ని అభివృద్ధి చేశారు. హఠయోగం ద్వారా మరో దిశలో యోగం అభివృద్ధి చెందింది. చాలా విధాలుగా నిరంతరం సాగించే నరాల కసరత్తులతోకూడిన ఈ హఠయోగం ద్వారా అతీత శక్తులను, తాంత్రిక శక్తులను సాధించవచ్చునని భావించేవారు. ఈ పద్ధతులద్వారా మానవాతీత శక్తులను పొందవచ్చునని, రోగాలను నయం చేసే శక్తి వస్తుందని విశ్వసించేవారు. వివిధ రకాల యోగ విధానాలను ఒక దగ్గర చేర్చి వాటిలోంచి యోగం అనదగ్గవాటిని ఏరి, సాంఖ్యంతో వాటిని కలిపి మనకు అందించినవాడు పతంజలి. అందుచేత పతంజలి ని మనం యోగ దర్శనానికి సంపాదకుడుగా పరిగణించాలే తప్ప, అతడే యోగ దర్శనానికి ఆద్యుడు అని భావించరాదు" అని దాస్‌గుప్తా అంటారు. జైన మతానికి చెందిన మహావీరుడు, బుద్ధుడు అనేక సంవత్సరాలపాటు యోగాచారాన్ని ఆచరించిన అనంతరమే వారి వారి తాత్విక దృక్పథాలను ప్రతిపాదించారు. అందుచేత యోగాచారాన్ని చాలా పురాతన కాలం నుండీ ఉనికిలో కొనసాగుతున్న పద్ధతి గా పరిగణించడమే హేతుబద్ధంగా ఉంటుంది తప్ప దానినే ఒక తాత్విక దర్శనంగా పరిగణించడం కాదు. యోగం అంటే 'చిత్త –వృత్తి–నిరోధం' అని యోగసూత్రాలు నిర్వచించాయి. మేధోపరమైన చైతన్యం యొక్క ఆలోచనా క్రమం మీద ఏదో ఒక విధమైన నియంత్రణ సాధించడం కోసం చేసే ప్రయత్నం అని భావించవచ్చు. మానవ శరీరం (మనస్సు తో సహా) ప్రకృతి యొక్క సూక్ష్మ రూపం అని యోగం పరిగణిస్తుంది. ప్రకృతిలోని అనేక పదార్థాల నడుమ ఉండే పరస్పర సంబంధాలు, పరస్పర ప్రతిచర్యలు మన శరీరంలో ప్రతిబింబిస్తాయి. మన శరీరం మీద, మనస్సు మీద పట్టు సంపాదిస్తే మనచుట్టూ ఉన్న ప్రకృతిపైన కూడా పట్టు సంపాదించవచ్చునని యోగం భావిస్తుంది.

ఆదిమకాలంలోసైతం తమకు చాలా ఎక్కువ శక్తులు సమకూరాలన్న కాంక్షతో ప్రజలు కొన్ని పద్ధతులను అనుసరించేవారు. చాలా కష్టంతో కూడుకున్న పద్ధతులను, పనిగట్టుకుని శరీరాన్ని క్లేశానికి గురిచేసే పద్ధతులను అనుసరించేవారు. శరీరాన్ని అచేతన స్థితిలో చాలాసేపు ఉంచడం కూడా వాటిలో ఒకటి. ఈ పద్ధతులద్వారా సాధించాలనుకునే మానవాతీతశక్తులను పతంజలి 'విభూతి' అన్నాడు. దైవం ఉనికిని అంగీకరించడం మినహా తక్కిన యోగ దర్శనం యావత్తూ సాంఖ్యం చెప్పినదాన్నే తిరిగి చెప్పింది.

"సాంఖ్యంలోకి వ్యక్తిగతమైన దైవ భావనను జొప్పించడం ద్వారా యోగ దర్శనం దైవ విశ్వాసులను సంతృప్తిపరచడానికి పూనుకుంది. తద్వారా విశ్వానికి సంబంధించి సాంఖ్యంలో ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని విస్తారంగా ప్రచారం చేయడానికి అవకాశం కల్పించుకుంది. యోగ సూత్రాలలో దైవానికి సంబంధించి ఉన్న ప్రస్తావనలు ఒకదానితో మరొకటి సంబంధం లేకుండా విడివిడిగా ఉంటాయి. యోగ విధానానికి పూర్తి విరుద్ధమైన దిశలో ఆ దైవ భావనలు ఉంటాయి. యోగ సూత్రాల ప్రకారం దైవం ఈ విశ్వాన్ని సృష్టించినవాడూ కాదు, దీనిని శాసించేవాడూ కాదు. మానవులు చేసే తప్పొప్పులకు తగిన ప్రతిఫలాన్ని గాని శిక్షలను గాని దైవం అందించలేడు. యోగాచారాలను అనుసరించేవారు తమ పద్ధతుల అంతిమ లక్ష్యం దైవమేనని భావించరు." – (దేవీ ప్రసాద్ చట్టోపాధ్యాయ)

పై వివరణలను బట్టి యోగాచారాలు అనేవి ఆదిమకాలంనాటి నుండీ కొనసాగుతున్న కొన్ని పద్ధతులు అని భావించాలి. వాటిద్వారా తమ చుట్టూ ఉన్న ప్రకృతి పైన, తమ శరీరం పైన ఆధిపత్యం సాధించే అదనపు శక్తులను పొందడానికి ప్రయత్నించారు. ఈ ఆదిమ కాలపు కాంక్ష వెనుక చోదక శక్తిగా ఉన్నది భౌతికవాద దృక్పథమే తప్ప భావవాదం కాదు.

**యోగ దర్శనం ఎనిమిది యోగాంగాలను ప్రతిపాదించింది. అవి :**

(1) యమం (నియంత్రణ), (2) నియమం (క్రమశిక్షణ), (3) ఆసనం (శరీరాకృతులు), (4) ప్రాణాయామం (శ్వాస పై అదుపు), (5) ప్రత్యాహారం(జ్ఞానేంద్రియాలను ఉపయోగించకుండా ఉండడం) (6) ధారణ (దృష్టిని సారించడం) (7) ధ్యానం (మెడిటేషన్), (8) సమాధి, (తీవ్ర కేంద్రీకరణ)

"తర్వాత కాలాల్లో రకరకాల దృక్పథాలను ప్రతిపాదించిన తత్వవేత్తలందరూ తమ తమ దర్శనాల్లోకి యోగ సూత్రాలను జొప్పించడానికి ప్రయత్నించారు. అదే సమయంలో తాత్విక సత్యాన్ని సక్రమంగా, సంపూర్ణంగా గ్రహించడానికి శారీరకంగా, మానసికంగా సన్నద్ధం అవాలంటే అందుకు యోగాచారాలు ఒక మార్గం గా పరిగణించారు. ఐతే యోగ సాధనలో ప్రతీ వ్యక్తికీ తనదైన వ్యక్తిగత అనుభవం మాత్రమే లభిస్తుంది. అది స్వీయమానసికమైనది. అందుచేత ఏదైనా తాత్విక దృక్పథపు ఋజుత్వాన్ని తేల్చడానికి అది పనికిరాదు." (దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ)

## ఈ. న్యాయ, వైశేషికాలు

తొలి దశల నుండే న్యాయ, వైశేషిక దర్శనాలుఒకదానితో ఒకటి సన్నిహితంగా సంబంధం కలిగివున్నాయి. కాలక్రమంలో ఆ రెండూ కలగలిసిపోయాయి. అందుచేత ఈ రెండింటినీ కలిపి ఉమ్మడిగా న్యాయ-వైశేషిక దర్శనాలుగా వ్యవహరిస్తాం.

క్రీ.పూ. 3 వ శతాబ్దానికి చెందిన గౌతముడు న్యాయ దర్శనానికి ఆద్యుడు. దాదాపు అదే కాలానికి చెందిన కణాదుడు వైశేషిక దర్శనానికి ఆద్యుడు. క్రీ.శ. 5 వ శతాబ్దం నుండి ఈ రెండు దర్శనాలమీద వ్యాఖ్యానాలు లభ్యమౌతున్నాయి. న్యాయ దర్శనాన్ని గొప్పగా పెంపొందించినవాడు ఉదయనుడు. ఆ తర్వాత క్రీ.శ. 12వ శతాబ్దం నుండి న్యాయ దర్శనం నూతన దశకు చేరింది. దీనినే నవ్యన్యాయం అంటారు. దీనిని పెంపొందించినవాడు ప్రసిద్ధిచెందిన పండితుడు గదాధరుడు.

న్యాయావైశేషికాలు నిజమైన జ్ఞానానికి ప్రమాణాలు ఏమిటన్న విషయం మీద భావవాదం అవలంబించిన వైఖరిని గట్టిగా ఎదుర్కొన్నాయి. భావవాదులు జ్ఞానం అనేది సమగ్రమైనదని, దానిని కేవలం ధ్యానం ద్వారా మాత్రమే గ్రహించగలుగుతామని చెప్తుంది. నిజజీవితపు అనుభవాల ద్వారా కలిగే జ్ఞానాన్ని భావవాదం గుర్తించడానికి నిరాకరిస్తుంది. ఈ వైఖరిని న్యాయావైశేషికాలు సవాలు చేశాయి.

వాస్తవ జ్ఞానాన్ని గ్రహించేందుకు ఒక బలమైన పునాదిని న్యాయ సూత్రాలు రూపొందించాయి. దీనినే డా. రాధాకృష్ణన్ ప్రమాణ శాస్త్రం అని అన్నారు. దాని ప్రకారం జ్ఞానాన్ని నిర్ధారించడానికి నాలుగు మౌలిక అంశాలు ఉండాలి. అవి 1. ప్రమాత్ర (గుర్తించగలవారు, లేదా గుర్తించే ప్రాతిపదిక) 2. ప్రమేయ (దేని గురించిన జ్ఞానాన్ని గ్రహించాలి) 3. ప్రమితి (గ్రహించిన అనంతర స్థితి) 4. ప్రమాణ (జ్ఞానాన్ని గ్రహించే పద్ధతులు) ఎవరు తెలుసుకోవాలి? దేనిని తెలుసుకోవాలి? ఎటువంటి సమాచారం లేదా ఆధారాలు కావాలి?,గ్రహించినది వాస్తవమో కాదో నిర్ధారించడం ఎలా? అన్నవి ఈ నాలుగు అంశాలు.

ఈ నాలుగింట్లో ప్రమాణం అన్నది అత్యంత ముఖ్యమైనది. న్యాయ సూత్రాలు నాలుగు ప్రమాణాలను నిర్దేశించాయి. అవి: 1. ప్రత్యక్ష (జ్ఞానేంద్రియాల ద్వారా తెలుసుకోగలిగేది) 2. అనుమాన (నిర్ధారించగలిగేది) 3. ఉపమాన (అదే విధమైన ఇతర అనుభవాలను బట్టి నిర్ణయానికి రావడం) 4. శబ్ద (నిపుణుల అభిప్రాయాలు).

ఈ నాలుగింట్లో, ప్రత్యక్ష ప్రమాణం అనేది మన జ్ఞానేంద్రియాల ద్వారా గ్రహించగలిగే జ్ఞానం. అనుమాన ప్రమాణం అనేది మనం చూపిన వివిధ అంశాల నడుమ అంతఃసంబంధాన్ని నిర్ధారించడం. ఉదాహరణకు: నిప్పు నుండి పొగ వస్తుందని మన అందరికీ తెలుసు. దూరాన్నుంచి మనకు నిప్పు కనపడకపోవచ్చు కాని పొగ కనిపిస్తుంది. దానిని బట్టి అక్కడ నిప్పు ఉంది అన్న నిర్ధారణకు రాగలుగుతాము. ఇది అనుమాన ప్రమాణం. ఇక ఉపమాన ప్రమాణం అనేది ఒకే విధంగా ఉన్న వేరు వేరు పదార్థాల గురించి గాని, ఒకే విధంగా జరిగిన వేరు వేరు సంఘటనల గురించిగాని వాటి నడుమ ఉన్న పోలికల ఆధారంగా నిర్ధారణకు రావడం. ఉదాహరణకు భూమి గుండ్రంగా ఉన్నది అని చెప్పడానికి మనం ఒక బంతిని గాని ఒక నారింజపండును గాని ఉదాహరణగా చూపుతాం. నేర పరిశోధనలో భాగంగా పోలీసులు ఆ నేరం ఏ విధంగా జరిగివుండవచ్చు అన్న దృశ్యాన్ని తిరిగి నటించి చూపుతారు. దానిని బట్టి ఆవిధంగా నేరం జరగడం సాధ్యమా కాదా అన్నది నిర్ధారించడానికి వీలౌతుంది. నాలుగవది శబ్ద ప్రమాణం. కొన్ని విషయాల లోతులను స్వల్ప కాలంలో గ్రహించడం సాధ్యపడనప్పుడు ఆ విషయాల్లో నిపుణులైనవారి అభిప్రాయాలను తెలుసుకుంటాం. మనకు తెలియని ఒక వైరస్ వ్యాపించడం మొదలుపెడితే అప్పుడు ఆ రంగానికి చెందిన శాస్త్రవేత్తల అభిప్రాయాలను తెలుసుకుని దానిని బట్టి వ్యవహరిస్తాం. ఇది శబ్ద ప్రమాణం.

కేవలం ప్రతిపాదన, లేదా ఊహను బట్టి నిర్ధారణకు రావడాన్ని న్యాయ సూత్రాలు అంగీకరించవు. ఆ ప్రతిపాదన నాలుగు ప్రమాణాల పరీక్షలో నిగ్గు తేలాలి. కేవలం ఊహలను బట్టి గాని, ధ్యానం ద్వారా కాని జ్ఞానం కలగుతుందనే భావవాద దృక్పథాన్ని న్యాయ సూత్రాలు బలంగా తిరస్కరించాయి. ఆచరణే జ్ఞానానికి ప్రమాణం అన్న భౌతికవాద దృక్పథాన్ని బలంగా సమర్థించాయి.

ఈ నాలుగు ప్రమాణాలకు తోడు న్యాయ సూత్రాలు మరికొన్ని ప్రమాణాలను కూడా ప్రతిపాదించాయి. వాటిలో ఒకటి 'అభావం', లేదా పరస్పర విరుద్ధ అంశాలను పోల్చి తెలుసుకోవడం. మరణించిన మనిషికి, జీవించివున్న మనిషికి తేడాను తెలుసుకోడానికి గుండె కొట్టుకుంటున్నదీ లేనిదీ చూస్తారు. జీవించివున్న వ్యక్తి గుండె మాత్రమే కొట్టుకుంటుంది. తాజాగా వండిన ఆహారానికి, కొంత కాలం

క్రితం వండిన ఆహారానికి తేడా తెలుసుకోడానికి దాని వాసన చూస్తాం. వాటి వాసనలలో తేడా ఉంటుంది కనుక తెలుసుకోగలుగుతాం.

**న్యాయ సూత్రాలు కొన్ని తప్పుడు వాదనలను, లేదా కుతర్కాలను పేర్కొన్నాయి. వాటిని తిరస్కరించాలని చెప్పాయి. అవి:**

(1) జల్పం: సత్యాన్ని తెలుసుకునే లక్ష్యంతో కాకుండా చర్చను పక్కదోవ పట్టించే లక్ష్యంతో చేసే వాదనను జల్పం అంటారు. ఇది మనల్ని వాస్తవ జ్ఞానానికి దూరం చేస్తుంది.

(2) వితండ వాదన: అవతలివైపు వాదనలను ఖండించడమే పనిగా పెట్టుకుని, తన వైపునుంచి ఏ ప్రతిపాదనలనూ చేయకపోవడం వితండవాదం. ఇది చర్చను నిరవధికంగా కొనసాగించడానికి తోడ్పడుతుందే తప్ప సత్యాన్ని తెలుసుకోడానికి కాదు. ఇది అనవసరమైన గందరగోళానికి మాత్రమే దారి తీస్తుంది.

(3) చల: మాటలను వక్రీకరించి తప్పుడు అర్థం వచ్చేలా చేయడం. ఉదాహరకు ఒకానొక వ్యక్తి 'నేను మంచి ఊపుమీద ఉన్నాను' అంటే అతడు బాగా మద్యం సేవించివున్నాడని అర్థం తీయడం ఈ విధమైన వక్రీకరణ కిందకు వస్తుంది.

(4) జతి: ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వకుండా దాటవేయడం. ఈ పద్ధతులను అనుమతించరాదని న్యాయ సూత్రాలు తెలిపాయి. మనం నేటి న్యాయ వ్యవస్థను గమనిస్తే పైన తెలిపిన మౌలిక సూత్రాలను నేటికీ పాటిస్తున్నట్టు స్పష్టం ఔతుంది.

వైశేషికం ముందుకు తెచ్చిన దృక్పథాన్ని అణుసిద్ధాంతం అంటారు. దీనిని ప్రతిపాదించినవాడు కణాదుడు. కణం అంటే చాలా చిన్న భాగం అని అర్థం. కణాదుడి సిద్ధాంతం ఈ విధంగా ఉంది: ఈ ప్రపంచం నాలుగు మూల పదార్థాలతో ఏర్పడింది. అవి భూమి, గాలి, నీరు, నిప్పు. ఈ నాలుగు మూల పదార్థాలూ అణువులనే మూలకాలు వివిధ తరహాల్లో సమ్మేళనం చెందినందువలన ఏర్పడ్డాయి. అణువులు ఎన్ని తరహాలలో సమ్మేళనం చెందుతాయో అన్ని రకాల పదార్థాలు ఏర్పడతాయి. వాటిని రకరకాల లక్షణాలు కలుగుతాయి. అణువులు నాశనం చేయలేనివి. అవి అనంతంగా ఉనికిలో

ఉన్నాయి. అణువులలో  మన కంటికి కనిపించే అతి చిన్నది త్ర్యణుక. ఇందులో మూడు ద్వ్యణుకలు ఉంటాయి. ఒక్కో ద్వ్యణుకను తిరిగి రెండు అణువులుగా విభజించవచ్చు. ద్వ్యణుకను గాని అణువును గాని మన కంటితో మామూలుగా చూడడం సాధ్యం కాదు.

వైశేషిక దర్శనం ప్రధానంగా భౌతికవాదమే. ఐతే ఆనాటి కాలానికి అందుబాటులో ఉన్న శాస్త్ర పరిజ్ఞానం తక్కువ అయినందువలన వైశేషికానికి చాలా పరిమితులు ఉన్నాయి. పదార్థం నిరంతరం చలనంలో ఉంటుంది అని వైశేషికం గుర్తించదు. అదే విధంగా పరిణామం దిగువ స్థాయి నుండి ఆ పై స్థాయి వైపు జరుగుతూవుంటుందని కూడా గుర్తించదు. అభివృద్ధి క్రమంలో పరస్పర విరుద్ధ దిశల్లో ఉండే రెండు ధోరణులు ఉంటాయని కూడా గుర్తించదు. నిర్జీవం నుండి జీవం, ఏక కణజీవులనుండి బహుకణ జీవులు –ఇలా పరిణామక్రమంలో ఏర్పడతాయన్నది కూడా వైశేషికం గ్రహించదు. అందుచేత అణువులు ఏ కారణం వలన సమ్మేళనం చెందుతాయి అన్న ప్రశ్నకు వైశేషికం సమాధానం చెప్పలేకపోయింది. ఇక్కడే అది భావవాదానికి లొంగి, పరబ్రహ్మ అన్న కారణం వల్లే అణువులు సమ్మేళనం చెందుతాయని అంగీకరించింది. ఆత్మ అనేది వేరే స్వతంత్రంగా ఉండగలుగుతుందని, పునర్జన్మ ఉంటుందని కూడా అది అంగీకరించింది.

## ఉ. వేదాంత దర్శనం

వేదాంతం అంటే వేదాలకు చివర్న ఉన్నది అని అర్థం. వేదాలనుండి వచ్చినవి ఉపనిషత్తులు. వైదిక సాహిత్యంలో ఆఖరు భాగాలు ఇవే. వేదాంతం అంటే ఉపనిషత్తులలోని తాత్విక దృక్పథం. ఉపనిషత్తులు  ఒక సమగ్రమైన రీతిలో తాత్విక దృక్పథాన్ని ప్రతిపాదించినవి కావు. వాటిలో వెలువడిన అభిప్రాయాలు ఒక సంపూర్ణ రూపంలో తాత్విక దృక్పథాన్ని వెల్లడించవు. వాటన్నింటిలోని తాత్విక భావాలను ఒకదగ్గర చేర్చి వాటికొక సమగ్ర రూపాన్ని ఇవ్వడానికి జరిగిన ప్రయత్నం నుంచి వచ్చినవే వేదాంత సూత్రాలు. వీటినే బ్రహ్మసూత్రాలు అని కూడా అంటారు. అంతిమ సత్యం పరబ్రహ్మ అని ఉపనిషత్తులు అంటాయి.  అందుకని వీటిని బ్రహ్మసూత్రాలు అని అంటారు. క్రీ.శ.2 నుండి 5వ శతాబ్దాల మధ్య కాలంలో జీవించిన బాదరాయణుడు ఈ బ్రహ్మసూత్రాల రూపకర్త. ఆ తర్వాత కాలంలో వేదాంతులందరూ తమ దర్శనానికి ప్రాతిపదికగా ఈ బ్రహ్మసూత్రాలను అంగీకరించారు. ఐతే ఈ సూత్రాలు ఎంత పొడి

పొడిగా, క్లుప్తంగా ఉంటాయంటే వాటినుండి స్పష్టమైన తాత్విక దృక్పథాన్ని నిర్ధారించడం వీలు పడుదు. అందువలన వాటికి వ్యాఖ్యానాలు అవసరం అయ్యాయి. ఈ వ్యాఖ్యానాలు అనేకం ఉన్నాయి. వీటి మధ్య తేడాలు కూడా చాలా ఉన్నాయి. ఈ వ్యాఖ్యానాలు సైతం చాల శక్తివంతమైన రీతిలో తాత్విక దృక్పధాన్ని వెల్లడించాయి.

అద్వైత దర్శనం లేదా మాయావాదం అనేది శంకరుడు ప్రతిపాదించిన అట్టి తాత్విక దృక్పథం. శంకరుని కాలం నాటికి శైవులు శివుడే పరబ్రహ్మ అని, వైష్ణవులు విష్ణువే పరబ్రహ్మ అని పరిగణించేవారు. తమ తమ శాఖలకు అనుకూలంగా ఉండేలా బ్రహ్మసూత్రాలను వారు వ్యాఖ్యానించడం కొనసాగించారు. అలాంటి వారిలో విశిష్టాద్వైతాన్ని ప్రతిపాదించిన వైష్ణవ తత్వవేత్త రామానుజుడు. రామానుజుడి అనుచరులలో ఒకరు దానిని మరికొంత మార్చి ద్వైతాద్వైత వాదం అని ప్రతిపాదించారు. మాధవుడు అనే మరొక అనుయాయి ద్వైతవాదాన్ని ప్రతిపాదించాడు. వల్లభుడు శుద్ధ అద్వైత వాదాన్ని ప్రతిపాదించాడు. చైతన్యుడు అనే మరొక వైష్ణవ తత్వవేత్త అచింత్య భేదాభేదం అనే వాదాన్ని ప్రతిపాదించాడు.

ప్రముఖులైన వేదాంత తత్వ వేత్తల భావాలగురించి, వారి వారి చారిత్రిక నేపధ్యాల గురించి మనకు కొంత స్థూల అవగాహన అవసరం. వీరు ప్రవచించిన తాత్విక భావాలు నేటికీ ప్రజాబాహుళ్యంలో ప్రచారంలో ఉన్నాయి.

**నిర్ధారణ :** ఆస్తి దర్శనాలు ఆరిలంట్లోనూ ఒక్క వేదాంతం తప్ప తక్కినవన్నీ బలమైన భౌతికవాద దృక్పధాన్ని తమలో ఇముడ్చుకున్నాయి. వాటికి తగిన శాస్త్ర పరిజ్ఞాన ఆధారాలు ఆనాటికి లేకపోవడం వల్లగాని, లేదా పాలకవర్గాల యెడల అనుసరించిన రాజీ వైఖరి వలన కాని ,వైదిక పురోహితుల దాడులను తట్టుకోడానికి కాని ఈ దర్శనాలు వైద ప్రమాణాన్ని ఆమోదించాయి. ఐనప్పటికీ ఈ దర్శనాల్లో ప్రతిపాదించిన అనేక వాదనలు నేడు మన రోజువారీ తాత్విక పోరాటంలో చాలా ఉ పయోగకరంగా ఉంటాయి. వాటిని ఉపయోగించడం ద్వారా మన తాత్విక భావజాలానికి ఒక 'భారతీయ' లక్షణాన్ని ప్రదర్శించగలం. అనాది గా ఈ గడ్డ మీద మన భావాలు కొనసాగుతున్నాయని చెప్పగలం. తద్వారా హిందూత్వ దాడిని బలంగా తిప్పికొట్టగలం.

## 7. భారతీయ భావవాదం

ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ధర్మసూత్రాలు, పురాణాలు, భగవద్గీత – ఇవే కాకుండా అసంఖ్యాకంగా జరిగిన రచనలు, సాహిత్యం ఈ దేశంలో

వర్గ పాలనను సమర్థించడానికి, భావవాదాన్ని వ్యాప్తి చేయడానికి ఉపయోగించ బడుతున్నాయి.

## (అ) ఉపనిషత్తులు

ప్రకృతి శక్తుల సవాళ్ళను ఎదుర్కోవలసిరావడం, అనివార్యంగా సంభవించే పుట్టుక, రోగాలు, మరణం వంటి సంఘటనలు అనుభవించడం వంటి దైనందిన జీవితపు సవాళ్ళను ఎదుర్కొనే క్రమంలో మానవులలో తలెత్తిన మౌలిక తాత్విక జిజ్ఞాస ప్రాథమిక రూపంలో వేదాలలో ప్రతిఫలించింది. ఆనాటి ఆదిమ సమాజం స్థానే కుల వ్యవస్థ ప్రాతిపదికన ఏర్పడిన వర్గ సమాజం ముందుకు రావడంతో బ్రాహ్మణుల ఆధిపత్యాన్ని సుస్థిరపరచడం మీద తాత్విక చర్చ ప్రధానంగా కేంద్రీకరించబడింది. తరచూ వైదిక కర్మకాండలను నిర్వహించడం ద్వారా, అందులో ప్రధానంగా యజ్ఞాలను నిర్వహించడం ద్వారా బ్రాహ్మణాధిపత్యాన్ని నెలకొల్పడం జరిగింది.

ఎడతెగకుండా మంత్రాలను వల్లించడం, నడుం విరిగేంతవరకూ కర్మకాండల తంతులను పాటించడం తాత్విక జిజ్ఞాస కలిగివున్నవారికి నిరర్ధకంగా, విసుగు కలిగించేలా అనిపించింది. తాత్విక భావనల్లో మౌలికంగా తలెత్తే ప్రశ్నలకు సమాధానాలు వారు కోరుకోసాగారు. జీవం అంటే ఏమిటి? ఈ విశ్వం ఎక్కడినుంచి ఉనికిలోకి వచ్చింది? మన చుట్టూ జరుగుతున్న పరిణామాల వెనుక నడిపించే శక్తి ఏమిటి? వంటి ప్రశ్నలు వారిని వెంటాడాయి.

ఆ జిజ్ఞాసువుల ఆకాంక్షలు ఉపనిషత్తుల్లో ప్రతిఫలించాయి. చాలా భారీ జన సమూహం నడుమ తాత్విక ఉపదేశాలను ఇవ్వడం సాధ్యమే. కాని తమను వేధించే ప్రశ్నలకు సమాధానాలు కోరుకునేవారు వ్యక్తిగత చర్చలను అభిలషిస్తారు. ఉపనిషత్ అన్న పదానికి అర్థం ఏమంటే రహస్యంగా ఒకరితో ఇంకొకరు కూర్చుని పరమాత్మ అంటే ఏమిటి? ఆత్మ అంటే ఏమిటి? ఈ రెంటికీ మధ్య సంబంధం ఏమిటి? పునర్జన్మ ఉందా? వంటి ప్రశ్నల గురించి వివరంగా చర్చించుకోవడం.

ఈ ఉపనిషత్తులు చాలా పెద్ద సంఖ్యలోనే ఉండివుండాలి. కాని వాటిలో కొన్నింటిలో మాత్రమే చెప్పుకోదగ్గ సారాంశం ఉంది. అటువంటి ఉపనిషత్తులు మాత్రం లిఖిత రూపం తీసుకున్నాయి. 108 ఉపనిషత్తులు ఉన్నట్టు జాబితా ఉంది. ఆధునిక పండితులు మాత్రం వాటిలో ఉన్న విషయం ప్రాధాన్యతను బట్టి 13 ఉపనిషత్తులను

మాత్రం ముఖ్యమైనవిగా గుర్తించారు. వేదాల్లో లేవనెత్తబడిన తాత్విక ప్రశ్నలను ఉపనిషత్తుల్లో చర్చించారు గనుక వాటిని వేదాంతం అని అనడం సహేతుకమే ఔతుంది. ఋగ్వేదానికి కొనసాగింపుగా ఐతరేయ, కౌశీతకీ ఉపనిషత్తులు వచ్చాయి. అదే మాదిరిగా సామవేదానికి కొనసాగింపుగా ఛాందోగ్య, తేన ఉపనిషత్తులు, యజుర్వేదానికి కొనసాగింపుగా బృహదారణ్యక, ఈశ, తైత్తీరియ, కథ, మైత్రి, శ్వేతాశ్వేతర ఉపనిషత్తులు, అథర్వ వేదానికి కొనసాగింపుగా ప్రశ్న, ముండక, మాండూక్య ఉపనిషత్తులు వచ్చాయి. ఈ ఉపనిషత్తులు రూపొందిన కాలం క్రీ.పూ.1000 నుంచి 300 సంవత్సరాల మధ్య అయివుండాలని చరిత్రకారులు భావిస్తున్నారు. ఈ ఉపనిషత్తులకు ఒకానొక జంతువు పేరు గాని, పక్షి పేరుగాని, వారికి నచ్చిన దైవం పేరుగాని పెట్టుకున్నారు. ఆ తర్వాత కాలంలో చరిత్ర పరిశోధకులు ఈ ఉపనిషత్తులను రచించిన వారిలో కొందరి పేర్లను వెతికి పట్టుకున్నారు. ఐతరేయ మహీదాసుడు, రైక్యుడు, శాండిల్యుడు, సత్యకామ జాబాలి, ఉద్దాలకుడు, శ్వేతకేతు, భరద్వాజుడు, అజాతశత్రువు, యాజ్ఞవల్క్యుడు, గార్గి, మైత్రేయి వంటి ఉపనిషత్తు రచయితల, రచయిత్రుల పేర్లు కనుగొన్నారు. గార్గి, మైత్రేయి వంటి స్త్రీ ల పేర్లు ఈ జాబితాలో ఉండడం గమనార్హం. సత్యకామ జాబాలి, ఉద్దాలకుడు లోకాయతుల వాదనలను బలంగా సమర్థించారన్నది కూడా గమనించాలి.

ఉపనిషత్తుల్లోని విషయం ప్రధానంగా ఇద్దరు వ్యక్తుల నడుమ జరిగిన సంభాషణ రూపంలో, ఎక్కువగా ప్రశ్నలు, సమాధానాల రూపంలో ఉంటుంది. ఉపనిషత్తుల్లో ఉండే తాత్విక భావనల స్థాయి చాలా ఉన్నతమైనదన్నట్టు, ఆధునిక పండితులకు సైతం అందనంత సంపద్వంతమైన జ్ఞానం వాటిలో ఉన్నట్టు ఇటీవల పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారు. కాని అది పూర్తిగా అవాస్తవం. ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపనిషత్తులగురించి ఏం చెప్పారో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం: “అంతిమ తాత్విక సత్యాన్ని తెలుసుకోవడం కన్నా ఆందోళన చెందే మానవుల ఆత్మలకు శాంతిని, స్వేచ్ఛను కల్పించడం ఉపనిషత్తుల ప్రధాన లక్ష్యం. అధిభౌతికవాద సమస్యలకు ఉపనిషత్తులు సూచించే పరిష్కారాలు ప్రతిపాదనలుగానే (అది అయివుండవచ్చు, అలా జరిగివుండవచ్చు వంటివి) ఉంటాయి. అవి సంభాషణల రూపంలో, వాదోపవాదాల రూపంలో వ్యక్తం అయాయి.

జీవిత వాస్తవాలను చవి చూసిన మానవులలో కలిగిన తాత్విక స్పందనల, అభిప్రాయాల వ్యక్తీకరణ ఉపనిషత్తులలో ప్రధాన విషయంగా ఉంది. వాస్తవికత యొక్క అసలైన స్వభావం ఏమిటో తెలుసుకోవాలన్న మానవుల జిజ్ఞాస, వారిలో చెలరేగే భావ సంఘర్షణ ఉపనిషత్తులలో కనిపిస్తుంది. ఒక క్రమపద్ధతిలో ఉండే తాత్విక సిద్ధాంతంగా ఏదీ ఉపనిషత్తులలో లేదు. వాటిని రచించినది ఒక వ్యక్తి కాదు. అవి ఒక కాలంలో రూపొందినవి కావు. వాటిలో ఒకదానికొకటి పొసగని అనేక అంశాలు ఉన్నాయి. అశాస్త్రీయమైన భావాలు చాలా ఉన్నాయి. ఐతే ఉపనిషత్తుల్లో ఉన్నదింతే అని మనం గనుక అనుకుంటే వాటిని అధ్యయనం చేయడంలో అర్థం లేదు. ఉపనిషత్తులు కొన్ని మౌలిక తాత్విక భావనలను చాలా బలంగా, సంతృప్తికరమైన రీతిలో ప్రతిపాదించాయి. ఆ క్రమంలో అమాయకంగా ఆ రచయితలు ప్రతిపాదించిన కొన్ని పొరపాటు భావాలు కూడా చోటు చేసుకున్నాయి. వాటినే వాడుకుని ఆ తర్వాత కాలంలో వాటికి చాలా అతిశయోక్తులను జోడించి తప్పుడు తాత్విక సిద్ధాంతాలను రూపొందించారు.”

ఉపనిషత్తులలో వ్యక్తం అయిన భావాలు చాలా సరళంగా , చిన్న పిల్లల్లో తలెత్తే భావాల మాదిరిగా ఉన్నాయని దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ వ్యాఖ్యానించారు. దీనిని బట్టి మనకు తెలుస్తున్నదేమంటే ఉపనిషత్తులు అత్యున్నత ప్రమాణాలు కల తాత్విక గ్రంధాలు ఏమాత్రమూ కావు. వాటిలో ప్రాథమిక స్థాయిలో తాత్విక చర్చలు ఉన్నాయి. ఆత్మ. పరమాత్మ. పరబ్రహ్మ వంటి భావనల చర్చ వాటిలో ఉంది. ఆ భావనలను సవాలు చేసే వాదనలు కూడా ఉపనిషత్తుల్లో ఉన్నాయి.

ఒక విషయం మాత్రం స్పష్టం. కొద్దిమంది వ్యక్తులైనా తాత్విక చర్చలలో మునిగి తేల్తూ తమ రోజువారీ జీవితావసరాల గురించి పట్టించుకోకుండా ఉండగలిగారంటే ఆ నాటికి సమాజంలో ఆ మేరకు మిగులు ఉత్పత్తి జరిగిందన్నది నిర్ధారించవచ్చు. బృహదారణ్యకోపనిషత్ లోని ఒక గాథ ఈ విధంగా ఉంటుంది: “మహారాజు జనకుడి వద్ద అంతులేని సంపద ఉంది. తాత్విక చర్చల్లో తాను తెలుసుకున్న భావవాద దృక్పథం పట్ల అతడు చాలా ఉత్తేజితుడయ్యాడు. దాంతో అతడు తత్వవేత్త యాజ్ఞవల్క్యుడికి దఫదఫాలుగా వేల గోవులను కానుకలుగా సమర్పించాడు. అటువంటి భౌతిక సంపదను కానుకగా స్వీకరించడానికి భావవాద తత్వవేత్త అయిన యాజ్ఞవల్క్యుడు కూడా ఎటువంటి అభ్యంతరమూ వ్యక్తం చేయలేదు.” (దేవీ ప్రసాద్)

ఉపనిషత్తులలోని భావవాద భావనలు ఆనాటి పాలకవర్గాలకు ఉపయోగకరంగా ఉండివుండొచ్చు. కాని వాటిలో వ్యక్తం అయిన "మాయ", "భ్రాంతి", "ఆత్మ", "పరమాత్మ" వంటి భావనలు అంతే లోతుగా సామాన్య ప్రజానీకానికి కూడా చేరివుంటే దాని ఫలితంగా వారంతా సామాజిక జీవితంలోని వాస్తవిక, కీలక కార్యకలాపాలకు , అంటే, ఉత్పత్తి, పంపిణీ లకు దూరమైపోయివుండేవారు. అది ఉత్పత్తి శక్తుల పురోగమనానికి ఆటంకంగా మారివుండేది.

అందుచేత సామాన్య జనం తమ తమ పనులకు దూరం కాకుండా కొనసాగుతూనే, వారిమీద పాలకవర్గాలు ఆధిపత్యం చెలాయించడానికి కావలసిన తాత్విక భావాలను వ్యాప్తి చేయడానికి అదనపు రూపాలు అవసరం అయాయి.

## (ఆ) బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు, ధర్మసూత్రాలు

ఒకానొక నిర్దిష్ట లక్ష్యంతో మాత్రమే యజ్ఞాన్ని ఎప్పుడైనా నిర్వహిస్తారు. యాజి (యజ్ఞాన్ని నిర్వహించేవాడు) తన కోర్కెను నెరవేర్చుకోడానికి యజ్ఞాన్ని తలపెడతాడు. ఈ భావన నిస్సందేహంగా అశాస్త్రీయం. కాని ఈ తంతు వెనక తమ కోర్కెలను నెరవేర్చుకోడానికి ప్రకృతిశక్తులమీద పట్టు సాధించాలనే ఆదిమకాలపు సహజప్రవృత్తి కనిపిస్తుంది. దీనిని "ఆదిమ భౌతికవాదం" అని దేవీప్రసాద్ చట్టోపాధ్యయ అభివర్ణించాడు.

దశరథ మహారాజు తనకు సంతు లేనందున పిల్లలు కలగాలన్న కోరికతో పుత్రకామేష్టి యాగాన్ని నిర్వహించాడని పురాణాల్లో ఉంది. చిన్న చిన్న రాజ్యాలమీద తన ఆధిపత్యం ఉండాలన్న కోరికతో ధర్మరాజు రాజసూయ యాగాన్ని నిర్వహించాడు. విస్తారమైన భూమండలం మీద ఆధిపత్యం కావాలన్న కోరికతో రాముడు అశ్వమేధయాగాన్ని నిర్వహించాడు. వారు చేసిన యాగాల వెనుక ఉన్న లక్ష్యాలేవీ ఆధ్యాత్మికమైనవి కావు. వాళ్ళు కేవలం భౌతికమైన ప్రయోజనాలు పొందడం కోసమే యజ్ఞాలను నిర్వహించారు.

సాధారణ ప్రజానీకం మీద ఆధ్యాత్మికంగా తమ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి బ్రాహ్మణులు అనబడే పురోహితవర్గం ఈ యజ్ఞాల నిర్వహణ మీద తమ పూర్తి పెత్తనాన్ని నెరిపారు. వారి పెత్తనాన్ని ఎవరూ ప్రశ్నించకుండా ఉండడానికి వారికి ఒక ఆధారం అవసరం అయింది. తరతరాలుగా అందివస్తున్న వేదాలు వారికి అందుకు ఉ పయోగపడ్డాయి. అందుచేత పురోహితవర్గం తక్కిన పాలకవర్గాల సహకారంతో వేదాలకు పొడిగింపుగా కొన్నింటిని రూపొందించారు.

ప్రతీ వేదానికీ నాలుగు భాగాలు ఉంటాయి. మొదటిది ఆదినుండీ కొనసాగుతున్న మంత్రాలు. రెండవది: బ్రాహ్మణాలు, మూడవది: ఆరణ్యకాలు, నాలుగవది: ఉపనిషత్తులు, వీటన్నింటినీ కలిపి వేదాంగాలు అంటారు.

మనం ఇప్పటికే వేదాల గురించి, ఉపనిషత్తుల గురించి చర్చించాం.

**బ్రాహ్మణాలు :** యజ్ఞాలు, ఇతర వైదిక కర్మ కాండలు నిర్వహించేటప్పుడు పాటించవలసిన విధివిధానాల గురించి బ్రాహ్మణాలు తెలియజేస్తాయి. యజ్ఞవాటికను ( యజ్ఞం జరిగే ప్రాంతం) ఏ విధంగా నిర్మించాలి, అక్కడ ఎవరెవరికి ఏ యే స్థానాలను కేటాయించాలి, యజ్ఞగుండం (యజ్ఞంలో మండించే పవిత్ర అగ్ని గుండం) ఎలా ఉండాలి, బలి ఇచ్చే విధానం, బలి కోసం పశువును ఎంపిక చేసే విధానం, బలి ఇచ్చిన పశువు మాంసాన్ని ఏ విధంగా పంచుకోవాలి, ఏ సందర్భంలో ఏ యే మంత్రాలను ఎవరెవరు ఉచ్చరించాలి, యజ్ఞాన్ని నిర్వహించిన పురోహితుడికి ఏం చెల్లించాలి వంటి వివరాలన్నీ బ్రాహ్మణాల్లో ఉంటాయి.

**ఆరణ్యకాలు :** ఒక మహారాజు గాని, ఒక సంపన్నుడైన వ్యాపారి గాని తమ తమ ఉచ్చ స్థితిలో యజ్ఞాలను నిర్వహించగలిగే స్తోమత కలిగివుంటారు. కాని ముసలితనం వచ్చాక, తమ సంపదలను, అధికారాలను వారసులకు అప్పజెప్పిన తర్వాత వారు తమ కోర్కెలను ఏ విధంగా నెరవేర్చుకోగలరు? అడవులకు పోయి, అక్కడ ఒక చిన్న కుటీరాన్ని కట్టుకుని అక్కడ ప్రశాంతంగా దైవ ధ్యానంలో గడపడమే వారి ముందున్న మార్గం. తమ బాధ్యతలనుండి తప్పుకుని ఈ విధంగా విశ్రాంత జీవితాన్ని గడిపే క్రమం ఏ విధంగా ఉండాలో తెలిపేవే ఆరణ్యకాలు.

ఇక ఆ తర్వాత ధర్మసూత్రాలు వస్తాయి. సామాన్య ప్రజానీకం మధ్య భావవాదాన్ని ప్రచారం చేసినంతమాత్రాన పాలకవర్గాల లక్ష్యాలు నెరవేరవు. వారి మనస్సుల మీద ఆధిపత్యం సాధించగలిగితేనే ఎటువంటి తీవ్రమైన ప్రతిఘటనా లేకుండా వారిని లొంగదీసుకుని తమ వర్గ దోపిడీని నిరాటంకంగా కొనసాగించగలుగుతాయి. అందుకోసం ప్రతా ఒక్కరూ విధిగా పాటించవలసిన నియమావళి అవసరం పడింది. వేదాలు ఉపనిషత్తులు వగైరాలు ప్రధానంగా పాలకవర్గాల వరకే పరిమితం. కాని ఈ నియమావళి సమాజంలో అందరికీ వర్తించేదిగా ఉండాలి. అటువంటి నియమావళే ధర్మసూత్రాలు. ఈ ధర్మసూత్రాలు సమాజంలోని ప్రతీ అంశాన్నీ, పాలనా విధానంతో సహా, నిర్దేశిస్తాయి. ఒక విధంగా అవి ఆనాటి

రాజ్యాంగం అని చెప్పవచ్చు. ధర్మసూత్రాలను ఉల్లంఘిస్తే అది తీవ్ర నేరంగా పరిగణించబడుతుంది. అందుకు మరణ శిక్ష తో సహా పలు తీవ్ర దండనలు విధించబడతాయి. ఈ ధర్మ సూత్రాలను సమర్ధించుకోడానికి వాటిని వేదాలతో ముడిపెట్టారు.

ధర్మ సూత్రాలను స్మృతులు అని కూడా అంటారు. స్మృతి అంటే ఎవరూ ఎన్నటికీ మరిచిపోకూడనిది , విస్మరించరానిది, ఉల్లంఘించకూడనిది అన్న అర్ధం ఉంది. అటువంటి స్మృతులు మనకి యాజ్ఞవల్క్య స్మృతి, నారద స్మృతి, గౌతమ స్మృతి వంటివి ఉన్నాయి. వీటన్నింటిలోకీ ప్రముఖమైనది మాత్రం మనుస్మృతి. అదే మనువు పేర రూపొందిన చట్టం.

## మనుస్మృతి

మనుస్మృతికి హిందూత్వ ఫాసిస్టు శక్తులు చాలా విలువను, గౌరవాన్ని ఆపాదిస్తారు.. అది ఆదర్శ పాలనకు మార్గదర్శి అని పొగుడుతారు. మనుస్మృతి ఎప్పటినుంచో మనకి ఉన్నందువల్ల వేరే ఇంకొక రాజ్యాంగం ఏదీ అక్కరలేదని, వేరే రాజ్యాంగాన్ని దేనినీ తాము గుర్తించబోమని భారత రాజ్యాంగం పట్ల తమ వ్యతిరేకతను వారు ఎన్నడో బహిరంగంగా ప్రకటించారు. అంటే వాళ్ళు మనుస్మృతి లో ఉన్న భావజాలానికే కట్టుబడివున్నారన్నమాట. అందుచేత ఆ మనుస్మృతి ని గురించి తెలుసుకోవడం మనకు గతంలో ఎప్పటికన్నా ఇప్పుడు ఎక్కువ అవసరం.

వివస్వంత మనువు కుమారుడైన వైవస్వత మనువు ఈ మనుస్మృతిని రూపొందించినట్టు చెప్తారు. పురాణాల్లో మనకు చాలామంది మనువులు తారసపడతారు. మనుస్మృతిలో వాడిన భాషను బట్టి, అందులో ప్రస్తావించిన వివిధ సమాజపుటలవాట్లను బట్టి దీనిని క్రీ.పూ.5వ శతాబ్దం లో రూపొందించివుండాలని చరిత్రకారులు నిర్ధారించారు.

డా. రాధాకృష్ణన్ అభిప్రాయం ప్రకారం మనుస్మృతిలో చట్టానికి, మతానికి సన్నిహిత సంబంధం కనిపిస్తుంది. ప్రజల మత విశ్వాసం ప్రాతిపదికన  మనుస్మృతి రూపొందినందువలన  దానిని ఎవరూ సవాలు చేయలేరు. ఆ విధంగా అది పాలకవర్గాల చేతుల్లో ఒక సాధనంగా ఉపయోగపడింది. పాలకవర్గాల అణచివేతను ఎవరూ ప్రశ్నిచడానికి అవకాశం ఇవ్వని విధంగా తోడ్పడింది.

మనుస్మృతి రూపొందేనాటికి సమాజం సంచార జీవితం ,పశుపోషణ ప్రధానంగా ఉన్న జీవితం నుండి వ్యవసాయిక సమాజానికి స్పష్టమైన ఒక మలుపు

తీసుకుంది. తెగలు కొన్ని కలిసి చిన్న చిన్న తెగల రాజ్యాలను ఏర్పరచడం మొదలైంది. కొన్ని తెగల రాజ్యాలను అంతకన్నా బలమైన తెగల రాజ్యాలు ఓడించడం కూడా మొదలైంది. వ్యక్తిగత ఆస్థి ఏర్పడింది. కులం ప్రాతిపదికన సమాజంలో విభజన జరుగుతోంది. బ్రాహ్మణ, క్షత్రియ కులాల వారు తక్కిన కులాల ప్రజలమీద, ముఖ్యంగా ఉత్పత్తి కులాల మీద, తమ ఆధిపత్యాన్ని నెలకొల్పడంలో నిమగ్నమయ్యారు. వారి ప్రయత్నాన్ని సమర్థించడానికి వీలుగా మనుస్మృతి రూపొందింది. పురోహితవర్గం దానిని వెంటనే మత సమ్మతమైనదిగా ప్రకటించింది. వర్గ దోపిడీని కొనసాగించడమే ప్రధాన లక్ష్యంగా కుల వ్యవస్థ పరిణామం చెందింది. దానిని పవిత్ర గ్రంథాల పేరుతో, దైవం పేరుతో సమర్థించుకున్నారు. అ విధంగా భావవాద తాత్వికతను తరతరాలుగా ప్రజానీకానికి ఎక్కించడంలో కులవ్యవస్థ అనేది ఒక ప్రధాన సాధనంగా పని చేసింది.

మహా భారతం శాంతి పర్వం లో మనువు గురించిన ప్రస్తావన ఈ విధంగా ఉంది: మహావిష్ణువు ఒక రాజును సృష్టించాడు అతడికి మానవాతీత శక్తులను ప్రసాదించాడు. ఆ తర్వాత దేవతలు, ఋషులు ఉమ్మడిగా ఆ రాజు చేత ఎల్లప్పుడూ ధర్మానికి కట్టుబడి వ్యవహరించేట్టు ప్రమాణం చేయించారు. ఆ ధర్మం ఏమి చెప్తోంది? కుల వ్యవస్థ కట్టుబాట్లను ఎన్నటికీ అతిక్రమించకూడదని చెప్తోంది. ఆ రాజు కూడా తనకు ఏ బ్రాహ్మణుడినీ శిక్షించే హక్కు లేదని అంగీకరించాడు.

రాజు ఎంత చేతకానివాడైనా, ఎంత అసమర్థుడైనా ప్రజలు అతడి పరిపాలనకు బద్ధులైవుండాలని, అంకిత భావంతో మెలగాలని, ఒక భర్త ఎంత చేతకానివాడైనప్పటికీ భార్య అతడికి ఏ విధంగా సేవ చేస్తుందో రాజు పట్ల ప్రజలు అదే విధంగా నడుచుకోవాలని నారద స్మృతి చెప్తోంది.

రాజుకు దైవాంశ ఉన్నట్టు చిత్రించడం వెనుక ఒక ప్రయోజనం ఉంది. ప్రజలను శాసించడానికి కావలసిన మతపరమైన అనుమతిని అది ఇస్తుంది. అంతేకాక ప్రజలను శాసించే అధికారాన్ని కూడా ఇస్తుంది. ఒకవేళ రాజు గనుక బ్రాహ్మణులకు, క్షత్రియులకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లైతే అప్పుడు అతడి దైవాంశ అతడిని రక్షించడానికి ఎందుకూ తోడ్పడదు. బ్రాహ్మణుల, క్షత్రియుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించిన రాజును వెంటనే తొలగించాలని స్మృతులు ఆదేశిస్తున్నాయి. వేనుడు అనే రాజు గాథ ఇందుకు ఉదాహరణ. వేనుడు, అతడి భార్య సునీత వైశ్యుల, శూద్రుల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించి బ్రాహ్మణుల, క్షత్రియుల ఆధిపత్యాన్ని సవాలు చేశారు. అప్పుడు బ్రాహ్మణులు ,క్షత్రియులు కూడబలుక్కుని

వేనుడిని వధించారు. పురాణాల్లో ఇటువంటిదే మరొక గాథ, నహుషుడిది ఉది. నహుషుడు బ్రాహ్మణుల అధికారాన్ని సవాలు చేసిన ఫలితంగా ఆ బ్రాహ్మణుల శాపాలకు గురౌతాడు. అప్పుడు అతడు తన రాజ్యాధికారాన్ని కోల్పోవడమే కాకుండా తన మానవరూపాన్ని సైతం కోల్పోయి కొండచిలువగా మారిపోతాడు.

కనుక రాజు అధికారాన్ని కలిగివుండడం అంటే అది బ్రాహ్మణుల, క్షత్రియుల ప్రయోజనాలను కాపాడేందుకు, తక్కిన కులాలవారిని అణచిపెట్టివుంచేందుకు మాత్రమే. మనువు హేతుబద్ధ ఆలోచనలను, తార్కిక చర్చలను వ్యతిరేకించాడు. వేదాల, స్మృతుల సాధికారికతను ఎవరూ ప్రశ్నించకూడదని, అలా ప్రశ్నిస్తూ వాదనలకు దిగేవారెవరైనా సరే, వారు బ్రాహ్మణులైనా, అట్టివారిని వెంటనే కులం నుంచి వెలి వెయ్యాలని ఆదేశించాడు.

నిరీశ్వరవాదులను, హేతువాదులను, పరిశోధకులను, స్వతంత్ర ఆలోచనలు కలవారిని, భౌతికవాదులను, వేద ప్రమాణానికి లోబడనివారిని అందరినీ ఒకే గాటన కట్టి వారందరూ సంఘవ్యతిరేక శక్తులని ప్రకటించాడు. అట్టివారిని దొంగలతో, వ్యభిచారులతో, తక్కిన నేరస్తులతో పాటు సమానంగా పరిగణించాలని చెప్పాడు. ఈ మాదిరి అసహనం మనువాదులందరికీ ఉండే ఉమ్మడి లక్షణం. ప్రస్తుతం కేంద్రంలో పరిపాలిస్తున్న హిందూత్వ శక్తులకు కూడా ఇదే అసహనం కనిపించడం కాకతాళీయం కాదు. ఆ యా కులాల వారికి మనువు నిర్దేశించిన విధులు ఈ విధంగా ఉన్నాయి:

**బ్రాహ్మణులు :** అధ్యయనం, బోధించడం, యజ్ఞాలను నిర్వహించడం, యజ్ఞాలను చేయడం, దానాలు ఇవ్వడం, ఇతరులనుండి కానుకలను స్వీకరించడం.

**క్షత్రియులు :** ప్రజలను కాపాడడం, కానుకలను ఇవ్వడం, అధ్యయనం చేయడం, ప్రాపంచిక సుఖాల పట్ల మక్కువ కలిగివుండడం.

**వైశ్యులు :** పశువులను సంరక్షించడం, కానుకలను సమర్పించడం, వ్యాపారం చేయడం, అధ్యయనం చేయడం, వ్యవసాయం చేయడం, అప్పులు ఇవ్వడం.

**శూద్రులు :** పై మూడు కులాల వారినీ ఎట్టి లసూయా లేకుండా , ఎటువంటి ప్రతిఫలాన్నీ కోరకుండా సేవించడం.

ఈ విధంగా నిర్దేశించిన విధులను అతిక్రమించడం వర్ణసంకరంగా పరిగణించబడుతుంది. కుల వ్యవస్థ నియమాలను అతిక్రమించడం తీవ్ర నేరంగా భావించి శిక్ష విధించడం జరుగుతుంది. మనువు ఈ విధంగా అభిప్రాయపడ్డాడు: "బ్రాహ్మణులకు బానిసలుగా జీవించడానికే దైవం శూద్రులను సృష్టించాడు. ఒకవేళ

యజమాని అయిన బ్రాహ్మణుడు శూద్రుడికి స్వేచ్ఛ ప్రసాదించినా, ఆ శూద్రుడు స్వేచ్ఛాజీవి కానేరడు. బానిసత్వం అతడి సహజగుణం. కాబట్టి ఎవరూ శూద్రుడికి స్వేచ్ఛ ఇవ్వరాదు. ఒకవేళ అవకాశం చిక్కినా, శూద్రుడు సంపదను దొంగిలించరాదు. సంపన్నుడైన శూద్రుడు బ్రాహ్మణుడికి ఎప్పుడూ హానికరమే." గౌతమ స్మృతి లో ఇలా ఉంది: శూద్రుడికి నిజాయితీ, నమ్రత, పవిత్రత ఉండాలి. అంటే ఉన్నత కులాలవారు పవిత్రంగా, నిజాయితీగా నమ్రత కలిగివుండనవసరం లేదా?) అతడు ఉన్నతకులాలవారికి సేవ చేయాలి. తన సేవల ద్వారా మాత్రమే అతడు తన జీవనభృతిని సంపాదించుకోవాలి. పై కులాలవారు వాడుకుని వదిలిపెట్టిన చెప్పులను, గొడుగులను, దుస్తులను, బొంతలను మాత్రమే శూద్రుడు ఉపయోగించాలి. వారు తిని వదిలేసిన ఆహారాన్ని మాత్రమే భుజించాలి. ఒకవేళ వేద మంత్రాలు గనుక శూద్రుడి చెవుల్లో వినపడితే ఆ చెవుల్లో వేడి సీసాన్ని గాని మైనాన్ని గాని పోయాలి. ఒకవేళ శూద్రుడు గనుక వేద మంత్రాలను ఉచ్చరించినట్లైతే అతగాడి నాలుకను ముక్కముక్కలుగా కోసేయాలి. వేద మంత్రాలను అతగాడు అప్పటికీ తన జ్ఞప్తిలో ఉంచుకున్నట్లైతే, అతడి శరీరాన్ని ముక్క ముక్కలుగా కోసేయాలి. శూద్రుడు గనుక బ్రాహ్మణుడితోబాటు దారివెంట నడిచినట్లైతే అతడిని తీవ్రంగా శిక్షించాలి."

కులాన్ని బట్టి అప్పులపై వడ్డీలు విధించాలని మనువు నిర్దేశించాడు. కులం ఎంత తక్కువదైతే వడ్డీ అంత ఎక్కువగా ఉండాలని ఆదేశించాడు. అదే మాదిరిగా బ్రాహ్మణుడు కాని క్షత్రియుడు కాని హత్య చేసినట్లైతే వారికి చిన్నపాటి జరిమానా మాత్రమే విధించాలని, అదే శూద్రుడు గనుక హత్య చేస్తే అతడిని ఉరి తీయాలని ఆదేశించాడు. బ్రాహ్మణులు అన్ని కులాల స్త్రీలనూ వివాహమాడవచ్చు. తక్కువ కులల వారు తమ కులంలోని స్త్రీలను గాని, తమ కన్నా తక్కువ కులాలలోని స్త్రీలను కాని వివాహం చేసుకోవాలి. ఉన్నత కులానికి చెందిన మగవాడికి, తక్కువ కులానికి చెందిన స్త్రీ కి వివాహం ద్వారా జన్మించిన బిడ్డకు వారసత్వ హక్కు ఉండదు.

స్త్రీలు కేవలం సంతానాన్ని కనడానికే ఉన్నారని మనువు ప్రకటించాడు. ఏ మహిళకూ స్వేచ్ఛ లేదని స్పష్టం చేశాడు. బాల్యంలో తండ్రి రక్షణలో, వివాహం అనంతరం భర్త రక్షణలో (ఇక్కడ రక్షణ అంటే పెత్తనం అని గ్రహించాలి) వృద్ధాప్యంలో కొడుకు రక్షణలో స్త్రీ ఉండాలి. అంతే తప్ప ఎప్పుడూ స్వతంత్రించకూడదు.

ప్రస్తుత కాలంలో మనుస్మృతిలోని చాలా అంశాలు చట్టప్రకారం, రాజ్యాంగం ప్రకారం నిషేధం. కాని ఆచరణలో మనుస్మృతిలోని చాలా ఆచారాలు ఇప్పటికీ

అమలౌతున్నాయి. శ్రమజీవులు విముక్తి పొందడానికి వీలు లేకుండా వారిని బంధిస్తున్నాయి. ఈ ఆచారాల బంధనాలనుండబి శ్రమజీవులకు విముక్తి లభించాలంటే మనం సైద్ధాంతికంగా, సామాజికంగా చాలా ఎక్కువ పాటుపడాల్సివుంటుంది.

## (ఇ) పురాణాలు

సమాజంలో సాధారణ ప్రజలమీద పురాణాలు, వాటి గాధలు చూపించే ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది. వేదాలు, ఉపనిషత్తులు, ధర్మసూత్రాలు ఉన్నత హెూదాలలోనివారికి, పండితులకు ఉద్దేశించబడినవైతే, పురాణాలు సాధారణ ప్రజానీకాన్ని ప్రభావితం చేయడం కోసం ఉద్దేశించబడ్డాయి. వేల సంవత్సరాల పాటు శూద్రులు చదువుకోడానికి వీలు లేకుండా కట్టడి చేయబడ్డారు. పాలకవర్గాలు ఈ శూద్రులను తమ సైద్ధాంతిక ప్రభావం క్రింద నియంత్రించాలి. ఆ అవసరాన్ని పురాణాలు తీర్చాయి. పురాణ గాధలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. అవి చాలా పెద్ద కధలు. వాటిని వారాల తరబడి చెప్పుకుంటూపోవచ్చు. కల్పిత గాధలను చాలా సృజనాత్మకంగా రూపొందించి పురాణాలుగా ముందుకు తెచ్చారు.

పురాణాల్లో మనకు ప్రముఖంగా కనిపించే దేవతలు విష్ణువు, లక్ష్మి, సరస్వతి, శివుడు వంటివారు. తొలినాటి తాత్విక సాహిత్యం అయిన వేదాల్లో గాని ఉపనిషత్తుల్లోగాని ఈ దేవతల పేర్లు మనకెక్కడా కనిపించవు. యజ్ఞాల్లో హవిస్సు గా (నైవేద్యం, లేదా భాగం) సమర్పించేటప్పుడు చదివే దేవతల జాబితాలో ఈ పురాణ దేవతలు ఎక్కడా కనిపించరు. రాముడు, కృష్ణుడు వంటి విష్ణువు అవతారాల పేర్లు కూడా మనకి ప్రాచీన సాహిత్యంలో కనిపించవు. వైదిక భాషతో పోల్చితే పురాణాలలో ఉపయోగించిన భాష సాపేక్షంగా ఆధునికమైనది. ప్రాచీన అవశాషాల తవ్వకాలలో బైటపడ్డ సమాచారాన్ని బట్టి చూసినా పురాణాల్లో చెప్పబడ్డ ఘటనలేవీ వాస్తంగా జరిగిన దాఖలాలు లేవు. స్థానికంగా ప్రాచుర్యం పొందిన గాధలను వాడుకుని ఈ పురాణాలను రూపొందించారు. పురాణాలు కల్పిత గాధలే తప్ప వాస్తవంగా  జరిగిన చరిత్ర కాదు.

ఐతే ప్రజా బాహుళ్యం మానసిక స్థితి మీద పురాణాలు బలమై ప్రభావాన్ని చూపిస్తాయి. చెడును మంచి ఓడించడం, దీనులను, బలహీనులను రక్షించడానికి దైవం స్వయంగా భూమి మీద అవతరించడం, ప్రబోధించే నైతిక విలువలు, వీటితోబాటు చాలా అద్భుతంగా, అత్యంత నాటకీయంగా కధనాలను అల్లడం అంతా కలిసి చాలా

పెద్ద ప్రభావాన్ని కలిగిస్తుంది. పురాణ కాలక్షేపాలు, ప్రవచనాలు చాలా భక్తిపూర్వకంగా, జనాదరణ పొందే విధంగా సాగుతాయి. సాధారణ ప్రజలు చాలా సులువుగా వాటిపట్ల ఆకర్షితులౌతారు. దైవాన్ని విశ్వసించే సాధారణ ప్రజలకు పురాణాలు చాలా ఊరటను కలిగిస్తాయి. ఆశను రేకెత్తిస్తాయి.

అదే సమయంలో పురాణాలు దైవేచ్ఛకు పూర్తిగా లోబడివుండే ధోరణిని పెంచుతాయి. జరిగేదంతా దైవ లీల అనో, విధి అనో, లేదా ఖర్మ, తలరాత, అదృష్టం అనో సరిపెట్టుకునే స్వభావాన్ని ప్రోత్సహిస్తాయి. స్వర్గం, నరకం, పుణ్యం. పాపం వంటి భావనలను పాదుకొల్పుతాయి. అన్యాయానికి ఎదురుగా నిలబడి ప్రతిఘటించే విధంగా ప్రజానీకాన్ని పురాణాలు ఎన్నడూ ప్రేరేపించవు. దైవం మళ్ళీ అవతరించే రోజు కోసం ఓర్పుతో సహనంతో ఎదురుచూడమని బోధిస్తాయి. అప్పుడే భూమి మీద ఉన్న పాపాలన్నీ పోతాయని చెప్తాయి. భావవాదపు తాత్వికతను ఒకవైపు ఎక్కిస్తూ, మెదళ్ళను అదుపు చేస్తూవుండేవిధంగా ఆసక్తికరమైన కథనాల ద్వారా ప్రజానీకం పాలకవర్గ ప్రయోజనాలకు లోబడి వ్యవహరించే విధంగా పురాణాలు చేయగలుగుతాయి. పురాణాల ప్రభావం నేటి ఆధునిక సమాజం మీద కూడా ఎంత బలంగా ఉందంటే, ఒకవైపు నిజమైన విమానాలను చూస్తూవున్నప్పటికీ, మరోపక్క ఇంధనం అవసరం లేని, పైలట్టే లేని పుష్పక విమానాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారు. అదృశ్యం కావడం, తిరిగి ప్రత్యక్షం కావడం, ఎగిరే రథాలు, కోరినవన్నీ ఇచ్చే కల్పవృక్షం వంటి అనేక అవాస్తవికతలను ప్రజలు స్వీకరిస్తున్నారు. ఒక తరం నుండి తర్వాతి తరానికి ఈ పురాణ గాథలు ప్రసారం అవుతూంటాయి. దాంతో అవి వాస్తవికమైనవా కావా అన్న ప్రశ్న ఉత్పన్నం కాకుండాపోతుంది. ఆ పురాణాలను వాస్తవ గాథలుగానే ప్రజలు స్వీకరిస్తారు. అన్ని ప్రధాన మతపరమైన పండుగలలోను, ఉత్సవాలలోను ఈ పురాణ పఠనాలు, ప్రవచనాలు సాగుతాయి. దాంతో వాటికి మతపరమైన ఆమోదముద్ర కూడా దొరుకుతుంది.

ఈ కారణం చేతనే, 400 సంవత్సరాలనాటి చారిత్రిక వారసత్వ కట్టడాన్ని చట్టవిరుద్ధంగా ధ్వంసం చేసినప్పటికీ, ఆరెస్సెస్ మూకలు శిక్ష పడకుండా తప్పించుకోగలిగారు. చివరికి సుప్రీం కోర్టు కూడా చాలా అవాంఛనీయమైన రీతిలో మెజారిటీ ప్రజల విశ్వాసాల ప్రస్తావన తన తీర్పు లో తేవడం జరిగింది.

హిందూ పురాణాలలో రామాయణం, మహాభారతం, భాగవతం మూడు ప్రధానమైన గ్రంథాలు. బోధిసత్వుని (బుద్ధుని) జాతక కథలు కూడా కల్పిత గాథలే.

మొత్తం 18 హిందూపురాణాలు ప్రధానమైవి ఉన్నాయి. ఇవి గాక అనేక పురాణాలు వ్యాప్తిలో ఉన్నాయి. ఈ దేశంలో దాదాపు ప్రతీ దేవాలయానికీ ఒక పురాణం ఉంది.

సామాన్య ప్రజానీకం మీద పాలకవర్గాల ఆధిపత్యాన్ని సుస్థిరం చేయడంతోబాటు పురాణాలు స్థానిక, ఆదిమ గిరిజన దేవతలమీద ఆర్య దేవతల ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి కూడా తోడ్పడ్డాయి. దాదాపు అన్ని గ్రామదేవతలూ స్త్రీమూర్తులే. ఈ గ్రామదేవతలేవీ అటు వైష్ణవ మతంలో గాని ఇటు శైవ మతంలో గాని భాగం కావు. కాని పురాణాలు శివుడు, విష్ణువు వంటి దైవాలను ఉపఖండం మొత్తం మీద ఎంతగా ప్రచారంలోకి తెచ్చాయంటే ఆ ప్రచారం తోడ్పాటు తో గ్రామదేవతలందరూ శివుడి భార్య అయిన పార్వతి లేదా ఆదిశక్తి యొక్క అవతారాలే నని ప్రకటించగలిగాయి. దాంతో స్వతంత్ర ప్రతిపత్తి గల గ్రామదేవతలందరూ ప్రాధాన్యత కోల్పోయారు. ఆ క్రమంలో పాలకవర్గ సంస్కృతి దేశవ్యాప్తంగా దాదాపు ఒకే తీరుగా పైచేయి సాధించి పాలకవర్గ ఆధిపత్యాన్ని స్థానిక చైతన్యం మీద రుద్దగలిగింది.

వైదిక సంస్కృతిని, కుల వ్యవస్థను వ్యతిరేకించి ప్రతిఘటించినవారందరినీ రాక్షసులుగా, దుష్టత్వానికి ప్రతిబింబాలుగా చిత్రించాయి పురాణాలు. వైదిక సంస్కృతిని సమర్థించినవారందరూ దేవతలయారు. ఆర్యులతో పోరాడి ఓడిపోయినవారందరూ దస్యులయారు. వైదిక ఆర్యులకు సహకరించిన స్థానిక తెగలవారందరూ వానరులయారు (హనుమంతుడి మాదిరిగా) పురాణాలు కల్పిత గాథలని అంగీకరిస్తూనే కొందరు వాటిలో చాలా ఉన్నతమైన నైతిక విలువలు ఉన్నాయంటూ కొందరు పురాణాలకు చాలా గొప్ప స్థానం కల్పిస్తూంటారు. రాముడు మూర్తీభవించిన ఆదర్శమానవుడికి రూపం అని, అందరూ అతడిని అనుసరించాలని వారు చెప్తూంటారు. కాని తన భార్య శీలాన్ని నిరూపించుకోడానికి అగ్నిలో దూకవలసిందిగా ఆదేశించిన వ్యక్తి ఆదర్శపురుషుడెలా ఔతాడు? అది ఎటువంటి నైతిక విలువలను సూచిస్తోంది? పురాణాలు చాలా నైతిక విలువలను ప్రబోధిస్తాయి కాని అవి ఆచరణలో కుల వ్యవస్థను, భూస్వామ్యవ్యవస్థ లోని అణచివేతను, పురుషాధిక్యతను గౌరవిస్తూ సమర్థిస్తాయి.

ఐతే పురాణాలు అవి రాయబడ్డ కాలపు చారిత్రిక లక్షణాలను ప్రతిబింబిస్తాయి. ప్రాచీన చరిత్రను, సంస్కృతిని అధ్యయనం చేసే క్రమంలో అవి

రెండవ స్థాయి ఆధారాలుగా ఉపయోగపడతాయి. పురాణాలలో ఉన్న కథలు, పిట్టకథలు ఉపయోగించి మన భావాలను సైతం ప్రజాబాహుళ్యానికి చేరవేయవచ్చు.

తమ మత తత్వ ఎజండాను ముందుకు తీసుకుపోడానికి హిందూత్వ శక్తులు పురాణాలను వాడుకుంటున్నాయి. ఇందుకోసం హిందూత్వ వాదులు పురాణాలు ఇతిహాసాలుగా ప్రకటిస్తూంటారు. ఇతిహాసం అంటే చరిత్ర. వాస్తవంగా జరిగినది. కాని పురాణాలు కల్పితగాధలే. శాస్త్రీయ ప్రాతిపదికన చూసినా, సామాన్య పరిజ్ఞానంతో చూసినా హిందూత్వ వాదుల అవగాహన ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. (భారీ ఏనుగు తలతో గణేశుడు ఒక ఎలుక మీద సంచరించే సన్నివేశాన్ని ఊహించుకోండి ! లేదా విష్ణువు ఒక గద్ద మీద ప్రయాణం చేయడాన్ని ఊహించండి!) కాని హిందూత్వ వాదులు ఎంత అడ్డగోలు ప్రచారాలు చేస్తారంటే వారి దృష్టిలో గణేశుడికి ఉన్న ఏనుగు తలకాయ మన ప్రాచీన వైద్యులకున్న ప్లాస్టిక్ సర్జరీ పరిజ్ఞానానికి సాక్ష్యం అట! అందుచేత మనం ప్రజలు పురాణాలను సరైన చారిత్రిక దృష్టితో చూడగలిగేలా, వాటి వెనుక ఉన్న పాలకవర్గ ప్రయోజనాలను గ్రహించగలిగేలా కృషి చేయాలి. అదే సమయంలో ప్రజల విశ్వాసాలు గాయపడకుండా జాగ్రత్త వహించాలి.

## (ఈ) అద్వైతం

శంకరుడు కేరళ లోని కాలడి లో క్రీ.శ.788 లో జన్మించాడు. చాలా పిన్న వయస్సులోనే అతడు వేదాలమీద, వేదాంత సూత్రాలమీద (వీటినే బ్రహ్మసూత్రాలనుఇ కూడా అంటారు) మంచి పట్టు సాధించాడు. ఆ బ్రహ్మసూత్రాలు తేలికగా అర్ధం కావడానికి వీలుగా వివరమైన భాష్యం రాశాడు. అదే మాదిరిగా భగవద్గీత మీద, ఉపనిషత్తులమీద కూడా భాష్యాలు రాశాడు. ఇవే గాక సౌందర్యలహరి, వివేక చూడామణి, దక్షిణామూర్తి స్తోత్రం, ఆనంద లహరి వంటి రచనలు కూడా చేశాడు. వాటిద్వారా అతడు అద్వైతం అనే తాత్విక దృక్పథాన్ని ప్రచారంలోకి తెచ్చాడు.

పరమాత్మ, ఆత్మ వంటి భావనలను, వాటి నడుమ ఉన్న సంబంధాన్ని వివరంగా అద్వైతం చర్చించింది. అద్వైతం అంటే (అ– ద్వైత) రెండూ విభిన్నమైనవి కావు, రెండూ ఒకటేనని అర్ధం. అంటే పరమాత్మ, జీవాత్మ అనేవి రెండు వేరు వేరు విషయాలు కావని, నిజానికి రెండూ ఒకటేనని అద్వైతం ప్రతిపాదిస్తుంది. ప్రతీ

జీవిలోనూ ఉన్నది ఆ పరమాత్మ రూపమేనని చెప్తుంది. అహం బ్రహ్మాస్మి అన్నది అద్వైతసూత్రం. అంటే నేనే పరబ్రహ్మను (పరమాత్మను) అని అర్థం.

అద్వైతం ప్రతిపాదించిన రెండో సూత్రం ఈ ప్రపంచం యావత్తూ మిథ్య అని, వాస్తవం కాదని అంటుంది. ఈ ప్రపంచం అంతా కేవలం మాయ మాత్రమేనంటుంది. అందుచేత అద్వైతాన్ని మాయావాదం అని కూడా అంటారు. దీనిని శంకరుడు ఈ విధంగా వివరించాడు: "కలలో నువ్వు వేరే ప్రదేశంలో తిరుగాడుతూంటావు. వేరే కాలంలోన వేరే వ్యక్తుల నడుమ ఉంటావు. ఒకసారి మెలకువ రాగానే ఆ ప్రపంచం యావత్తూ మాయమౌతుంది. ఈ వర్తమాన ప్రపంచం అందరికీ వాస్తవంగా అనిపిస్తుంది. కాని ఇది కూడా కలలో అనుభవించిన ఒక దశ వంటిదే. ఒకసారి నువ్వు ఈ భౌతిక దేహాన్ని విడిచిపెట్టగానే , కలలోంచి మేల్కొన్న మాదిరిగా, ఈ ప్రపంచం యావత్తూ అదృశ్యం అవుతుంది. వాస్తవమైనదేదో అది మాత్రమే మిగులుతుంది. ఆ వాస్తవమే పరమాత్మ. తక్కినదంతా మిథ్య. బ్రహ్మ సత్యం, జగత్ మిథ్య" (పరబ్రహ్మ మాత్రమే సత్యం, ఈ ప్రపంచం అంతా మాయ)

హేతుబద్ధ తర్కానికి, ఆలోచనలకు శంకరుడు పూర్తిగా వ్యతిరేకి. అతడు ప్రతిపాదించిన సిద్ధాంతానికి ప్రమాణాలను చూపడానికి కూడా వ్యతిరేకి. ఉపనిషత్తుల్లో ఆ విధంగా చెప్పబడింది కనుక దానిని ఒప్పుకోవలసిందేనన్నది అతడి వైఖరి. ప్రశ్నించడాన్ని శంకరుడు ఏనాడూ సహించలేదు.

తాను మాయ గా అభివర్ణించిన ఈ ప్రపంచంలో ఏ విధంగా నడురుకోవాలి అన్న ప్రశ్నకు సమాధానంగా శంకరుడు "వ్యవహారిక సత్యం" అనే భావనను ప్రతిపాదించాడు." నువ్వు కల గంటున్నంతసేపూ దానిని నిజమనే భావిస్తావు. అదే విధంగా నువ్వు జీవించివున్నంతకాలమూ ఈ ప్రపంచం వాస్తవమనే భావించు." ఇదే శంకరుడి వ్యవహారిక సత్యం. ఈ వాదనతో అతడు తన మాయావాదం లేవనెత్తిన వైరుధ్యాన్ని పరిష్కరించడానికి ప్రయత్నించాడు.

శంకరుడు తాత్విక రంగంలో పోషించిన పాత్ర ప్రాధాన్యత అర్థం కావాలంటే అతడు జీవించిన కాలంలో నెలకొన్న పరిస్థితులను పరిశీలించాలి.

ఆ కాలంలో మీమాంసకులు కేవలం వైదిక కర్మకాండలకే ప్రాధాన్యతనిస్తూ పరమాత్మ భావనను పట్టించుకోకుండా వదిలేశారు. ఒంకోవైపు వేదాంతులు పరమాత్మ, జీవాత్మ వంటి అమూర్తమైన భావనలకే పరిమితం అవుతూ వాస్తవ ప్రపంచాన్ని

పూర్తిగా విస్మరించారు. శైవులకు, వైష్ణవులకు నడుమ తీవ్రంగా ఘర్షణలు జరుగుతూవుండేవి. కాపాలికులు, తాంత్రికవాదులు అన్నిచోట్లా వ్యాపించారు. వీరందరూ తమ తమ ధోరణులతోటే కొనసాగారు తప్ప సామాన్య ప్రజలను భావవాద ప్రభావంలోకి తీసుకురావడం అనే కర్తవ్యాన్ని వదిలిపెట్టారు. మరోవైపు బౌద్ధం, జైనం విస్తరించాయి. వాటితోబాటు శాస్త్ర విజ్ఞానం, తర్కం అభివృద్ధి చెందాయి. ఈ పరిణామాలన్నీ పాలకవర్గాల ఆధిపత్యం కొనసాగడానికి పెనుసవాళ్ళుగా మారాయి. ఈ సమయంలో శంకరుడు భావవాద తాత్విక దృక్పథానికి బలమైన పునాది వేశాడు. ఆ పునాది ఎటువంటిదంటే, అది ఏక కాలంలో అటు వేదాల సాధికారతనూ బలపరిచింది, ఇటు సామాన్య ప్రజానీకపు చైతన్యంలోకీ చొచ్చుకుపోయింది. తన తదనంతరం ఈ కర్తవ్యాన్ని కొనసాగించడానికి వీలుగా శంకరుడు నాలుగు పీఠాలను స్థాపించాడు. ఉత్తరాన బద్రీనాథ్ లో, తూర్పున పూరీలో, దక్షిణాన శృంగేరి లో, పశ్చిమాన ద్వారకలో ఈ పీఠాలు ఉన్నాయి.

శంకరుడి మాయావాదం ప్రపంచపు వాస్తవికతను తిరస్కరించింది. దాంతో శాస్త్రీయ దృక్పథం, పరిశోధన, అన్వేషణ అర్థం లేనివిగా అయిపోయాయి. దాని ఫలితంగా భారతదేశంలో శాస్త్రవిజ్ఞాన పురోగమనానికి పెద్ద ఆటంకం ఏర్పడింది. భారతదేశానికి శంకరుడు చేసిన అతి పెద్ద నష్టం ఈ శాస్త్రవిజ్ఞాన పురోగతిని దెబ్బ తీయడమేనని ప్రఖ్యాత శాస్త్రవేత్త డా.పి.సి.రే అభిప్రాయపడ్డారు.

"శంకరుడు సాధించిన విజయం బ్రాహ్మణులు, ఇతర ఉన్నత కులాలు తక్కిన భారత సమాజం మీద సాధించిన విజయంగా మనం అర్థం చేసుకోవాలి" అని ఇఎంఎస్ నంబూద్రిపాద్ అన్నారు. అందుచేత శంకరుడి అద్వైత సిద్ధాంతాన్ని , దానితోబాటు హిందూ పురాణాలలో, ఉపనిషత్తులలో ఉన్న భావజాలాన్ని, వాటి ఆధారంగా మళ్ళీ తలెత్తుతున్న హిందూ పునరుద్ధరణ భావజాలాన్ని నిర్ణయాత్మకంగా ఓడించకపోయినట్లైతే ఆధునిక ప్రజాస్వామిక భారతాన్ని నిర్మించే కృషిలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం" అని ఇఎంఎస్ అన్నారు.

## (ఉ) భగవద్గీత

భగవద్గీతను ప్రస్తుత కాలంలో హిందూమత పవిత్ర గ్రంథంగా పరిగణిస్తున్నారు. గీత అని కూడా ఈ గ్రంధాన్ని అంటారు. న్యాయస్థానాల్లో సైతం,

సాక్షి గనుక హిందూ మత విశ్వాసి అయినట్టైతే దైవం మీద ప్రమాణం చేసేటప్పుడు ఆ సాక్షి చేతిని భగవద్గీత గ్రంధం మీద ఉంచి ప్రమాణం చేయిస్తారు.

వైదిక మతం అనేక శాఖలుగా, శైవ, వైష్ణవ, శాక్తేయ వగైరాలుగా చీలింది. ఇవి గాక గ్రామస్థాయిలో అసంఖ్యాకంగా గ్రామదేవతలు ఉన్నారు. అందుచేత వైదిక మతం అనేది బహుదేవతారాధన జరిగే మతంగా ఉంది. ఏ ఒక్క దేవత గాని, ఏ ఒక్క మతాచారం గాని యావత్తు వైదిక మతానికి ప్రతినిధిగా చెప్పుకోడానికి లేదు. నిజానికి వైదిక మతంలో వివిధ శాఖల మధ్య తీవ్ర స్థాయిలో యుద్ధాలు, ఘర్షణలు జరిగాయి. వాటిలో శైవులకు, వైష్ణవులకు మధ్య జరిగినవి ప్రముఖమైవి. అద్వైతం ప్రవేశించిన తర్వాత వివిధ శాఖలకు ఉమ్మడి మూలాలు కొన్ని ఉన్నట్టు ఆమోదించడం మొదలైంది. ప్రతీ శాఖా వేదాలను, ఉపనిషత్తులను, ధర్మసూత్రాలను ప్రామాణికంగా అంగీకరిస్తాయి. ఐతే వాటికి తమవైన వ్యాఖ్యానాలు చేస్తూ, ప్రత్యేకమైన ఆచారాలను, పద్ధతులను అనుసరిస్తాయి. ఐతే క్రమంగా భారత ఉపఖండ వ్యాప్తంగా ఉమ్మడి అవగాహన క్రమంగా విస్తరించింది. ఆ విధంగా ప్రస్తుతం మనం హిందూ మతంగా పిలిచే మతం రూపొందింది. అద్వైతం తర్వాత ఈ విస్తృత స్వభావాన్ని సంతరించుకునే క్రమాన్ని మరితంత ముందుకు తీసుకుపోయిన గ్రంధం భగవద్గీత. సాక్షాత్తూ మహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడి నోటివెంట వచ్చిన బోధన గా గీతను పరిగణిస్తారు. శైవ మతాన్ని అనుసరించిన శంకరుడు గీత మీద చాలా వివరమైన వ్యాఖ్యానాన్ని రచించాడు. అతడు ఆవిధంగా రచించడాన్ని వైష్ణవ మతానికి చెందిన ఆచార్యులెవరూ తప్పు పట్టలేదు. గీత పై వ్యాఖ్యానించడానికి శంకరుడికి గల అర్హతలను వారెవరూ సవాలు చేయలేదు.

యుద్ధభూమిలో, మహాభారత సంగ్రామం మొదలుకానుందనగా, శ్రీకృష్ణ భగవానుడు అర్జునుడికి ఈ గీతను ఉపదేశించినట్టు ఆ గ్రంధంలోనే చెప్పారు. సాధారణ పరిస్తితిలోనైతే దీనిని ఎవరూ విశ్వసించకూడదు. ఒక మహా యుద్ధం మొదలౌతుందనగా, ఒక పక్షానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒక దగ్గర చేరి దీర్ఘకాలం పాటు కబుర్లు చెప్పుకుంటూవుండడం, వారి కబుర్లు పూర్తయేదాకా లక్షలాదిగా ఉన్న ఇరు పక్షాల సైన్యాలూ యుద్ధం మొదలుపెట్టకుండా వేచివుండడం ఎక్కడైనా జరుగుతుందా?

మహాభారత గ్రంధంలో తర్వాత కాలంలో ఈ భగవద్గీతను ప్రక్షిప్తం చేసివుండాలని ( చేర్చివుండాలని) చాలామంది చరిత్రకారులు భావిస్తారు. తొలుత

మహాభారతాన్ని రచించిన వ్యాసుడు తన రచనలో ఉపయోగించిన భాషకు, భగవద్గీతలో ఉపయోగించిన భాషకు చాలా శతాబ్దాల తేడా ఉంది. గీత రచనలో వాడిన భాషలో వ్యాకరణం, పద ప్రయోగాలు చాలా అభివృద్ధి చెందిన స్థాయిలో ఉన్నాయి. అందుచేత కొంతమంది చాలా తెలివిగా శ్రీకృష్ణుడికి ఆపాదిస్తూ విస్తారమైన తాత్విక భావాల సంగ్రహాన్ని మహాభారత గ్రంధంలో చేర్చారని చెప్పవచ్చు. అలా చేస్తే, ఇక ఆ భావాలను ప్రశ్నించే సాహసం సామాన్యులెవరూ చేయడానికి పూనుకోరని వారు భావించివుండాలి.

గీత రచనాకాలం క్రీ.పూ.1వ శతాబ్దరా క్రీ.శ.1వ శతాబ్దం మధ్య లో జరిగివుంటుందని అంచనా. అందులో 18 అధ్యాయాలు ఉన్నాయి. ఒక్కో అధ్యాయాన్నీ ఒక్కో యోగం అంటారు. ప్రతీ యోగం లోనూ వేరు వేరు తాత్విక భావాలు వ్యక్తం చేయబడ్డాయి. ఒక్కోసారి పరస్పరం విరుద్ధంగా ఆ భావాలు ఉంటాయి కూడా. ఒక యోగం సాంఖ్యం గురించి చెప్తే మరొక యోగం కర్మ సిద్ధాంతం బోధించింది. ఈ సాంఖ్యం, కర్మ సిద్ధాంతం ఒకదానికొకటి పూర్తి భిన్నమైవి. ఒక దగ్గర యుద్ధం చేసి శత్రువును ఓడించి రాజ్యాన్ని గెలిచి ఈ ప్రపంచంలోని అధికారాన్ని, భౌతిక ఆనందాలనన్నింటినీ అనుభవించమని అర్జునుడిని యుద్ధానికి ప్రేరేపిస్తే మరొక అధ్యాయంలో ఈ ప్రపంచం యావత్తూ భ్రమ మాత్రమేనని అదే అర్జునుడికి శ్రీకృష్ణుడు బోధిస్తాడు. చివరికి భగవానుడు తన విశ్వరూపంతో (ఆ విశ్వరూపం అర్జునుడికి తప్ప అక్కడ చేరిన లక్షలాదిమందికెవరికీ కనిపించదు) అర్జునుడికి దర్శనమిచ్చి, ఆ యుద్ధంలో చచ్చేవారు, చంపేవారు అందరూ తనయొక్క వివిధ రూపాలు మాత్రమేనని ప్రకటిస్తాడు.

భగవద్గీతను రెండు ప్రయోజనాలకోసం రచించినట్టు చెప్పవచ్చు. మొదటిది: బౌద్ధం, జైనం, లోకాయతం వంటి తాత్విక సిద్ధాంతాలనుండి ఎదురౌతున్న సవాళ్ళను తిప్పికొట్టడానికి, తక్కిన అన్ని తాత్విక దర్శనాలనూ ఒక సంగ్రహంగా మలిచారు. వాటి నడుమ ఎన్ని తేడాలు ఉన్నా, అవన్నీ స్థూలంగా బ్రాహ్మణ,క్షత్రియ కులాల ఆధిపత్యాన్ని , అంటే పాలకవర్గాల ఆధిపత్యాన్ని అంగీకరించాయి. రెండవది: సామాన్య ప్రజానీకంలోకి తమ వర్గ సైద్ధాంతిక భావజాలాన్ని పెద్దఎత్తున ప్రచారం చేయడానికి అది తోడ్పడాలి.

◆ నాలుగు కులాల వ్యవస్థను తానే రూపొందించినట్టు గీత లో శ్రీకృష్ణుడు ప్రకటించాడు. అలా రాయడం ద్వారా కుల వ్యవస్థకు దైవమే ఆమోదించిందన్న అభిప్రాయాన్ని కలిగించి అందరూ దానికి లోబడి వ్యవహరించేట్టు చేయవచ్చు.

◆ కర్మ సిద్ధాంతాన్ని, పునర్జన్మను గీత సమర్ధిస్తుంది.

◆ పాపుల్ని శిక్షించే పని భగవంతుడికి వదిలిపెట్టాలని గీత బోధిస్తుంది. అంటే అన్యాయాలను ప్రతిఘటించే పాత్ర ప్రజలకు లేదన్నమాట. ప్రజలు కేవలం నిమిత్తమాత్రులుగా మిగిలిపోవాలి.

◆ ఎటువంటి సంకోచమూ లేకుండా భగవంతుడిని పూర్తిగా శరణు కోరాలని గీత చెప్తుంది. దానర్థం ఏమంటే, ఎటువంటి ప్రశ్నలూ లేవనెత్తకూడదు, ఎటువంటి సవాళ్ళూ ఉండకూడదు, ఎటువంటి హేతుబద్ధ చర్చా చేయకూడదు, సత్యం ఏమిటో అన్వేషించే పని చేపట్టకూడదు, ఎటువంటి శాస్త్రీయ పరిజ్ఞానాన్నీ పొందేందుకు ప్రయత్నించకూడదు.

◆ తమకు అప్పజెప్పబడిన పనులను ప్రతీవొక్కరూ ఎటువంటి ప్రతిఫలాపేక్షా లేకుండా చేయాలని గీత బోధిస్తుంది. శూద్రులు తాము ఎటువంటి ప్రతిఫలాన్నీ కోరకుండా అగ్రకులాలవారికి సేవలు చేయాలని మనువు ఏదైతే చెప్పాడో, దానినే గీతలో చాలా తెలివిగా కర్మయోగంలో సమర్థించారు.

అందుచేత ప్రస్తుత కాలంలోని పాలకవర్గాలు కూడా గీత ను అన్ని విధాలుగా బాగా ప్రచారంలో పెట్టడం వలన తమకు చాలా ప్రయోజనాలు కలుగుతాయని గ్రహించారు.

పాఠశాలల్లో గీతను పాఠ్యాంశంగా చేర్చి బోధించనున్నారని ఇప్పుడు వింటున్నాం. సంఘపరివారం ఆధ్వర్యంలో నడిచే గీతాప్రెస్(గోరఖ్‌పూర్) ఇప్పటివరకూ 12 కోట్ల గీత లను ముద్రించి పంపిణీ చేసింది. దానికి వివిధ భాషల్లో వ్యాఖ్యానాలు కూడా జోడించారు. ఏదో ఒక టివి చానెల్ లో అనునిత్యమూ గీతాప్రవచనాలు జరుగుతూవుండడం మనం చూస్తున్నాం. పలు మత ఉత్సవాలలో భారీగా సమీకరణలు జరిగిన సందర్భాల్లో కూడా గీతా ప్రవచనాలు జరుగుతూవుంటాయి.

మనం జరిపే సైద్ధాంతిక పోరాటంలో ప్రజాసామాన్యంమీద గీతలోని భావజాలానికి ఉన్న ప్రభావాన్ని ఎదుర్కోవడం ఒక పెద్ద సవాలుగా ఉంది. అందుచేత మనం గీతను చదవాలి. (ప్రజాశక్తి బుక్‌హౌస్ భగవద్గీత పై ప్రచురించిన "యోధుడు–సారథి" గ్రంథాన్ని చదవాలి)

## 8. భక్తి ఉద్యమాలు

అద్వైత తత్వం, గీత ల తోడ్పాటు తో పాలకవర్గాల తాత్విక భావజాలం ప్రజల్లో బలంగా వేళ్ళూనుకుంది. క్రీ.శ. 6, 7 శతాబ్దాలనాటికే కులవ్యవస్థ బలంగా అమలు కావడంతో పాలకవర్గాల ఆధిపత్యం స్థిరపడింది. బౌద్ధ, జైన మతాల ప్రభావం సన్నగిల్లి బ్రాహ్మణవాద మతానిది పై చేయి అయింది. తనదైన ప్రత్యేకతలతో భూస్వామ్య వ్యవస్థ తన పునాదిని బలంగా నిర్మించుకుంది. ఈ నూతన పరిస్థితికి అనుగుణంగా మతపరంగా, తాత్వికంగా సర్దుబాట్లు అవసరం అయాయి.

దక్షిణాదిలో క్రీ.శ.6వ శతాబ్దం నుండి తలెత్తిన భక్తి ఉద్యమం ఇందుకు అవసరమైన పాత్రను పోషించింది. నయనార్లు అనబడే శైవ సన్యాసులు, ఆళ్వార్లు అనబడే వైష్ణవ సన్యాసులు ఈ భక్తి అనే భావనను బలంగా ప్రచారం చేశారు. భగవంతుడు ఏ కొద్దిమందికో మాత్రమే చెందినవాడు కాదని, దేవుడు అందరివాడు అని, దేవుడు మన మొర ఆలకించాలంటే అందుకోసం ఏ క్రతువులూ చేయనవసరం లేదని, కేవలం భక్తితో ధ్యానిస్తే చాలునని వారు ప్రచారం చేశారు. దైవం సర్వత్రా వ్యాపించివున్నాడు గనుక ఆ దైవం కోసం ఏ దేవాలయానికీ పోవలసిన అవసరం లేదని వారు ప్రకటించారు. ఉన్నత కులస్థుడైన బ్రాహ్మణుడికి, తక్కువ కులస్థుడైన శూద్రుడికి మరణానంతరం ఒకే శ్మశానం ఏవిధంగా చోటిస్తుందో, అదే విధంగా భగవంతుడు కూడా అన్ని కులాలవారికీ ఒక్కడేనని బోధించారు. భక్తితో ప్రార్థిస్తే దైవం నుంచి తప్పకుండా స్పందన ఉంటుందని, ప్రతీఒక్కరూ మోక్షం పొందడానికి అర్హులేనని తెలిపారు. ఒక రాజు తన పాలనలోని ప్రజలపట్ల ఏ విధమైన సంబంధం కలిగివుంటాడో, భగవంతుడు కూడా భక్తులతో అటువంటి సంబంధాన్నే కలిగివుంటాడని వారు సూత్రీకరించారు.

భక్తి ఉద్యమాన్ని బలంగా వ్యాప్తి చేయడానికి కృషి చేసినవారిలో 11వ శతాబ్దానికి చెందిన రామానుజుడు ప్రముఖుడు. అద్వైత తత్వాన్ని సవరించి విశిష్టాద్వైతం అనే తాత్విక సిద్ధాంతాన్ని అతడు రూపొందించాడు. కేవలం సిద్ధాంతరూపకల్పనకే పరిమితం కాకుండా రామానుజుడు తన భావాలను సామాన్య ప్రజానీకంలోకి తీసుకుపోయాడు. బ్రాహ్మణులు మాత్రమే వల్లించాలని మనుస్మృతి నిర్దేశించినప్పటికీ, దానిని ధిక్కరించి పవిత్ర మంత్రాలను సామాన్యులకు నేర్పాడు. వైష్ణవ శాఖ భక్తి

ఉద్యమాన్ని వ్యాప్తి చేయడంలో ముఖ్యపాత్ర పోషించింది. భాగవత పురాణం మహాభారతానికి భిన్నంగా శ్రీకృష్ణుడిని ప్రేమమూర్తిగా, అందరికీ అందుబాటులో ఉండేవాడిగా, భక్త సులభుడిగా అభివర్ణించింది. ఆ పురాణం భక్తి ఉద్యమంలో ప్రజానీకంలో బాగా ప్రచారం పొందింది. తులసీదాసు గ్రామీణ ప్రజలు మాట్లాడుకునే హిందీ భాషలో సులభశైలిలో రామాయణాన్ని రచించాడు. అది విశేషంగా ప్రాచుర్యం పొందింది. తులసీదాసు రామాయణంలో రాముడు ఒక మానవాతీత శక్తిగా కనిపించడు. అందరూ అనుసరించవలసిన ఒక ఆదర్శ మానవుడిగా కనిపిస్తాడు. ప్రతీ గ్రామంలోనూ రామాలయాలు భక్తి ఉద్యమకాలంలో వెలిశాయి. భక్తి ఉద్యమం దైవాన్ని ఏవిధంగా ప్రార్థించాలన్నదానిమీద ఎటువంటి నియమాలనూ విధించలేదు. దాంతో అందరూ ముందుకు వచ్చారు. సాధారణంగా ఆలయాల్లో దైవాన్ని పూజించే గుత్తాధిపత్యం బ్రాహ్మణులకే ఉండేది. కాని ఈ గ్రామ దేవాలయాల్లో అటువంటి నియమాలేవీ వర్తించలేదు. భజనలు చేయడం ఒక కొత్త ఆరాధనా విధానంగా ముందుకొచ్చింది. తూర్పు భారతంలో భక్తి ఉద్యమాన్ని బలంగా వ్యాప్తి చేయడంలో చైతన్యుడు ముఖ్యమైన పాత్ర పోషించాడు. శ్రీకృష్ణుడు పుంసత్వానికి ప్రతిరూపంగాను, భక్తులందరూ, వారు ఆడ గాని మగ గాని ఎవరైనప్పటికీ, స్త్రీత్వానికి ప్రతిరూపంగాను వర్ణించాడు. ప్రపంచం అంతా ప్రేమమయం అని, అవధులు లేని ప్రేమను దైవం పట్ల ప్రదర్శించడం ద్వారా మాత్రమే దైవాన్ని చేరుకోగలం అని ప్రబోధించాడు. కనూజ్ కి చెందిన రామానుందుడు రామభక్తిని ప్రబోధించాడు. దానితోబాటు అన్ని కులాలవారికీ సహపంక్తి భోజనాలు నిర్వహించడం వంటి సాంఘిక సంస్కరణలను చేపట్టాడు. ఆ కాలం నాటికి ఇటువంటి కార్యక్రమాలు నిజంగా విప్లవాత్మకమైనవనే చెప్పాలి.

భక్తి ఉద్యమపు తొలి వెల్లువ క్రీ.శ.6 నుండి 12వ శతాబ్దం దాకా కొనసాగింది. ఈ ఉద్యమం ప్రభావం వలన బౌద్ధ, జైన మతాల ప్రభావం సమాజంమీద సన్నగిల్లింది. హిందూ సమాజం గట్టిపడింది.

క్రీ.శ.12 వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకూ భక్తి ఉద్యమం రెండో వెల్లువ సాగింది.

12, 13 శతాబ్దాల కాలంలో వాణిజ్యం విస్తరించడం వలన ఆర్థిక వ్యవస్థలో ధనం పాత్ర పెరిగింది. దానితోబాటు పట్టణీకరణ వేగంగా సాగింది. దీనినే మూడవ పట్టణీకరణ విప్లవం అని చరిత్రకారులు పిలుస్తారు. దీని పర్యవసానంగా చేతివృత్తుల వారు, వ్యాపారులు, వ్యవసాయదారులలో అనేకులు తమ జీవన స్థాయిలలో మెరుగుదల

పొందగలిగారు. కాని అనతికాలంలోనే భూస్వామ్య పాలక శక్తులు ఈ తరగతులప్రజానీకం నడ్డి విరిగేలా పన్నులను విధించి పీడించసాగారు. అది ఈ తరగతుల ప్రజానీకంలో తీవ్ర నిరసనకు, వ్యతిరేకతకు దారి తీసింది. తమ సామాజిక స్థాయి మెరుగుపడితే గాని తమ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోలేము అన్న అభిప్రాయం వారిలో బలంగా కలిగింది. తమ ఆకాంక్షలను వ్యక్తం చేసే వీలున్న భక్తి ఉద్యమాన్ని వారు ఈ కారణంతో బలంగా ప్రోత్సహించారు. భక్తి భావాలను ప్రచారం చేసే సన్యాసులను బాగా ఆదరించారు.

ఈ కాలం నాటికి భారతదేశంలో తురుష్కులు తమ రాజ్యాలను స్థాపించారు. వారితోబాటు ఇస్లామిక్ వ్యాపారులు ప్రవేశించారు. మతసామరస్యాన్ని ప్రబోధించే సూఫీ సన్యాసుల, ఫకీర్ల ప్రబోధాలు, వారి సాంప్రదాయాలు దేశంలో వ్యాపించాయి. ఇక్కడి మత జీవితంలో ఒక భాగంగా మారాయి. బ్రాహ్మణాధిపత్యపు అవమానాలనుండి విముక్తి పొందాలంటే అందుకు ఇస్లాం ఒక మార్గం అని భావించిన అనేకమంది చేతివృత్తుల వారు ఇస్లాం ను స్వీకరించారు. సూఫీయిజం హిందూ-ముస్లిం ఐక్యతను బాగా ప్రచారం చేసింది. 1398-1500 మధ్య కాలంలో జీవించిన కబీరు రాముడు-రహీము ఒక్కరే నని ప్రచారం చేశాడు. అంటరానితనాన్ని పాటించే బ్రాహ్మణులను అతడు అవహేళన చేశాడు. తన కులం కన్నా తక్కువ కులస్తుడిని ముట్టుకుంటే తాను మైల పడిపోతానని భావించే బ్రాహ్మణుడు నిజానికి తనమీద తానే అంటరానితనాన్ని విధించుకున్నాడు" అని విమర్శించాడు.

మరత్వాడా ప్రాంతంలో నామ్‌దేవ్, తుకారాం భక్తి ఉద్యమాన్ని బలంగా వ్యాపింపజేశారు. భక్తి ఉద్యమకారుల్లో ప్రముఖులు చాలామంది తక్కువ కులాలనుండి వచ్చినవారు కావడం ఇక్కడ ప్రధానంగా గమనించాలి. కర్నాటక కు చెందిన చర్మకారుడు హరలయ్య, తొలినాటి స్త్రీవాద ఉద్యమకారిణి అక్కా మహాదేవి, ఆంధ్ర కు చెందిన వేమన, వడ్రంగి వృత్తికారుడు పోతులూరి వీరబ్రహ్మం, మహారాష్ట్ర కు చెందిన దర్జీ పనివాడు నామ్‌దేవ్, గ్రామసేవకుడు చొక్కామేల, కిరాణా వ్యాపారి తుకారాం, కూరగాయల వ్యాపారి సవతా మాలి, ఉత్తర భారతానికి చెందిన చేనేతవృత్తికారుడు కబీరు, చెప్పులు కుట్టే రవిదాస్, దూదిని ఏకే దాదు దయాల్, రాజకుమారి మీరా, ఖత్రి నాయక్, మూటలు మోసే గోరా, క్షురకుడు సేనా వంటివారు ప్రముఖ భక్తి ఉద్యమకారులు.

మహిళలలో భక్తి ఉద్యమాన్ని ముందుండి నడిపించినవారిలో ప్రముఖులు మీరా, సక్కుబాయి తదితరులు ఉన్నారు. అగ్రవర్ణ ఆధిక్యతతోబాటు పురుషాధిక్యతకూ ప్రతీకగా ఉన్న మనుస్మృతి ఆడదానికి భర్తే దైవం అని నిర్దేశించింది. దానిని మీరా సవాలు చేసింది. "మీరు భర్తే నా దైవం అంటున్నారు. కాని నేను దైవమే నా భర్త అంటాను" అని ప్రకటించింది. సక్కుబాయి, ఆంధ్ర ప్రాంతానికి చెందిన మొల్ల వంటివారు అదే వాదనను తామూ ఎత్తుకున్నారు. తనను రాముడే వివాహమాడాడని, అందుచేత రాముడిమాట తప్ప వేరెవరి ఆదేశాన్నీ తాను ఖాతరు చేయనని మొల్ల ప్రకటించింది. కుమ్మరి కులానికి చెందిన మొల్ల, శూద్రులకు, అందునా స్త్రీలకు చదువు నిరాకరించబడిన ఆరోజుల్లో రామాయణాన్ని పాటకజనానికి అర్థం అయేరీతిలో రచించింది.

మంత్రాల, ఋక్కుల స్థానంలో భజనలు, అభంగాలు( తుకారాం) దోహాలు (తులసీదాసు) పాటలు (జయదేవుడి గీత గోవిందం) కీర్తనలు (త్యాగరాజు) పదాలు (క్షేత్రయ్య-మువ్వగోపాలుడి మీద) ప్రవేశించాయి. అన్నమయ్య తిరుపతి వెంకటేశ్వరుడిమీద రచించిన పాటలు భక్తి భావాన్ని ప్రబోధించడంతోబాటు సామాజిక వివక్షతను, దురాచారాలను తూర్పారబట్టాయి. మంత్రాలు, ఋక్కుల అత్యధిక ప్రజానీకానికి బోధపడవు. కాని ఈ కొత్త ప్రార్థనారూపాలలోని భావాలను వారు తేలికగా అర్థం చేసుకోగలిగారు. అవన్నీ వారు వాడే భాషల్లోనే రాయబడ్డాయి.

భక్తి ఉద్యమం నుండే 15వ శతాబ్దంలో సిక్కు మతం పుట్టుకొచ్చింది. అందుచేతనే సిక్కు మతం అటు వైదిక మతానికి, ఇటు ఇస్లాం మతానికి భిన్నంగా వేరుగా ఉంటుంది. సిక్కులు కుల వ్యవస్థను, విగ్రహారాధనను వ్యతిరేకిస్తారు. సిక్కు మతగురువులు వేరు వేరు సామాజిక దొంతరలనుండి వచ్చారు. గురు నానక్ పురుషాధిక్యతను, అంటరానితనాన్ని, సతి వంటి దురాచారాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. ఖల్సా (సిక్కుల సమూహం) కు అందరూ పూర్తి అంకితభావంతో కట్టుబడివుండాలని, పరిశుభ్రతను పాటించాలని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని, దయ, జాలి వంటి మానవత్వ గుణాలను పెంపొందించుకోవాలని గురు నానక్ ప్రబోధించాడు.

భక్తి ఉద్యమంలో బయలుదేరిన కొన్ని సాంప్రదాయాలు నేటి భారతదేశంలో కూడా కొనసాగుతున్నాయి.

భక్తి ఉద్యమాన్ని, అది చారిత్రికంగా నిర్వహించిన పాత్రను అవగాహన చేసుకుంటూనే, అది మరొక రూపంలో ఉన్న భావవాదమేనన్న వాస్తవాన్ని మనం మరిచిపోకూడదు.

ఐతే, ఇప్పుడు దేశం మీద మనువాదులు పెత్తనం చెలాయిస్తున్నారు. వీళ్ళు అన్ని కాలం చెల్లిన పురాతన దురాచారాలను, మూఢవిశ్వాసాలను, సతి తో సహా బూజు పట్టిన సాంప్రదాయాలను తిరిగి పునరుద్ధరించాలని ప్రయత్నిస్తున్నారు. ఈ మనువాదులను ఎదుర్కోడానికి మనం భక్తి ఉద్యమంలోని సాంప్రదాయాలను ఏవిధంగా ఉపయోగించవచ్చునన్నది పరిశీలించాలి. మన వర్గాల ప్రజల నడుమ శాస్త్రీయ భావాలను, భౌతిక వాదాన్ని ప్రచారం చేస్తూనే, హిందూత్వ శక్తుల ప్రయత్నాలకు అడ్డం పడేలా భక్తి ఉద్యమ సాంప్రదాయాలను ముందుకు తెచ్చి, హిందూ సమాజం మీద తమకే గుత్తాధిపత్యం ఉన్నట్టు వారు చెప్పుకోవడం చెల్లదని సవాలు చేయాలి.

## 9. వలస పాలన కాలంలో సంస్కరణ ఉద్యమాలు

17వ శతాబ్దం రెండవ అర్ధభాగం ( 1650–1700) నాటికి మొగల్ పాలన క్రమంగా బలహీనపడడం మొదలైంది. భారత ఉపఖండం ముక్కముక్కలుగా అనేక చిన్న చిన్న రాజ్యాలతో ఉండేది. వాటిని పాలిస్తున్న ఫ్యూడల్ ప్రభువులు ఒకరితో ఇంకొకరు ఘర్షణలు పడుతూనో, కాకపోతే విలాసాలలో మునిగితేల్తూనో కాలక్షేపం చేసేవారు. అదే సమయంలో సామ్రాజ్యవాద శక్తులుగా తలెత్తుతున్న బ్రిటిష్, ఫ్రెంచి, డచ్చి రాజ్యాలు సువిశాలమైన భారతీయ మార్కెట్ పై ఆధిపత్యం సాధించడానికి ఆరాటపడుతూండేవారు. ఇక్కడ పరస్పరం ఘర్షణలు పడుతున్న రాజ్యాల వివాదాల్లో వారు తరుచూ జోక్యం కల్పించుకుంటూ ఆ క్రమంలో అనేక ప్రాంతాలమీద ఆధిపత్యాన్ని సంపాదించసాగారు.

వారిలో తక్కిన వారందరికన్నా బ్రిటిష్‌వారు పైచేయి సాధించగలిగారు. భారతీయులపై తమ పెత్తనాన్ని కొనసాగించడానికి వారికి ఒక పాలనా వ్యవస్థ అవసరమైంది. పాశ్చాత్య విద్యను, అక్కడి చట్టాలను అభ్యసించిన భారతీయులు ఆ పాలనా వ్యవస్థలో ఇమిడి పని చేయడానికి కావలసివచ్చారు.

ఆ క్రమంలో విద్యావంతులైన ఒక మధ్యతరగతివర్గం ఏర్పడింది. ప్రధానంగా ఉన్నత కులాలనుండి వీరు వచ్చారు. వలసపాలన దేశంలో చూపుతున్న ప్రభావం పట్ల వీరిలో కొందరికి ప్రతిస్పందన ప్రారంభమైంది.

శతాబ్దాల తరబడి మార్పుకు నోచుకోని భూస్వామ్య వ్యవస్థను ఇటు హిందూ, అటు ముస్లిం మతాల పెద్దలు బలపరుస్తున్నారు. హిందూ పీఠాధిపతులు కర్మసిద్ధాంతాన్ని ప్రజలకు ఎక్కించడంలో తలమునకలైవున్నారు. కుల వ్యవస్థను, మూఢవిశ్వాసాలను, కాలం చెల్లిన ఆచారాలను పట్టుకుని వేళ్ళాడుతున్నారు. ఇస్లాం మత గురువులు అల్లా సర్వ శక్తిమంతుడని, అతనికి పూర్తిగా దాసోహం కావాలని, ఛాందస ఆచారాలను పాటించడమే పరిష్కారం అని, మానవులు శక్తిహీనులని ప్రచారం చేస్తున్నారు. మరొక తరహా సన్యాసులు, ఫకీర్లు వాస్తవ సామాజిక పరిస్థితులను ఎదుర్కోవడం బదులు వాటినుండి దూరంగా తప్పుకుని ఆత్మశోధన'లో మునిగిపోసాగారు.

ఈ నేపథ్యంలో రెండు మతాలలోనూ సంస్కరణలు అవసరం అంటూ ఆధునిక భావాలతో బలంగా కొందరు ముందుకొచ్చారు. ఈ ధోరణివైపు ముందడుగు వేసినవారిలో ప్రముఖుడు రాజా రామ్మోహన్ రాయ్.

( 1772–1833) భారతదేశంలో మధ్యతరగతివర్గం బలంగా ఎదుగుతున్న కేంద్రాలలో కలకత్తా ముఖ్యమైనదిగా ఉండేది. ఆ వర్గానికి తొలినాటి ప్రతినిధిగా రామ్మోహన్ రాయ్ తెరమీదకు వచ్చారు.

ఫ్యూడల్ వ్యవస్థను సమూలంగా నిర్మూలించి దాని స్థానంలో ఆధునిక, బూర్జువా వ్యవస్థను ఏర్పరచాలని రామ్మోహన్ రాయ్ ప్రబోధించాడు. భారతదేశంలో ఆధునిక బూర్జువా సమాజాన్ని నిర్మించాలన్న తన ప్రయత్నానికి బ్రిటిష్ వారు తోడ్పాటునందిస్తారని ఆయన ఆశించాడు. ఈ దేశాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో బ్రిటిష్ వారు లేరని, ఈ దేశాన్ని తమ వలసగా మార్చుకుని కొల్లగొట్టడమే వారి ప్రధాన ఉద్దేశ్యం అని రామ్మోహన్ రాయ్ గ్రహించలేకపోయారు.

రామ్మోహన్ రాయ్ తాత్విక విశ్వాసం బట్టి చూస్తే అతడు వేదాంతి. ఐతే అతడు మాయావాదాన్ని తిరస్కరించి ఈ ప్రపంచం వాస్తవమేనని ప్రకటించాడు. భగవంతుడు ఈ విశ్వాన్ని సృష్టించినమాట నిజమే అయినా, ఒకసారి సృష్టి అయిపోయిన తర్వాత ఈ ప్రపంచంలో జరిగే పరిణామాలతో ఆ భగవంతుడికి ఏ సంబంధమూ లేదని రాయ్ అన్నాడు. కర్మ, అదృష్టం, పునర్జన్మ వంటి భావనలను రాయ్ వ్యతిరేకించాడు. మత క్రతువులను రాయ్ తీవ్రంగా వ్యతిరేకించాడు. అందునా జంతుబలులు వంటి ఆటవిక ఆచారాలు వేదాంత తత్వంలో ఎక్కడా చెప్పలేదని రాయ్ అన్నాడు. కులవ్యవస్థ కట్టుబాట్లను రాయ్ ఎదిరించాడు. బ్రాహ్మణుడికి మాంసం

తినే హక్కు ఉండాలని, అదే మాదిరిగా శూద్రుడికి సంస్కృతం నేర్చుకునే హక్కు ఉండాలని ఆయన వాదించాడు. తార్కిక చర్చలను, శాస్త్రీయ శోధనను ఆయన సమర్థించి ప్రోత్సహించాడు. లైంగిక సమానత్వం కావాలని రాయ్ బలంగా ఉద్యమించాడు. బాల్య వివాహాలను, సతి దురాచారాన్ని, పర్దా పద్ధతిని నిషేధించాలని పోరాడాడు. స్త్రీలకు ఆస్తిహక్కు ఉండాలని, పునర్వివాహం చేసుకునే హక్కు ఉండాలని కోరాడు. పాతకాలపు గ్రంధాలను చదువుతూ వాటికే పరిమితం అవుతున్న విద్యావ్యవస్థ వల్ల ఏ ఉపయోగమూ లేదని భావించాడు. గణితం, రాజకీయ శాస్త్రం, శాస్త్ర విజ్ఞానం, ఖగోళశాస్త్రం, వైద్యవిద్య, భూగోళశాస్త్రం వంటి ఆధునిక విద్యలను అందరూ నేర్చుకోవాలని ప్రచారం చేశాడు. విస్తృతంగా రచనలు చేసి తన భావాలను ప్రచారంలో పెట్టేందుకు ప్రయత్నించాడు.

1823లో రాయ్ బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. బ్రహ్మసమాజం వేదిక ద్వారా సతి దురాచారాన్ని రద్దు చేయడం కోసం పట్టుదలగా సాగించిన ప్రచారం ఫలితంగా బ్రిటిష్‌వారు సతి దురాచారాన్ని రద్దు చేయవలసివచ్చింది. మతఛాందసవాదులు బ్రహ్మసమాజంపై, రాయ్ భావాలపై తీవ్రంగా దాడి చేశారు. కాని ఆ దాడులను రాయ్ ధైర్యంగా ఎదుర్కొన్నారు.

రాయ్ తాత్విక విశ్వాసాలకు అంతగా ప్రాధాన్యతనివ్వనవసరం లేదు కాని ఆయన చేపట్టిన సామాజిక ఉద్యమాలను, ప్రచారాన్ని లోతుగా మనం అధ్యయనం చేయాలి. అతడు ప్రారంభించిన సాంఘిక సంస్కరణ ఉద్యమాన్ని ప్రస్తుత కాలంలో కొనసాగించవలసిన కర్తవ్యం మనపై ఉంది.

## మతాభిమానాన్ని పునరుద్ధరించే సంస్కరణోద్యమాలు

బ్రిటిష్ పాలకులుతమ సాంస్కృతిక ఆధిపత్యాన్ని భారతదేశం మీద చెలాయించడానికి చేస్తున్న ప్రయత్నాలను విద్యావంతులైన ఉన్నతకులాల మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అలా వ్యతిరేకించిన విద్యావంతులైన మేథావుల ఆలోచనలు మూడు రకాల ఉద్యమాలుగా పరిణమించాయి.

వాటిలో మొదటి తరహా ఉద్యమాలు **బ్రహ్మసమాజం** ఆధ్వర్యంలో దేవేంద్రనాథ్ టాగూరు, అతడి సహచరుడు అక్షయ్ కుమార్ దత్తా ల నాయకత్వాన నడిచాయి. వీరు బ్రహ్మసమాజాన్ని స్థాపించిన రాజా రామ్మోహన రాయ్ పాశ్చాత్య ఆధునికత పట్ల ప్రదర్శించిన మొగ్గు నుండి, అన్ని మతాలనూ సమానంగా గౌరవించాలన్న

అతని దృక్పథం నుండి విడగొట్టుకున్నారు. ఆ తర్వాత హిందూ మతం తక్కిన మతాలన్నింటికన్నా చాలా గొప్పది అని ప్రకటించి విదేశీ మతం అయిన క్రైస్తవం దాడి నుండి హిందూ మతాన్ని, సంస్కృతిని కాపాడుకోవాలన్న పిలుపునిచ్చారు. ఆ విధంగా హిందూ మత దురాభిమానం ఒక సిద్ధాంతంగా వేళ్ళూనుకోడానికి తోడ్పడ్డారు.

రెండవది **థియోసాఫికల్ సొసైటీ.** దీనినే దివ్యజ్ఞాన సమాజం అని అంటాం. ఇది 1875లో న్యూయార్క్‌లో స్థాపించబడింది. కాని 1880 నాటికి దాని కేంద్ర కార్యాలయాన్ని భారతదేశానికి తరలించారు. ఇందులో పని చేయడానికి ఆనీ బిసెంట్ 1893లో భారతదేశానికి వచ్చేనాటికి ఈ సమాజం కార్యకలాపాలు బహుముఖంగా పెంపొందాయి. దివ్యజ్ఞాన సమాజం అన్ని మతాల సమానత్వాన్నీ ప్రబోధించి విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ప్రచారం చేసింది. వ్యక్తి ప్రతిఘటనను, స్వపరిపాలనను (హెూం రూల్) బలంగా సమర్థించింది. భారతదేశంలో హెూం రూల్ లీగ్ ఉద్యమాన్ని, స్వదేశీ ఉద్యమాన్ని బలంగా సమర్థించింది. సాంఘిక సంస్కరణలను బలపరిచింది. కుల వివక్షతను, బాల్య వివాహాలను వ్యతిరేకించింది. బాలికలకు విద్య గరపాలని ప్రచారం చేసింది.

ఐతే దివ్యజ్ఞాన సమాజం ఆత్మ వాస్తవికతను, పరలోకం ఉనికిని తాత్వికంగా సమర్థిస్తూ ప్రచారం చేసింది. ఆత్మ ఒక శరీరం నుండి వేరొక శరీరానికి ప్రయాణించగలదన్న విశ్వాసాన్ని (పరకాయ ప్రవేశం) ప్రచారం చేసింది. మన దేశపు ప్రాచీన వారసత్వాన్ని కాపాడే పేరుతో అంధ విశ్వాసాలను, తంత్ర విద్యలను ప్రోత్సహించింది. ఈ సమాజం నాయకులు తాము మరణించినవారి ఆత్మలతో సంభాషించినట్టు ప్రకటించేవారు! ఆ విధంగా దివ్యజ్ఞానసమాజం మూఢ నమ్మకాలను, అంధ విశ్వాసాలను, వాటితోబాటు భావవాదాన్ని మన దేశంలో వ్యాప్తి చేయడానికి తోడ్పడింది.

మూడవది దయానంద సరస్వతి (1824-1883) నాయకత్వంలో స్థాపించబడిన **ఆర్యసమాజం.** దీనిని 1875లో స్థాపించారు. గుజరాత్, మహారాష్ట్ర, పంజాబ్, బీహార్ , ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఇది ఎక్కువ ప్రభావాన్ని చూపగలిగింది. భారతదేశంలో వెనుకబడ్డ స్థితిలో ఉన్న ప్రజాబాహుళ్యాన్ని కదిలించాలంటే వారు తమ గత కాలపు వారసత్వం పట్ల గర్వపడేలా చేయడం ఒక్కటే మార్గం అని దయానంద సరస్వతి భావించారు. " మళ్ళీ వేదాల వద్దకు" అన్న నినాదాన్ని ఆయన ఇచ్చారు. ఆ నినాదం భారతీయ ప్రజానీకాన్ని ఐక్యపరుస్తుందని ఆయన భావించాడు. వేదాలను భారతీయ భాషల్లోకి తర్జుమా చేసి ప్రజల్లో ప్రచారం చేపట్టాడు. శూద్రులను వేదాలు చదివేందుకు ప్రోత్సహించాడు. దయానందుడు రచించిన "సత్యార్థ ప్రకాశ" అన్న

గ్రంథం తత్వశాస్త్రంలో ఒక ముఖ్యమైన సిద్ధాంతం. అందులో ఈ విశ్వం మూడు మౌలిక అంశాలతో ఏర్పడిందని ఆయన సూత్రీకరించాడు. అవి పరమాత్మ, జీవాత్మ, ప్రకృతి. దయానందుడు విగ్రహారాధనను వ్యతిరేకించాడు. జంతుబలులను, వివక్షతతో నిండిన కుల వ్యవస్థను. దురాచారాలను వ్యతిరేకించాడు. హిందూ మతంలోకి తిరిగి రావడానికి ఆర్యసమాజం "శుద్ధి" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇంగ్లీషు భాషకు ప్రత్యామ్నాయంగా సంస్కృత భాషను దయానందుడు ప్రోత్సహించాడు. ఆర్యసమాజానికి ఉన్న బ్రిటిష్ వ్యతిరేకతను, అది చేపట్టిన సాంఘిక సంస్కరణలను మనం గుర్తిస్తూనే, మత మౌఢ్యాన్ని వ్యాపింపజేయడంలో ఆ సంస్థ పోషించిన పాత్రను స్పష్టంగా గమనించాలి.

రామకృష్ణ పరమహంస (1836–1886) విశ్వమతం అనే భావనను ముందుకు తెచ్చాడు. అతడి శిష్యుడైన **స్వామి వివేకానంద** (1862–1902) ఆ భావనను బాగా ప్రచారంలోకి తెచ్చాడు. పాశ్చాత్య దేశాల ప్రజలకు హిందూ మత విశిష్టతను వివరించడానికి వివేకానందుడు ఇంగ్లీషు లో అనేక గ్రంథాలు రచించాడు. 'వేదాంత తత్వం గురించి", " వేదాంతము, వివిధ దశలు", " వేదాంత తత్వం, క్రైస్తవం" 'ఆత్మస్వభావం, లక్ష్యం", "భారతదేశం, సమస్యలు" వంటివి వివేకానందుడి కొన్ని ముఖ్య రచనలు. భారతదేశంలోని మధ్య తరగతి వర్గం ఏ యే వైరుధ్యాల నడుమ చిక్కుకుపోయిందో, అవన్నీ వివేకానందుడి తాత్విక దృక్పథంలో ప్రతిఫలిస్తాయి. ఈ వర్గం ఆనాటికి బ్రిటిష్ వారితో పూర్తి స్థాయిలో ఘర్షణకు దిగేందుకు సిద్ధంగా లేదు. అదే సమయంలో ఫ్యూడల్ శక్తులతో తనకు తానుగా పోరాడే శక్తీ లేదు. బ్రిటిష్ వారి విధానాల ఫలితంగా వచ్చిపడుతున్న సరుకుల తాకిడికి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చితికిపోతూంటే దానిని అడ్డుకునే శక్తీ లేదు. తనంతట తానుగా ఒక కొత్త వ్యవస్థను నిర్మించగల సామర్థ్యమూ దానికి లేదు. ఇన్ని వైరుధ్యాలనూ ఏదో విధంగా సర్దుబాటు చేసుకుంటూ భారతీయ మధ్యతరగతివర్గం తాను ప్రముఖపాత్రను పోషించాలని కోరుకుంది.

వివేకానందుడి తాత్విక దృక్పథంలో మనకు ఇదంతా ప్రతిబింబిస్తుంది. భావవాదం, భౌతికవాదం రెండూ కలగలిపినది గా తన తాత్విక దృక్పథాన్ని వివేకానందుడు చూపించాలనుకున్నాడు. ఇందుకోసం తత్వశాస్త్రంలో అసలు ఏ మౌలికవైరుధ్యమూ లేదని ప్రకటించాడు! వేరు వేరు తాత్విక దృక్పథాలన్నీ సత్యాన్వేషణ లో దిగువస్థాయి నుండి ఎగువ స్థాయికి ఎక్కేందుకు ఉపయోగించే నిచ్చెన మెట్లవంటివి అన్నాడు. అందుచేత వాటి మధ్య వైరుధ్యం ఏమీ లేదన్నాడు. పదార్థమూ, చైతన్యమూ ఒకదానినుండి మరొకదానిగా మారుతాయన్న వింత ప్రతిపాదన చేశాడు. "పదార్థం

చైతన్యంగా మారుతుంది. అదే విధంగా కొన్ని సార్లు చైతన్యం కూడా పదార్థంగా మారుతుంది" అన్నాడు. మౌలికంగా వివేకానందుడు అద్వైత వేదాంతి. ఐతే భావవాది దేన్నైతే పరమాత్మ అని అంటాడో దానినే భౌతికవాది పదార్థం అంటాడు అని వ్యాఖ్యానించాడు. అద్వైతం ఈ ప్రపంచం అంతా మాయ అని అంటుంది. కాని వివేకానందుడు ఈ ప్రపంచ వాస్తవికతను అంగీకరించాడు. ప్రకృతి కొన్ని నియమాలను అనుసరించి నడుస్తుందని, ఆ నియమాలను మనం గౌరవించాలని అన్నాడు. కాని ప్రకృతికి ఉన్నట్టే సమాజానికి కూడా నియమాలు ఉంటాయని వివేకానందుడు గుర్తించకపోవడం విచిత్రం.

మానవుల అస్తిత్వం వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుందని మార్క్సిజం అంటుంది. కాని వివేకానందుడుదానికి భిన్నంగా చైతన్యమే అస్తిత్వాన్ని నిర్ణయిస్తుందని భావించాడు. దీనిని బట్టి వివేకానందుడు మౌలికంగా భావవాది అని మనం నిర్ధారించవచ్చు. ఇంగ్లాండు ఏవిధంగా పారిశ్రామికంగా బలమైన దేశంగా పురోగమిస్తోందో భారతదేశం కూడా ఆధ్యాత్మికంగా పురోగమిస్తుంది అన్నాడు. సమాజ పురోగమనంలో భౌతిక సంపద ఉత్పత్తి పోషించే కీలకమైన పాత్రను వివేకానందుడు గుర్తించలేదు.

అతడి తాత్విక దృక్పథంతో పోల్చితే సామాజిక దృక్పథం అభ్యుదయకరంగా ఉంటుంది. సోషలిజం రూపంలోనో, మరో రూపంలోనో ప్రజా రాజ్యం ఏర్పడడం అనివార్యం అని వివేకానందుడు ప్రకటించాడు. మరో సందర్భంలో, ఇన్నాళ్ళూ పాలితులుగా ఉన్నారు గనుక ఇప్పుడు పాలకులయే వంతు శూద్రులదే అన్నాడు. కాని వేరే సందర్భంలో కుల వ్యవస్థ అనేది సమాజంలో సహజంగా పరిణామం చెందిన వ్యవస్థ అంటూ దానిని సమర్థించాడు. మత క్రతువులను, ఆచారాలను కట్టు చెదరనీయరాదన్న అభిప్రాయాన్ని వివేకానందుడు తీవ్రంగా నిరసించాడు. అవన్నీ అర్థం లేనివని ఖండించాడు. ఆధునిక విజ్ఞానాన్ని యావత్తు ప్రజానీకమూ నేర్చుకోవాలని, అప్పుడే దేశం బలమైన రాజ్యంగా ఎదుగుతుందని చెప్పాడు. స్త్రీ సమానత్వాన్ని బలపరుస్తూ, వారిని అణచిపెట్టివుంచే అన్ని రకాల సామాజిక దురాచారాలనూ ఖండించాడు. పెట్టుబడిదారులకు ఉండే అంతులేని లాభాపేక్షను విమర్శించాడు. అన్ని మతాలమధ్యా ఐక్యత నెలకొనాలని బలంగా ప్రచారం చేశాడు. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని బలపరిచాడు.

వలసపాలకుల, ఫ్యూడల్ శక్తుల దోపిడీ నానాటికీ తీవ్రం కావడం, వలసపాలకుల పారిశ్రామికీకరణ లో ఉన్న సంక్లిష్టత, 1857లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం , పెరుగుతున్న రైతుల తిరుగుబాట్లూ ఈ నేపథ్యంలో మనం వివేకానందుడి తాత్విక దృక్పథాన్ని అధ్యయనం చేయాలి. భారతీయుల

ఆత్మగౌరవాన్ని బలంగా ఉద్బోధించిన వివేకానందుడి బోధనలు ఆ తర్వాత కాలంలో ఎందరో యువతీయువకులను జాతీయోద్యమంలో పాల్గనేందుకు ప్రేరణ అయ్యాయి. వివేకానందుడు చెప్పిన విశ్వమానవ మతం అనే భావనను అభ్యుదయ వాదులు హిందూత్వ విద్వేష రాజకీయాలను తిప్పికొట్టడానికి సాధనంగా ఉపయోగించాలి. ఈ హిందూత్వ వాదులు తామే వివేకానందుడికి వారసులం అని చెప్పుకోడానికి ప్రయత్నిస్తున్నారు. ఆ ప్రయత్నాలను తిప్పికొట్టాలి. కరువువాత బడి ఆకలి చావులు ఛస్తున్న సాటి మానవులను ఆదుకోకుండా గోరక్షణ ఉద్యమాన్ని నడుపుతున్నందుకు వారిని వివేకానందుడు తీవ్రంగా విమర్శించాడు. మానవులకన్నా పశువులకు ఎక్కువ విలువ ఇవ్వడాన్ని దుయ్యబట్టాడు. మనుస్మృతి లో చెప్పినదానికి భిన్నంగా వివేకానందుడు శూద్రులు రాజ్యాధికారం చేపట్టాలని అభిలషించాడు.

ఈ సంస్కరణోద్యమాలన్నీ హిందూ సమాజంలోని కొన్ని సామాజిక దుర్లక్షణాలను, చెడు సాంప్రదాయాలను వదలగొట్టాలని ప్రయత్నించినప్పటికీ, అవేవీ మౌలికమైన బ్రాహ్మణవాద భావజాల పునాదుల్ని సవాలు చేయలేదు. ప్రజాబాహుళ్యం అనుభవిస్తున్న ఆర్థిక దుస్థితికి మూలకారణం ఏమిటన్నది శోధించడం మీద దృష్టి పెట్టలేదు. దానికి బదులు ఆ ప్రజానీకాన్ని కదిలించేందుకు మత విశ్వాసాలను, సాంప్రదాయాలను ఉపయోగించుకోడానికి ప్రయత్నించారు.

## విప్లవాత్మక సంస్కరణ ఉద్యమాలు

పైన చెప్పుకున్న ఉద్యమాలకు భిన్నంగా ఫూలే, అంబేద్కర్, పెరియార్ రామస్వామి, (తమిళనాడు) నారాయణ గురు, అయ్యప్పన్, అయ్యంకలి (కేరళ) భాగ్యరెడ్డివర్మ (ఆంధ్ర) మంగూరామ్, ఛోటూ రామ్ (పంజాబ్)అచ్యుతానంద్, రామ్‌చరణ్ ( ఉత్తరప్రదేశ్) హరి చంద్ర ధాకు, యురు చంద్ర, జోగేంద్ర మండల్ (బెంగాల్)సోనాదన్ సేనాపతి (అస్సాం) వంటి సంస్కర్తలు నడిపిన ఉద్యమాలు విప్లవకర స్వభావం కలిగినవి. వారంతా నేరుగా కుల వ్యవస్థను ఢీ కొన్నారు. సనాతన ధర్మాన్ని కాని, ప్రాచీన మత గ్రంధాలను కాని బలపరలేదు, వాటిని ఉపయోగించలేదు. పశ్చిమ, దక్షిణ భారతం లో కూడా బలమైన సాంఘిక పునరుజ్జీవన ఉద్యమాలు నడిచాయి.

**జ్యోతిరావు ఫూలే :** (1827–1890) ఫూలే అటువంటి వైతాళికులలో ఒకడు. 19వ శతాబ్దం నాటికే దేశంలో అందరికీ విద్యాహక్కు ఉండాలని వాదించిన మొదటి సంస్కర్త అతడు. మనుస్మృతి అత్యధిక ప్రజానీకాన్ని నిరక్షరాస్యత లో మగ్గిపోమని నిర్దేశించింది. మహిళలను విద్యకు దూరంగా ఉంచింది. మరోపక్క బ్రిటిష్ పాలకులు

తమ వలసపాలనకు అనుకూలంగా నడుచుకునేవిధంగా భారతీయులను తయారు చేయడానికి వారి విద్యావిధానాన్ని అమలు చేయసాగారు. ఆ సమయంలో పూలే దేశంలోనే బాలికలకు, తన భార్యకు ఒక పాఠశాలను ప్రారంభించాడు. కుల వ్యవస్థను బలంగా వ్యతిరేకించి జీవితాంతమూ కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాడు.

**నారాయణ గురు** (1856-1928) ఇతడిని కేరళ సామాజిక పునరుజ్జీవనానికి మూలపురుషుడిగా పరిగణిస్తారు. ప్రపంచమంతా ఒకే మతం ఉండాలని అతడు పిలుపునిచ్చాడు. ఈ ప్రపంచం ఒకటే., మానవులందరూ సహచర జీవులే. కనుక ఒకే దైవం ఉండాలి, అని ప్రకటించాడు. 'ఒకే దేశం, ఒకే మతం, ఒకే సంస్కృతి' అంటూ ఇతర మతాలకు సమాన ప్రాతిపదికను నిరాకరిస్తున్న నేటి హిందూత్వ శక్తుల వైఖరికి నారాయణ గురు అవలంబించిన వైఖరికి ఎంత తేడా ఉందో గమనిస్తే నేటి పరిస్థితుల్లో హిందూత్వ భావజాలాన్ని తిప్పికొట్టడానికి నారాయణ గురు బోధనలు బాగా ఉపయోగపడగలవని విదితమౌతుంది. కుల వ్యవస్థ పూర్తిగా పోవాలని అతడు ప్రకటించనప్పటికీ, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాడు. ముఖ్యంగా అంటరానితనాన్ని చాలా గట్టిగా ఎదిరించాడు. ఆ క్రమంలో పలు వేధింపులను ఎదుర్కొన్నాడు. బ్రాహ్మణ సాంప్రదాయవాదుల్ని సవాలు చేస్తూ తానే స్వయంగా ఒక శివాలయాన్ని నిర్మించాడు. "మతం ఉన్నది మనిషి కోసం. అంతేగాని మనిషి ఉన్నది మతం కోసం కాదు" అని ప్రకటించాడు. ప్రజాబాహుళ్యానికి విద్య గరపవలసిన ఆవశ్యకతను నొక్కిచెప్పాడు. కేరళ లో గ్రంధాలయోద్యమానికి తొలిబాటలు వేసినది నారాయణ గురు.

**కందుకూరి వీరేశలింగం** (1848-1919) ఆధునిక తెలుగుసమాజ వైతాళికుడు గా కందుకూరి పేరు పొందాడు. ఆధునిక దృక్పధాన్ని అనుసరించాలని ప్రచారం చేయడమే కాకుండా దానిని అమలు చేయడానికి పూనుకున్నాడు. ఎన్నికష్టానైనా ఓర్చాడు. అనేక వితంతు పునర్వివాహాలను స్వయంగా నిర్వహించాడు. ఆ దంపతుల కుటుంబాలు స్థిరపడేలా తోడ్పడ్డాడు. విద్యాసంస్థలను ప్రారంభించి వాటిలో బాలికలకు ప్రవేశం కల్పించాడు. ఆయన భార్య అతడికి అన్నివిధాలుగా ఉద్యమాల్లో తోడుగా వ్యవహరించారు. శకునాలు, హస్తసాముద్రికం, దెయ్యాలు, చేతబడులు ఉన్నాయన్న మూఢ నమ్మకాలు వంటి అంధవిశ్వాసాలను ఎండగడుతూ శక్తివంతంగా ప్రచారోద్యమం నిర్వహించాడు. వాడుకభాషలో ఒక వార్తాపత్రికను ప్రారంభించాడు. దాని ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని, ఆధునిక విజ్ఞానాన్ని ప్రచారం చేశాడు. ఐతే ప్రత్యేకించి వీరేశలింగం కుల వ్యవస్థను సవాలు చేయలేదు.

**డా. బి.ఆర్.అంబేద్కర్** (1891–1956) కులవ్యవస్థకు వ్యతిరేకంగా కుల నిర్మూలన లక్ష్యం కోసం జీవితాంతమూ కృషి చేశాడు. కేవలం అంటరానితనాన్ని నిర్మూలిస్తే సరిపోదని, సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ ప్రాతిపదికగా భారతీయ సమాజాన్ని మొత్తంగా పునర్నిర్మించాల్సివుందని అంబేద్కర్ బోధించాడు. అదే సమయంలో రాజ్యాంగ బద్ధంగా అణగారిన తరగతుల అభ్యున్నతి సాధించడానికి ఆయన ప్రయత్నించాడు. ఏదో ఒక రూపంలో మతం ఉండడం అవసరం అని అంబేద్కర్ భావించాడు. తన జీవితపు చివరి దశలో కులవ్యవస్థ కబంధ హస్తాలనుండి విముక్తి పొందాలంటే బౌద్ధమతాన్ని స్వీకరించడం పరిష్కారం అనుకుని 1956లో బౌద్ధాన్ని స్వీకరించాడు. అంబేద్కర్ తాత్విక దృక్పథం ఉపయోగితావాదం (ప్రాగ్మాటిజమ్) అని అనవచ్చు. అది భావవాదపు ఒక ధోరణే తప్ప మరొకటి కాదు.

## 10. జాతీయోద్యమం

బ్రిటిష్ వలస పాలకులు దేశ సంపదను కొల్లగొట్టడంతో బాటు ఇక్కడ రైతాంగాన్ని, కార్మికులను కూడా దోపిడీ చేయడంతో శ్రమజీవులలో అసంతృప్తి పెరగసాగింది. ఈ అసంతృప్తి ఒక పోరాటరూపం తీసుకోకమునుపే దానిని పక్కదోవ పట్టించాలనుకున్న బ్రిటిస్ పాలకులు అందుకోసం మతాన్ని, కులాన్ని సాధనాలుగా ఉపయోగించబూనుకున్నారు. మత ప్రాతిపదికన బెంగాల్ ను విభజించడం అటువంటి ఒక ఎత్తుగడ. ఈ ఎత్తుగడలకు అనుగుణంగానే 1906 లో ముస్లిం లీగ్, 1913లో హిందూ మహాసభ ఏర్పడ్డాయి.

భారత జాతీయ కాంగ్రెస్ అప్పటికి ఇంకా తీర్మానాలను చేయడం, మహజర్లు సమర్పించడం వంటి కార్యక్రమాలకే పరిమితమై ఉంది. కార్మికవర్గం ట్రేడ్ యూనియన్లుగా ఏర్పడడం ప్రారంభమైనప్పటికీ అప్పటికప్పుడు ప్రతిస్పందించే పోరాటాలు చేయడానికే పరిమితంగా ఉంది. తన వర్గ సిద్ధాంతం అయిన కమ్యూనిజం భారత కార్మికవర్గానికి ఇంకా చేరలేదు.

జాతీయోద్యమపు తొలి తరం నేతలలో ప్రముఖుడు **బాలగంగాధర తిలక్** (1856–1920) ప్రజానీకాన్ని జాతీయోద్యమంలోకి సమీకరిచండానికి రామాయణాన్ని, భగవద్గీతను ఒక నూతన పద్ధతిలో వ్యాఖ్యానించడానికి పూనుకున్నాడు. గీత లో బోధించిన కర్మ యోగాన్ని తన రాజకీయ కార్యకలాపాలను సమర్థించుకోడానికి అనుకూలంగా వ్యాఖ్యానించాడు. అన్నింటినీ విడిచిపెట్టి విరాగిలా జీవించే ధోరణిని తిలక్ తిరస్కరించాడు.

వైరాగ్యానికి మూలం మాయావాదంలో ఉంది. ఆ మాయావాదాన్ని తిలక్ వ్యతిరేకించాడు. "ఆత్మ సాక్షాత్కారం పొందడం", "తనలో తాను అంతర్ముఖుడై దైవాన్ని అన్వేషించడం" కోసం ధ్యానించడం వంటి పద్ధతులను తిరస్కరించాడు. ఆ పద్ధతులు పలాయనవాదమే ఔతాయని, దేశం, ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను గమనించాలని తిలక్ కోరాడు. సామాజిక పరివర్తనలో సామాన్య ప్రజానీకం పోషించే కీలక పాత్రను గ్రహించాలని అన్నాడు. బ్రిటిష్ పాలకులను దేశం నుండి తరిమివేయగల శక్తి ఆ ప్రజలకే ఉందన్న వాస్తవాన్ని గుర్తించాలని కోరాడు.

తిలక్ తాత్విక దృక్పథం నిస్సందేహంగా జాతీయోద్యమాన్ని బలోపేతం చేయడానికి దోహదం చేసింది. కాని తిలక్ పోషించిన పాత్ర బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా, హిందువులకు అనుకూలంగా ఏకకాలంలో పని చేసింది. తిలక్ రాజకీయంగా ఎంత విప్లవవాదో, సామాజికంగా అంత మితవాది.

తిలక్ తాత్విక దృక్పథంలో తీవ్ర పరిమితులు ఉన్నాయి. ప్రజానీకాన్ని ఉద్యమాలలోకి కదిలించడానికి మతాన్ని సాధనంగా వాడుకోడానికి ప్రయత్నించాడు. అదే సమయంలో పురుషాధిక్యతకు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగే సామాజిక సంస్కరణలను తీవ్రంగా వ్యతిరేకించాడు.

తిలక్ ప్రధానంగా ప్రజా పోరాటాలమీద దృష్టి పెట్టినందువల్ల అతడు జాతీయోద్యమ నేతల్లోకెల్లా ఆ కాలంలో ముందు నిలిచాడు. ఇతడికి పూర్తి వ్యతిరేక దిశలో మరొక 'తీవ్రవాది' గా బయలుదేరిన అరబిందో జీవిత ప్రయాణం సాగింది.

**అరబింద ఘోష్** (1873–1950) మొదట ఒక విప్లవకారుడిగా ఉండేవాడు. బ్రిటిష్ పాలకులను పారదోలడానికి సాయుధపోరాటమే మార్గం అని బలంగా విశ్వసించాడు, ప్రబోధించాడు. అతడు రూపొందించిన 'సమగ్ర మానవత్వం' (ఇంటిగ్రల్ హ్యూమనిజం) సారాంశం భావవాదం. అందులో పొసగని అనేక భావనలు ఉన్నాయి. అరబిందో సిద్ధాంతం ప్రకారం అద్వైతం, విశిష్టాద్వైతం, భావవాదం, భౌతికవాదం, ఏకేశ్వరోపాసన, బహుళదేవతారాధన –ఇలా పలు రకాల తాత్విక దృక్పథాలు ఉండడానికి కారణం అవన్నీ అసంపూర్ణమైన, పాక్షికమైన అవగాహన కలిగివుండడమే. తాను ప్రతిపాదించిన సమగ్ర మానవత్వం అటువంటి పాక్షికత ఏమీ లేకుండా పరమాత్మను సమగ్రంగా వివరిస్తుంది అని చెప్పాడు. పదార్థం, చైతన్యం అనేవి ఈ పరమాత్మకున్న రెండు పార్శ్వాలేనన్నాడు.

అతడు సత్ (అంటేపరమాత్మ సత్యం) చిత్ (పరమాత్మ సంపూర్ణ జ్ఞాన స్వరూపం) ఆనంద (పరమాత్మ అంటే ఆనందమే) అని ప్రతిపాదించినది వేదాంత దర్శనాన్ని మరో విధంగా చెప్పడమే. అటువంటప్పుడు దానికి ఒక కొత్త పేరు, ఒక

కొత్త వ్యాఖ్యానం కల్పించాల్సిన అవసరం ఏమొచ్చింది? అరబిందో ప్రజానీకాన్ని పోరాటాల్లోకి తీసుకురావడానికి మతాన్ని ఒక సాధనంగా ఉపయోగించదలిచాడు. ఆ ప్రజలు వేరు వేరు మతాలుగా, శాఖోపశాఖలుగా చీలిపోయివున్నందున అందరినీ కలిపేందుకు సమగ్ర మానవత్వం భావాన్ని ప్రతిపాదించాడు. కాని చివరికి అతడి దృష్టి ప్రజా ఉద్యమాలవైపు నుండి భావవాద అవగాహనవైపు దారి మళ్ళింది. అతడు ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని జాతీయోద్యమంతో సంబంధాలు కొనసాగించకుండా దూరంగా మిగిలిపోయాడు.

అరబిందో బోధనల్లో కొన్ని ఆసక్తికరంగా ఉంటాయి. 20వ శతాబ్దాన్ని అతడు 'జాతిరాజ్యాల శతాబ్దం' గా ప్రకటించాడు. జాతీయ విముక్తి ఉద్యమాల ద్వారా ఆ జాతిరాజ్యాలు ఏర్పడతాయని అన్నాడు. ప్రస్తుతం ఏర్పడిన వివిధ మానవ సమూహాలు అన్నీ లోపభూయిష్టమైన విధంగా ఏర్పడ్డాయని, ఆ కారణంగానే ఒకపక్క పేదరికం, అవిద్య, అన్ని రకాల వివక్షత చోటు చేసుకుంటే మరోపక్క లాభాలను పెంచుకోడానికి తాపత్రయం పెరిగిపోతోందని అన్నాడు. ఆయా చారిత్రిక సందర్భాలలో వివిధ సామాజిక వర్గాలు పోషించే పాత్రలను అరబిందో గుర్తించడంలో విఫలమవడమే ఈ తరహా సూత్రీకరణలకు దారి తీసింది. హేతుబద్ధమైన, భౌతికవాద దృక్పథం కారణంగానే వ్యక్తిగత ఆస్థి ప్రాతిపదికమీద సమాజం నిర్మించబడిందన్నాడు. ఈ పరిస్తితిని అధిగమించగలిగేది ఆధ్యాత్మికచింతన ద్వారా మాత్రమేనని , ఆ చింతనకు సరి తూగగల ఆర్థిక వ్యవస్థ సోషలిజం మాత్రమే (!) నని తెలిపాడు.

ప్రజానీకం అందరూ కలిసికట్టుగా సామాజిక మార్పు కోసం ఉద్యమించాలని పిలుపునివ్వడం పోయి పరమాత్మ సమగ్ర స్వరూపాన్ని తెలుసుకోడానికి ప్రతీవారూ వ్యక్తిగతంగా తనలో తాను అంతర్ముఖంగా అన్వేషించాలని చెప్పాడు. అందుకోసం యోగా మార్గం అని తెలిపాడు. అంతిమంగా అతడు జాతీయోద్యమం నుండి దూరంగా మళ్ళాడు. శాస్త్ర విజ్ఞానాభివృద్ధిని అతడు ఉత్సాహంగా ఎప్పటికప్పుడు స్వాగతించినా, ఆ అభివృద్ధిని భావవాద దృక్పథం నుండే విశ్లేషించాడు. స్వేచ్ఛ, సమానత్వం, ప్రజాస్వామ్యం వంటి భావనలను బలంగా సమర్ధించాడు. ఫ్యూడలిజాన్ని గట్టిగా వ్యతిరేకించాడు. దానితోబాటు కుల వ్యవస్థను, మతాల్లోని అంధవిశ్వాసాలను ఖండించాడు. అదే సమయంలో కమ్యూనిజాన్ని కూడా బలంగా వ్యతిరేకించాడు !

అరబిందో లోని మానవత్వాన్ని అతడి భావవాద దృక్పథం వెనక్కి నెట్టింది. దానికి పూర్తి భిన్నంగా టాగూరులోని మానవత్వం అతడిలోని భావవాద దృక్పథాన్ని వెనక్కి నెట్టింది. ఎలాగో చూద్దాం.

**రవీంద్రనాథ టాగూరు** (1841-1941) జీవితం గురించి, అతడి వ్యక్తిత్వం గురించి ప్రత్యేకంగా వివరించనవసరం లేదు. ఇక్కడ మనం అతడి తాత్విక దృక్పధానికి పరిమితం ఔదాం.

స్వతహాగా టాగూరు భావవాది. ఐతే ఉపనిషత్తుల్లోని మాయావాదానికి ఆయన చాలా దూరం. అరబిందో చెప్పిన సత్, చిత్, ఆనంద అన్న పదాలకు రవీంద్రుడు పూర్తిగా భిన్నమైన భాష్యం చెప్పాడు. సత్ అంటే మన చుట్టూ ఉన్న వాస్తవ ప్రపంచం, దాని వివిధ రూపాలు. చిత్ అంటే ప్రకృతిలోని అన్ని పదార్థాల గురించి, వాటిలో జరిగే మార్పుల గురించిన జ్ఞానం. అటువంటి జ్ఞానాన్ని పొందడం సాధ్యమే. ఆనంద అంటే ఆ విధంగా పొందిన జ్ఞానాన్ని మన చుట్టూ ఉన్నవారికి ఆనందం కలిగించడం కోసం ఉపయోగించడం.

రవీంద్రడు జాతీయోద్యమాన్ని చురుకుగా బలపరిచాడు. అతడు ఫక్తు ప్రజాస్వామ్యవాది. అతడి ప్రసిద్ధ కావ్యం గీతాంజలి, ఇతర రచనలు భగవంతుడికి నివేదించుకునే రూపంలో ఉన్నప్పటికీ, వాటిలో వాస్తవ ప్రపంచంలో ఉన్న సమస్యల గురించి, ఈ ప్రపంచాన్ని ఆనందమయంగా చేయడం గురించి ప్రధానంగా రాశాడు. శాస్త్ర విజ్ఞానం పట్ల రవీంద్రుడికి చాలా మక్కువ. పాఠశాల విద్యార్థులకు జీవశాస్త్రం మీద అతడు ఒక పుస్తకాన్ని రాశాడు. ప్రకృతిలో స్వత:సిద్ధంగా ఉన్న వైరుధ్యాల గురించి అతడు పేర్కొన్నాడు. అది అతడి వైఖరిని ప్రతిఫలిస్తుంది. సౌందర్యాభిరుచి కి సంబంధించి అతడి ఆలోచనలు విశిష్టమైన అతడిఅవగాహనను తెలియజేస్తాయి. "ప్రకృతి కార్య, కారణ సంబంధాల ప్రాతిపదికన నడుస్తుంది. వినడానికి ఇది ఇనుపసంకెళ్ళతో మనని కటివేసినట్టు అనిపిస్తుంది. కాని ఒక కవి అదే ప్రకృతిలోని సౌందర్యాన్ని అనుభవించినప్పుడు ఆ సంకెళ్ళ చప్పుడు అతడి గుండెల్లో శ్రావ్యమైన సంగీత స్వరాలుగా వినిపిస్తుంది" అన్నాడు రవీంద్రుడు. వాస్తవికతకు, సృజనాత్మకతకు నడుమ ఉన్న సంబంధం గురించి వివరించడానికి ఒక పువ్వు ను ఉదాహరణగా తీసుకున్నాడు.

"మొక్కకు పూచిన పువ్వు ఎంత సుకుమారంగా, అందంగా ఉన్నప్పటికీ, అది వెదజల్లే వాసన, ఆ పూరెక్కల వింత సోయగం అన్నీ ఒక ప్రయోజనం కోసం ఉన్నాయి. కీటకాల్ని ఆకర్షించి ఫలదీకరణం చెంది ఆ పూవు ఒక పిందెగా, కాయగా, పండుగా మారి ఆ మొక్క జాతిని తిరిగి పుట్టించడానికి తోడ్పడాలి. ఒకసారి తేనెటీగ ఆ పువ్వుపై వాలి, ఫలదీకరణం జరిగిన తర్వాత ఆ సువాసనగాని, పూరేకులు గాని ఉండవు. వాటి అవసరం తీరిపోయింది. మొక్క ఇంకెంతమాత్రమూ ఆ పువ్వు సువాసనను, రంగుల రేకలను పరిరక్షించజాలదు. అది దాని జీవితపు నిర్దాక్షిణ్యత.

అదే పువ్వు కళాకారుడి హృదయంలోకి ప్రవేశించగానే మొత్తం మారిపోతుంది. మొక్క ఏ అవసరం కోసం ఆ పూవును పూచిందో కళాకారుడి గుండెకు, సృజనకు అవసరం లేదు. అందుకే అతడి గుండెలో ఆ పూవు ఎప్పుడూ వాడిపోదు. రెక్కలు రాలిపోవు. ప్రశాంతతకు, ఆనందానికి సంకేతంగా ఆ పువ్వు కళాకారుడి సృజనలో నిలిచిపోతుంది"

"కళ కళ కోసమే" అన్న బూర్జువా నినాదాన్ని రవీంద్రుడు ఘాటుగా విమర్శించాడు. మానవజాతి అవసరాలను నెరవేర్చడమే కళ ప్రయోజనం అని స్పష్టంగా ప్రకటించాడు. సమాజ పురోగతికి తోడ్పడడం కళ కు లక్ష్యంగా ఉండాలి అని చెప్పాడు. 1930లో రవీంద్రుడు సోవియట్ యూనియన్ ను సందర్శించాడు. అప్పటి సోషలిస్టు సమాజం అక్కడ సాధించిన విజయాలను చూసి చాలా ఉత్తేజం పొందాడు. ఆ విధంగా రవీంద్రుడి లోని అసలైన మానవుడు అతడి లోని "భావవాద తత్వవేత్త" ను వెనక్కి నెట్టివేశాడు.

**మహాత్మా గాంధీ** (1868–1948) జాతీయోద్యమానికి సారధి. ఇప్పటివరకూ మనదేశంలో పుట్టిన నేతలందరికన్నా సామాన్య ప్రజానీకాన్ని అత్యంత ప్రభావశీలంగా నడిపించిన మహా నాయకుడు. కాబట్టి ప్రతీవొక్కరూ, ఆఖరికి అతడిని హత్య గావించి, ఆ మరణాన్ని ఆస్వాదించి, అతడిని హత్య చేసిన గాడ్సే ను ఆకాశానికి ఎత్తిన ఆరెస్సెస్ కూడా, గాంధీ కి తామే వారసులం అని ప్రకటించుకోడానికి ప్రయత్నిస్తారు. (కామ్రేడ్ ఇఎంఎస్ రచించిన "మహాత్ముడూఅతడి సిద్ధాంతం" అన్నగ్రంథంలో చాలా మేధావంతంగా జాతీయోద్యమంలో గాంధీ పాత్ర గురించి, అతడి వర్గ అవగాహన గురించి, అతడి తాత్వికత గురించి రాశారు. అది తప్పక చదవవలసిన గ్రంథం) ఇక్కడ గాంధీ తాత్విక దృక్పథం గురించి క్లుప్తంగా చర్చిద్దాం.

(అ) చుట్టుపక్కల ప్రపంచం లో కమ్యూనిజం, సోషలిజం, జాతీయవాదం, శాస్త్రవిజ్ఞాన పురోగతి వేగంగా వ్యాపిస్తున్న తరుణంలో, ఆధునిక, విప్లవకర సైద్ధాంతిక భావజాలపు గాలులు వీస్తున్న కాలంలో గాంధీ మితవాదపు సనాతన ధర్మాన్ని ఎంచుకున్నాడు.

(ఆ) ఆ కాలంలో పలు ప్రజా ఉద్యమాల వెల్లువలు తలెత్తాయి. వాటిలో కార్మికులు, రైతులు, మధ్యతరగతి ఎక్కువగా పాల్గనేవారు. ఆ ఉద్యమాలన్నింటిలోనూ గాంధీ పాలు పంచుకున్నాడు. అతడు సనాతన ధర్మాన్ని విశ్వసించినా, ప్రజా ఉద్యమాలకు దూరంగా ఎన్నడూ ఉండిపోలేదు.

(ఇ) వాటిలో పలు ఉద్యమాల్లో గాంధీ నాయకత్వ పాత్రను సైతం పోషించాడు.

(ఈ) అదే సమయంలో ఆ ప్రజాబాహుళ్యం లో గాంధీ తన సనాతన ధర్మాన్ని ప్రచారం చేశాడు.

ఇవే గాక గాంధీ తత్వం లో మరికొన్ని చెప్పుకోదగ్గ అంశాలు కూడా ఉన్నాయి. గాంధీ వేదాలను గౌరవించాడు కాని అవి దైవ వాక్కులు అని ఒప్పుకోలేదు. మత గ్రంథాలను విశ్వసించాడుకాని వాటిలో ఉండే హేతువిరుద్ధమైన, అనైతికమైన విషయాలను గాంధీ బలంగా వ్యతిరేకించాడు. మత గ్రంథాలను, ధర్మశాస్త్రాలను వివరించడానికి, వ్యాఖ్యానించడానికి అధికారం కేవలం పీఠాధిపతులకు మాత్రమే ఉందన్న వాదనను అతడు తిరస్కరించాడు. అంటరానితనాన్ని బలంగా వ్యతిరేకించాడు కాని "శుద్ధి చేయబడ్డ" కుల వ్యవస్థ మంచిదేనని భావించాడు. ఒకపక్క గోవును పూజిస్తూ మరోపక్క సాటి మానవులనే అంటరానివారుగా పరిగణించడం మనకు ఏ విధంగా స్వాతంత్ర్యాన్ని సాధించగలుగుతుంది? అని ప్రశ్నించాడు. రాముడు ఒక చారిత్రిక వ్యక్తి అన్న అభిప్రాయాన్ని గాంధీ తిరస్కరించాడు. ఒకవేళ పురాణాన్నే గనుక వాస్తవ చరిత్రగా పరిగణించాలంటే అప్పుడు రామాయణం ఉండవలసిన సరైన స్థలం చెత్తకుప్ప మాత్రమే అని ప్రకటించాడు. గాంధీ గురించి ఇఎంఎస్ విశ్లేషణ ఈ విధంగా ఉంది:

(అ) తాత్వికంగా చూసేత గాంధీ ఒక భావవాది. బలంగా భౌతికవాదాన్ని వ్యతిరేకించాడు, అంతకన్నా ఎక్కువగా గాంధీ విలువలకు ప్రాధాన్యతనిచ్చాడు. సత్యం, అహింస, త్యాగం వంటి నైతిక విలువలకు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం, శాంతి వంటి రాజకీయ విలువలకు, కులవివక్షత నిర్మూలన, మహిళా సమానత్వం, మత సామరస్యం వంటి సామాజిక విలువలకు ఆయన అత్యంత ప్రాధాన్యతనిచ్చాడు. తన జీవితాంతమూ వాటికి కట్టుబడ్డాడు.

(ఆ) తాను నమ్మిన విలువలను ఆచరించిన కారణంగానే గాంధీ ప్రజానీకానికి చేరువ కాగలిగాడు. దానితోబాటు అతడి వ్యక్తిగత జీవిత శైలి అతడిని ప్రజలకు ప్రియమైన నాయకుడిని చేసింది. జాతీయోద్యమం బూర్జువా వర్గ నాయకత్వంలో నడిచింది. ఆ వర్గం భూస్వామ్య వర్గానితో పెనవేసుకునివుంది. జాతీయోద్యమానికి వేడి, ఉధృతి రావాలంటే సాధారణ ప్రజానీకం కదలాలి. అదే సమయంలో బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు ముప్పు వాటిల్లకూడదు. ఇది బూర్జువావర్గ అవసరం. ఆ అవసరాన్ని గాంధీ నెరవేర్చాడు.

వర్తమానంలో హిందూత్వ శక్తులు సమాజాన్ని మతవిద్వేష మయం చేయడానికి పూనుకున్నాయి. ఫాసిస్టు తరహా పాలనను రుద్దుతున్నాయి. అత్యంత తిరోగమన భావాలను మతం పేరుతో ప్రజలమీద రుద్దుతున్నాయి. సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు దాసోహం అంటున్నాయి. ఈ సమయంలో గాంధీ బోధించి,

ఆచరించిన నైతిక, రాజకీయ, సామాజిక విలువలు ప్రజాస్వామ్య, లౌకిక శక్తులు నడిపే పోరాటానికి చాలా ఉపయోగపడతాయి.

## 11. బడా బూర్జువాభూస్వామ్య పాలన

స్వతంత్ర భారత దేశ తొలి ప్రధాని **జవహర్‌లాల్ నెహ్రూ** (1889–1964) భారతీయ తత్వ శాస్త్రం మానవాతీత శక్తుల పట్ల భ్రమలనుంచి, పరలోకపు భావాల పట్టు నుంచి బైటపడాలని, వాస్తవికత పునాది మీద నిలవాలని పిలుపిచ్చాడు. తత్వశాస్త్రం శాస్త్ర విజ్ఞాన పురోగతితో పెనవేసుకుని నడవాలని, దేశం ఎదుర్కొంటున్న వాస్తవ సవాళ్ళను, ప్రజల అవసరాలను తీర్చే లక్ష్యంతో ఉండాలని ఆయన కోరాడు. చరిత్ర ఎన్నడూ వెనక్కి నడవదని, కను మళ్ళీ వేదకాలానికి పోవాలనో, ఇస్లామిక్ రాజ్యాల కాలానికి పోవాలనో ప్రబోధించడం దండగమారి పని అని అన్నాడు. తన తాత్విక దృక్పథం మీద మార్క్సిజం ప్రభావం ఉందని నెహ్రూ అంగీకరించాడు.

మన దేశపు మొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతిగా వ్యవహరించిన **డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్** (1888–1975) తత్వవేత్తగా, అధ్యాపకుడిగా పేరుగాంచారు. అతడి తాత్విక దృక్పథం పునాదులు అద్వైతం లో ఉన్నాయి. వర్తమాన కాలానికి ఆ దృక్పథాన్ని అన్వయించడానికి ఆయన ప్రయత్నించాడు. ఉపనిషత్తుల్లోని భావవాదాన్ని బలంగా సమర్థిస్తూనే, భారతదేశం బలంగా ఎదగాలంటే దేశంలో విద్యావ్యవస్థ బలంగా ఏర్పడాలి అని ఆయన సూచించాడు. భారతదేశంలో శాస్త్రీయ విద్యావిధానాన్ని రూపొందించడంలో గాని, శాస్త్ర పరిశోధనలను ప్రోత్సహించడంలో గాని అతడి అద్వైత తాత్విక దృక్పథం ఏనాడూ ఆటంకం కాలేదు.

ఐతే బడా బూర్జువా నాయకత్వాన నడిచే ప్రభుత్వం భూస్వామ్యవర్గంతో చెట్టపట్టాలేసుకుని వ్యవహరిస్తున్నప్పుడు ఆ ప్రభుత్వం సామాన్య ప్రజానీకంలో శాస్త్రీయ భావజాలాన్ని వ్యాపింపజేసే కర్తవ్యాన్ని నెరవేర్చగలదని  ఆశించడం తెలివితక్కువే ఔతుంది.

ఆచార్య జగదీశ్ చంద్రబోస్, పి.సి.రే, సర్ సి.వి.రామన్ వంటి ప్రపంచ ప్రఖ్యాతి గడించిన శాస్త్రవేత్తలు 20వ శతాబ్దపు తొలి అర్ధభాగం నాటికే భారతదేశంలో ఉన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ ను స్థాపించారు. కాని మన దేశంలోని పాలకవర్గాలు సామాన్య ప్రజానీకంలో శాస్త్రీయ దృక్పథాన్ని పాదుకొల్పడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. అలా చేసివుంటే, అప్పుడు ప్రజల్లో నిబిడీకృతమై ఉన్న విజ్ఞాన దాహం తీరి శాస్త్ర విజ్ఞానాన్ని, కొత్త

సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని దానిని ఉపయోగించి ఉన్నత స్థాయికి మన దేశాన్ని తీసుకుపోయివుండేవారు. అది ఉత్పత్తి శక్తుల పురోగతికి ఎంతగానో తోడ్పడివుండేది. కాని పాలకవర్గాలు ఆ కర్తవ్యాన్ని నెరవేర్చనూ లేదు, అటు భూస్వామ్య సంబంధాలనూ నాశనం చేయలేదు. దానివలన ప్రజలు మూఢ విశ్వాసాలకు, దుస్సాంప్రదాయాలకు బందీలుగా కొనసాగారు. ఆ విధంగా బూర్జువా–భూస్వామ్య వర్గ పాలన దేశంలో శాస్త్రీయ భావజాల పురోగతికి పెద్ద ఆటంకంగా నిలిచింది. నేటికీ మనం మతమౌఢ్యం, మూఢాచారాల పాటింపు, కుల వివక్షత, పురుషాధిక్యత కొనసాగడం, వాటిని బలపరిచే సాంప్రదాయాలు అమలు కావడం చూస్తున్నాం. అందుచేత ప్రజానీకంలో అత్యధిక భాగం అత్యంత వెనుకబడిన ఆ పుచ్చు భావజాలం ప్రభావంలో కొనసాగుతున్నారు. విద్యా రంగంలో, సైన్సులో, సంస్కృతిలో, సాంకేతికతలో కొంత పురోగతి సాధించినప్పటికీ భావజాల రంగంలో పరిస్థితి మాత్రం ఇదే.

**నయా ఉదారవాద శకం**లో మనం రెండు పరస్పర విరుద్ధ ధోరణులను చూస్తున్నాం. పెద్ద ఎత్తున కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. సమాచారరంగంలో వచ్చిన పెను మార్పుల ఫలితంగా తక్కిన ప్రపంచంతో సంబంధాలు విస్తృతమౌతున్నాయి. అదే సమయంలో అంధవిశ్వాసాలు, కుల తత్వం, మత పరమైన కార్యకలాపాలు, ఉత్సవాల నిర్వహణ అనేక రెట్లు పెరిగాయి. 2007 లో అభివృద్ధి చెందుతున్న సమాజాల అధ్యయన కేంద్రం వారు నిర్వహించిన సర్వేలో భారతీయులలో మతపరంగా భక్తిశ్రద్ధలు 30 శాతం మేరకు పెరిగాయని వెల్లడైంది. అందులోనూ ఈ పెరుగుదల గ్రామీణ ప్రాంతాలలో కన్నా పట్టణ ప్రాంతాలలోనే ఎక్కువౌతున్నట్టు ఆ సర్వే నిర్ధారించింది. 1980 నాటికి దేశరాజధాని ఢిల్లీలో దేవాలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు వంటి ప్రార్థనా స్థలాలు 560 వరకూ ఉండేవి. 1980 నాటికి ఆ సంఖ్య 2000 దాటిపోయింది! దేశంలో సుమారు 75,000 ఆస్పత్రులు ఉన్నాయని, 15 లక్షల పాఠశాలలు ఉన్నాయని, అదే సమయంలో మత ప్రార్థనా స్థలాలు మాత్రం 25 లక్షల కన్నా ఎక్కువగా ఉన్నాయని పవన్ వర్మ అనే శాస్త్ర వేత్త తెలిపారు. పర్యాటక రంగంలో దాదాపు 50 శాతం పర్యటనలు దేవాలయాల, ఇతర ప్రార్థనా స్థలాల సందర్శన కోసమే జరుగుతున్నాయి. ఇటీవల ఆరోగ్య కేంద్రాలను, ప్రార్థనా స్థలాలను ఒకే పర్యటనలో సందర్శించే విధంగా పర్యటన ప్యాకేజి లు రూపొందుతున్నాయి.

మత విశ్వాసాలను సైతం నయా ఉదారవాద విధానాలు ఒక పెద్ద మార్కెట్ గా మార్చివేశాయి. వినిమయ తత్వం, ఆధ్యాత్మికత, మత దురహంకారం, అభద్రత, బూటకపు జాతీయవాదం – అన్నీ రకరకాలుగా కలిపి ఆ మసాలాను వడ్డిస్తూ సొమ్ము

చేసుకుంటున్నారు. ఇదే **దేవుళ్ళ మార్కెట్.** ప్రపంచీకరణ క్రమంలో కొత్తగా ఎదుగుతూవచ్చిన నయా సంపన్నులు, నయా మధ్యతరగతి ప్రజలు ఈ మార్కెట్ కు వినియోగదారులు. కొత్త కొత్త రకాల యజ్ఞాలను జరుపుతున్నారు. కొత్త కొత్త మత పండుగలను జరుపుతున్నారు. కొత్త సాంప్రదాయాలను ప్రవేశపెడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు అక్షయ తృతీయ ఒక పవిత్ర పుణ్య దినం అయిపోయింది. ఆ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే పలు విధాల లాభాలు కలుగుతాయన్న విశ్వాసం విపరీతంగా ప్రచారం అయింది. ఆ ఒక్క రోజునే మన దేశంలో 60 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేస్తున్నారు! లెక్కలేనన్ని టివి చానెళ్ళు నిరంతరం మత ప్రచారం పేరుతో నానారకాల కాలం చెల్లిన భావాలను, అశాస్త్రీయ భావాలను ప్రచారం చేస్తూవున్నాయి. వాటిని వీక్షించేవారు సైతం పెరుగుతూనేవున్నారు. భారత దేశపు దేవుళ్ళ మార్కెట్ కి ఉన్న అదనపు 'సౌకర్యం' ఏమంటే ఇక్కడ లెక్కలేనన్ని దేవుళ్ళను మార్కెట్ చేయవచ్చు. లెక్కలేనన్ని క్రతువులను, దీక్షలను, వ్రతాలను ప్రవేశపెట్టవచ్చు.

ఈ మార్కెట్ కేవలం హిందువులకే పరిమితం అనుకోవద్దు. అన్ని మతాలలోనూ ఈ వ్యాపారం పెరిగిపోయింది. లక్షల కోట్ల రూపాయల వ్యాపారం జరిగిపోతోంది. రాందేవ్ బాబా ఆస్తులు రు.8000 కోట్లు దాటిపోయాయి. శ్రీ శ్రీ రవి శంకర్ సంపద కూడా అదే విధంగా పెరిగిపోతోంది. తమ ఉద్యోగులను ఉత్సాహపరచడానికి 'మోటివేషనల్ సెషన్స్' పేరుతో వందల కోట్ల రూపాయలను ఈ బాబాలకు, స్వాములకు సమర్పించుకుంటున్నారు. ఆ బాబాలు, స్వాములు 'ఆధ్యాత్మిక వర్క్‌షాపులు' నడుపుతున్నారు. వాటిలో జాతకాలు చూడడం, దీక్షలు ఇవ్వడం, రత్నాల, వజ్రాల, రంగురాళ్ళ ఆధ్యాత్మిక శక్తులను వశం చేసుకోవడం వంటి అంశాలు ఉంటున్నాయి. ఇదంతా చాలా పెద్ద వ్యాపారం అయిపోయింది. ఆధునికత ముసుగులో ఆధ్యాత్మికత, మూఢవిశ్వాసాలు అన్నివైపులా ప్రచారమౌతున్నాయి.

సోషలిస్టు వ్యవస్థకు తగిలిన ఎదురు దెబ్బలు పోస్ట్‌మోడర్న్ భావాల వ్యాప్తి పెద్ద ఎత్తున సాగడానికి అవకాశం ఇచ్చాయి. **పోస్ట్ మోడర్నిజం** అంటే వర్గ దృష్టిని, గతితార్కిక భౌతికవాదాన్ని తిరస్కరించడమే తప్ప వేరొకటి కాదు. దాని ఫలితంగా అస్తిత్వ భావజాలం బాగా వ్యాపించింది. దానితోబాటు అభద్రతాభావం, వ్యక్తిగత ధోరణులు కూడా బాగా పెరిగాయి. ఈ పరిస్థితి సహజంగానే హిందూత్వ శక్తులు, ఇతర మతోన్మాద శక్తులు బలం పుంజుకోడానికి దోహదపడ్డాయి. ప్రజల మనస్సుల మీద వారు తమ ఆధిపత్యాన్ని పెంచుకోగలుగుతున్నారు.

ఐతే, నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థను ప్రపంచవ్యాప్తంగా ముంచెత్తుతున్న తీవ్ర సంక్షోభం ప్రజల చైతన్యం మీద కూడా తన ప్రభావాన్ని చూపడం మొదలైంది. ముఖ్యంగా యువజనులు నేడు అయోమయంలో, గందరగోళంలో ఉన్నారు. వారికి విద్యార్థి దశలో నేర్పిన జ్ఞానానికి, నేడు సమాజంలో వాస్తవంగా నెలకొన్న పరిస్థితులకు, వారి అనుభవాలకు మధ్య పొంతన లేకుండా పోతోంది. చదువకున్న దశ నుండి బైటకు వచ్చి ఉద్యోగ వేట ప్రారంభించగానే వారి ముందు వేరే ప్రపంచం కనిపిస్తోంది. ఈ యువతను హిందూత్వ శక్తులు మత దురహంకారపూరిత కార్యకలాపాలవైపు మళ్ళించడానికి ప్రయత్నిస్తోంది. దీనిని గనుక అడ్డుకోకపోతే అది వినాశనానికే దారి తీస్తుంది.

కాబట్టి ఇప్పుడు కమ్యూనిస్టులు అత్యంత సమగ్రమైన, శాస్త్రీయమైన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతం అనే ఆయుధాన్ని చేపట్టి ఒక పెద్ద సైద్ధాంతిక పోరాటానికి పూనుకోవాలి. ఏకైక ప్రత్యామ్నాయంగా మనముందు ఉన్న సోషలిజం అనే లక్ష్యం వైపు కొత్త తరాలవారిని నడిపించాలి.

***

# అధ్యయనానికి

| | | | |
|---|---|---|---|
| 1. | గతి తార్కిక భౌతికవాదం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 20/- |
| 1.(బి) | గతి తార్కిక భౌతికవాదం<br>భారతీయ తత్వశాస్త్రం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 50/- |
| 2. | చారిత్రక భౌతిక వాదం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 20/- |
| 3. | రాజకీయ అర్థశాస్త్రం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 40/- |
| 4. | కమ్యూనిస్టు ఉద్యమం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 30/- |
| 5. | సామాజిక తరగతులు | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 30/- |
| 6. | పార్టీ నిర్మాణం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 20/- |
| 7. | పార్టీ కార్యక్రమం | (పార్టీ ఎడ్యుకేషన్ సీరీస్) | - 15/- |
| 8. | భారతదేశంలో పట్టణీకరణ సమస్యలు - పరిష్కారాలు | | - 40/- |
| 9. | సైన్సు - చారిత్రక పరిణామం | విజయవాడ సైన్సు వర్‌షాపు సెమినార్ పత్రాలు | - 100/- |
| 10. | సాంస్కృతిక రంగంలో కర్తవ్యాలు | అధ్యయనం కోసం స్టడీమెటీరియల్ | - 100/- |
| 11. | పార్టీ - నిర్మాణ కర్తవ్యాలు | భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) డాక్యుమెంట్లు | - 200/- |
| 12. | పార్టీ - ప్రజాసంఘాలు | భారత కమ్యూనిస్టుపార్టీ (మార్క్సిస్టు) డాక్యుమెంట్లు | -200/- |
| 13. | పార్టీ నిర్మాణ, నివేదిక, తీర్మానం | (కలకత్తా ప్లీనం 2015 డిసెంబర్ 27-31) | - 75/- |
| 14. | నయా ఉదారవాద విధానాలు<br>కర్మిక వర్గ సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు | అధ్యయన బృందం నివేదిక | - 15/- |
| 15. | పట్టణ సమస్యలు - మధ్య తరగతి | అధ్యయన బృందం నివేదిక | - 15/- |
| 16. | వ్యవసాయ రంగంలో మార్పులు | అధ్యయన బృందం నివేదిక | - 30/- |